
దర్శించండి - తరించండి
స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం
కాణిపాకం, ఐరాల (మం), చిత్తూరు జిల్లా.
సత్య ప్రమాణాలకు, ప్రత్యక్ష నిదర్శనం...
శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం శ్రీ స్వామి వారి
శాశ్వత అన్నదాన ట్రస్టులో భాగస్వామ్యం కండి. మీ విరాళాలను ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చు.
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాణిపాకం బ్రాంచ్
A/c No. 30178925930, IFSC No. SBIN0010105
మరిన్ని వివరాలకు : 08573-281112, 281747



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ



పదవి విరమణ శుభాకాంక్షలు

మా పెద్దలు, సౌమ్యులు, నిగర్వి
డా॥ బత్తుల అప్పారావు గారు.
ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో
నీటిపారుదల శాఖ సహాయ
కార్యదర్శిగా దిగ్విజయంగా పనిచేసి
"నేడు" పదవి విరమణ చేయుచున్న
సందర్భంగా ఆత్మీయ
అభినందనలతో......
- పెద్దిబోయిన శ్రీనివాస్ యాదవ్
రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అఖిల భారత యాదవ మహాసభ



| విజయవాడ | సంపుటి : 25 | సంచిక : 83 | ది. 30-6-2026 | మంగళవారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 25 | Issue No : 83 | Date : 30-6-2026 | Tuesday | Pages : 8 | Rs.1/- |


# రాజ్యాంగ విలువలు,న్యాయపాలన పరిరక్షణలో జస్టిస్ రఘునందన్ రావు సేవలు చిరస్మరణీయం

## –రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్






**అమరావతి, జూన్ 29 (వార్తాప్రభ) :** రాజ్యాంగ విలువలు, న్యాయపాలన పరిరక్షణలో జస్టిస్ రఘునందన్ రావు సేవలు చిరస్మరణీయం అని రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానం ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ లిసా గిల్ అభినందించారు. హైకోర్టు న్యాయమూర్తిగా సేవలు అందిస్తున్న జస్టిస్ రఘునందన్ రావు పదవీ విరమణ సందర్భంగా సోమవారం హైకోర్టు మొదటి కోర్టు హాల్లో ఘనంగా వీడ్కోలు కార్యక్రమం జరిగింది. ఈ వీడ్కోలు కార్యక్రమంలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్ మాట్లాడుతూ జస్టిస్ రఘునందన్ రావు న్యాయ ప్రస్థానం, న్యాయపరమైన నిష్పాక్షికత, రాజ్యాంగ విలువల పట్ల అచంచల నిబద్ధత, న్యాయవ్యవస్థ ఆధునీక రణలో ఆయన చేసిన విశిష్ట కృషిని కొనియాడారు. న్యాయవాదిగా విశేష అనుభవాన్ని సంపాదించిన తదుపరి న్యాయమూర్తిగా ధర్మాసనాన్ని అలంకరించి రాజ్యాంగ స్ఫూర్తిని, న్యాయ పాలనను అత్యున్నత ప్రమాణాలతో పరిరక్షించారని ఆమె పేర్కొన్నారు.రాజ్యాంగపరమైన అంశాలు, సంక్లిష్టమైన సివిల్ వివాదాలు, పన్నుల సంబంధిత కేసులు, ప్రజాప్రయోజన వ్యాజ్యాలు వంటి అనేక కీలక అంశాల్లో ఆయన వెలువరించిన తీర్పులు న్యాయవ్యవస్థకు మార్గదర్శకంగా నిలుస్తాయని జస్టిస్ లిసా గిల్ పేర్కొన్నారు. తన పదవీకాలంలో సుమారు 25 వేల కేసులను వేగవంతంగా, సమర్థవంతంగా పరిష్కరించడం ద్వారా జస్టిస్ రఘునందన్ రావు న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేశారని ఆమె పేర్కొన్నారు.న్యాయపరమైన బాధ్యతలతో పాటు పరిపాలనా వ్యవహారాల్లోనూ ఆయన అసాధారణ నాయకత్వాన్ని ప్రదర్శించారని, న్యాయస్థానాల మౌలిక సదుపాయాల అభివృద్ధి, సమాచార సాంకేతికత వినియోగం, న్యాయ ప్రక్రియల డిజిటలైజేషన్, న్యాయసేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.పరిపాలనా కమిటీ, మౌలిక సదుపాయాల అభివృద్ధి కమిటీ, నియామకాలు, బదిలీలు, న్యాయస్థానాల కంప్యూటరీకరణ,ఆర్థిక వ్యవహారాలు, హైకోర్టు పరిపాలన తదితర కీలక కమిటీలలో ఆయన పోషించిన పాత్ర ఆంధ్రప్రదేశ్ న్యాయవ్యవస్థ అభివృద్ధికి బలమైన పునాదులు వేసిందని ప్రధాన న్యాయమూర్తి పేర్కొన్నారు.

**ప్రజల హక్కుల పరిరక్షణే న్యాయస్థానాల అత్యున్నత ధర్మం-జస్టిస్ రఘునందన్ రావు..** వీడ్కోలు సందర్భంగా జస్టిస్ రఘునందన్ రావు మాట్లాడుతూ న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరిస్తూ చేసిన రాజ్యాంగ ప్రమాణాన్ని తన పదవీకాలమంతా నిబద్ధతతో పాటించేందుకు కృషి చేశానని తెలిపారు.న్యాయమూర్తిగా పని చేసిన ఈ ఆరున్నర సంవత్సరాలు తన జీవితంలో అత్యంత విలువైన అనుభవాలను అందించాయని పేర్కొన్నారు. న్యాయస్థానమే తమకు మొదటి చివరి ఆశ్రయంగా భావించే సాధారణ ప్రజల బాధలు, వారి న్యాయపోరాటాన్ని దగ్గరగా అర్థం చేసుకునే అవకాశం తనకు లభించిందన్నారు.తమ హక్కులను కాపాడుకునేందుకు మరే ప్రత్యామ్నాయం లేని ప్రజలకు హైకోర్టే చివరి ఆశ్రయం అన్నారు.అలాంటి ప్రతి పౌరుడి రాజ్యాంగ హక్కులను పరిరక్షించడం న్యాయవ్యవస్థ యొక్క అత్యున్నత బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. న్యాయమూర్తుల గౌరవం వారి పదవుల వల్ల కాకుండా, న్యాయం కోసం ఆశ్రయించిన ప్రతి వ్యక్తికి ఎంత నిబద్ధత తో న్యాయం చేశామనే దానిపైనే ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు.న్యాయ వ్యవస్థ ప్రభుత్వంతో కలిసి పని చేయడంతో పాటు రాజ్యాంగాన్ని, న్యాయపాలనను పరిరక్షించడానికి, ప్రభుత్వ చర్యల వల్ల పౌరుల హక్కులు ఉల్లంఘించబడకుండా కాపాడటానికే న్యాయ స్థానాలు ఉన్నాయని ఆయన స్పష్టంగా పేర్కొ న్నారు. ఉమ్మడి హైకోర్టు విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు సాధించిన ప్రగతిని ప్రస్తావిస్తూ న్యాయస్థానాల మౌలికసదుపాయాల అభివృద్ధి, త్వరలో అందుబాటులోకి రానున్న నూతన హైకోర్టు భవనం, గత రెండేళ్లుగా నమోదైన కేసుల కంటే ఎక్కువ కేసులను పరిష్కరించిన ఘనత, జాతీయ స్థాయిలో న్యాయవ్యవస్థ పని తీరుకు లభించిన గుర్తింపును జస్టిస్ రఘునందన్ రావు ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.దేశంలోని అత్యుత్తమ హైకోర్టుల సరసన ఆంధ్రప్రదేశ్ హైకోర్టును నిలబెట్టేందుకు రాబోయే తరాలు మరింత కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. తన ప్రసంగం ముగింపులో పరమపూజ్య దలైలామా సందేశాన్ని ఉటంకిస్తూ, "ఈ భూమిపై మనం అతిథులమని, మన జీవితకాలంలో ఇతరులకు ఉపయోగపడే, వారి సంతోషానికి దోహదపడే మంచి పనులు చేయడమే జీవితానికి నిజమైన అర్థం" అని పేర్కొన్నారు.ఈ మహోన్నత న్యాయస్థానంలో సేవ చేసే అవకాశం లభించడం తన అదృష్టంగా భావిస్తున్నానని, ప్రజల రాజ్యాంగ హక్కుల పరిరక్షణలో ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం ఎల్లప్పుడూ నిబద్ధతతో ముందుంటుందనే దృఢ విశ్వాసంతో ధర్మాసనం నుంచి వీడ్కోలు తీసుకుంటున్నానని జస్టిస్ రఘునందన్ రావు తెలిపారు. ఈ సందర్భంగా అడిషినల్ సోలిసిటర్ జనరల్ చల్లా ధనుంజయ్,అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, ఏపీ హైకోర్టు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ప్రభునాథ్ వాసిరెడ్డి,ఏపీ బార్ కౌన్సిల్ ఛైర్మన్ ధ్వారకానాథ్ రెడ్డి తదితరులు జస్టిస్ రఘునందనరావుకు పదవీ విరమణ శుభాకాంక్షలు తెలుపుతూ తమ అనుభవాలను పంచుకున్నారు.

# కొత్త ఆలోచనలకు... అవకాశాలకు సీఐఐ సదస్సు వేదిక కావాలి

- ఎంఓయూలు, పెట్టుబడులతోపాటు నాలెడ్జ్ షేరింగ్ మీద ఎక్కువ దృష్టి
- సీఐఐ భాగస్వామ్య సదస్సు-2026 సన్నాహక సమావేశంలో సీఎం చంద్రబాబు



**అమరావతి, జూన్ 29 (వార్తాప్రభ) :** విశాఖ భాగస్వామ్య సదస్సు గతానికి భిన్నంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఈసారి ప్రాంతీయ స్థాయిలో కూడా సదస్సులు నిర్వహించాలని సూచించారు. నవంబర్ నెలలో నిర్వహించే 31వ సీఐఐ సదస్సుపై సోమవారం రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్షించారు. నవంబర్ 12, 13వ తేదీల్లో విశాఖలో సీఐఐ భాగస్వామ్య సదస్సు నిర్వహించాలని నిర్ణయించారు. అలాగే ప్రాంతీయ స్థాయిలో భాగస్వామ్య సదస్సులు నిర్వహించే అంశంపై చర్చించారు. థీమ్‌తో 31వ పార్టనర్షిప్ సమ్మిట్ నిర్వహించనున్నారు. ఈ సదస్సులో భాగంగా ఎంఓయూలు కుదుర్చుకోవడం, మినిస్టీరియల్ సెషన్స్, ప్లీనరీ, కంట్రీ సెషన్స్, బీ2బీ, బీ2జీ సమావేశాలతో రెండు రోజుల భాగస్వామ్య సదస్సు నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు చేయాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. విశాఖ భాగస్వామ్య సదస్సుకు జాతీయ, అంతర్జాతీయ కంపెనీల ప్రతినిధులు, కేంద్ర మంత్రులు, వివిధ దేశాలకు చెందిన డెలిగేట్స్‌ను ఆహ్వానించాలని సీఎం సూచించారు. భాగస్వామ్య సదస్సు నిర్వహణకు సంబంధించి వివిధ రాష్ట్రాలకు చెందిన సీఎంలకు లేఖలు రాయాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. విశాఖ భాగస్వామ్య సదస్సుకు సంబంధించి దేశ విదేశాల్లో పెద్ద ఎత్తున ప్రచారం కల్పించాలని సీఎం చెప్పారు. ఈ మేరకు జూలై నుంచి సెప్టెంబర్ వరకు దేశవిదేశాల్లో రోడ్ షోలు చేపట్టాలని ఆదేశించారు. దీంట్లో భాగంగా ఢిల్లీ, బెంగళూరు, చెన్నై, ముంబై, కోయంబత్తూర్, అహ్మదాబాద్, హైదరాబాద్ వంటి ప్రాంతాల్లో సీఐఐ పార్టనర్ షిప్ సదస్సులకు సంబంధించి రోడ్ షోలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. అలాగే ప్రధాన భాగస్వామ్య సదస్సుకంటే ముందుగానే విశాఖ, రాజమండ్రి లేదా కాకినాడ, అమరావతి, అనంతపురం, తిరుపతి నగరాల్లో ప్రాంతీయ భాగస్వామ్య సమావేశాలు నిర్వహించాలని సూచించారు. అంతే కాకుండా.. ఈ సదస్సుల్లో ఎంఓయూలు కుదర్చుకునే అంశంపై అధికారులు ఎలాంటి ప్రణాళికలు చేపట్టారని ముఖ్యమంత్రి అడిగారు. ఏయే ప్రాంతాల్లో ఏయే రంగాలకు చెందిన పరిశ్రమలు స్థాపించేందుకు అవకాశం ఉంటుందో బేరీజు వేసుకుని.. ఆ మేరకు ఆయా ప్రాంతీయ సదస్సుల్లో ఎంఓయూలు కుదుర్చుకునేలా ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు తెలిపారు.

**లీడర్లదే భవిష్యత్...** ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ..."భాగస్వామ్య సదస్సులు అంటే కేవలం పెట్టుబడులు రాబట్టడం, ఎంఓయూలు కుదుర్చుకోవడం అనే భావన పోవాలి. భాగస్వామ్య సదస్సుల్లో వివిధ కీలక అంశాల మీద చర్చ జరగాలి. ఎన్ని పెట్టుబడులు వస్తున్నాయి... ఎన్ని ఎంఓయూలు కుదుర్చుకున్నామనే దానికంటే నాలెడ్జ్ షేరింగ్ ఎంత వరకు చేసుకోగలుగుతున్నామనేది ముఖ్యం. అందుకే విశాఖలో జరగబోయే 31వ భాగస్వామ్య సదస్సులో జరిగే కార్యక్రమాలపై ప్రజలు చర్చించుకోవాలి. వినూత్నంగా ఆయా రంగాలను ఏ విధంగా అభివృద్ధి సాధించాలనే ఆలోచనలు రేకెత్తించాలి. టెక్నాలజీ సహా వివిధ అంశాల గురించి అందరూ మాట్లాడుతున్నారు. కానీ ఆయా రంగాల్లో ఛాంపియన్ గా నిలిచిన వాళ్లే గ్లోబల్ లీడర్లుగా ఎదుగుతున్నారు. ఫ్యూచరిస్టిక్ రంగాలపై ఎక్కువ దృష్టి సారించాలి. ప్రముఖ యూనివర్శిటీలకు చెందిన నిపుణులు భాగస్వామ్య సదస్సుకు వచ్చేలా చూడాలి. సీఐఐ గ్లోబల్ లీడర్ షిప్ సెంటర్‌ను అమరావతిలో ఏర్పాటు చేసుకోబోతున్నాం. విశాఖలో జరగబోయే పార్టనర్ షిప్ సమ్మిట్లో పబ్లిక్ పాలసీలపై కీలక చర్చలు జరగాలి. వ్యాపారాలు, పెట్టుబడులు వంటి అంశాలతో పాటు ఆయా రంగాల్లో సవాళ్లు ఎదురైతే వాటిని ఎలా అధిగమించాలనే అంశంపై రకరకాల చర్చలు జరగాలి. వ్యవసాయం, ఉద్యానరంగం, ప్రకృతి వ్యవసాయం, సర్క్యులర్ ఎకానమీ, ఆధ్యాత్మికత, స్ట్రెస్ ఫ్రీ వర్క్ వంటి అంశాలపై చర్చించాలి."అని ముఖ్యమంత్రి సూచించారు.

# ఉద్యోగులకు తీపి కబురు.....

- ఉద్యోగులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం

గత నెల 29న మొదటి విడతలో రూ. 2 వేల కోట్లు విడుదల

**హైదరాబాద్,జూన్ 29 (వార్తాప్రభ) :** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పట్ల తమకున్న చిత్తశుద్ధిని తెలంగాణ ప్రభుత్వం మరోసారి చాటుకుంది. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, ఉద్యోగులకు ఇచ్చిన హామీని నెరవేరుస్తూ, బకాయిల చెల్లింపు ప్రక్రియను వేగవంతం చేసింది. ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా అడుగులు వేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కల ఆదేశాల మేరకు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా సోమవారం 2000 కోట్ల రూపాయల నిధులను విడుదల చేశారు. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ఉద్యోగులు, రిటైర్డ్ సిబ్బందిలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఉద్యోగ జేఏసీ నాయకులకు ఇచ్చిన హామీ మేరకు, సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న బకాయిలను 100 రోజుల్లో రూ. 6,000 కోట్లు విడుదల చేస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో, గత నెల 29న మొదటి విడతగా రూ. 2వేల కోట్లను విడుదల చేసిన ప్రభుత్వం, ఈరోజు రెండో విడతలో మరో రూ. 2 వేల కోట్ల నిధులను విడుదల చేసి తన నిబద్ధతను నిరూపించుకుంది. పదవీ విరమణ పొందిన ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోంది.


IN THE COURT OF II ADDL JUNIOR CIVIL JUDGE : VIJAYAWADA
O.S No.2116 OF 2021

Between :
Canara Bank,
Buckinghampet Branch
(Erst-while Syndicate Bank),
Vijayawada,
Andhra Pradesh
Rep.by its Chief Manager -------------Plaintiff

AND

M/s Vijayawada Doors and Plywoods
Rep by its Prop : Kasi Reddy Rami Reddy
-------------Defendant

To:
Defendant
M/s. Vijayawada Doors and Plywoods Rep by its Proprietor : Kasi Reddy Rami Reddy Aged about 41years S/o K.Subba Reddy, 21/1, Main Road, Rayanapadu, Gollapudi, Vijayawada, Krishna District, Andhra Pradesh - 521241

పై నెంబర్ దావాలో ప్రతివాదులు అయిన మీకు పై దావా నెంబర్.2116/2021 నోటీసులు పంపగా తీసుకొనక కాలయాపన చేయుచునందున ఈ పేపర్ ప్రకటన ద్వారా పై దావా సంగతులు తెలియచేయవలసినదిగా పై కోర్టు వారు ఆదేశించియున్నారు. కావున ది.02-07-2026 ఉదయం గం.10-30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని లేదా మీ న్యాయవాది ద్వారా గాని హాజరై మీ యొక్క అభ్యతరములు తెలుపుకొనవలెను. లేనిచో మీ పరోక్షమున విచారించి తీర్మాణించెదరని ఈ మూలంగా తెలియచేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా : 02-07-2026

Sri. B.SURYANARAYANA KUMAR, B.Com, BL.,
B.SAI KRISHNA KARTHIK, MBA, LLB.,
ADVOCATES
BSNK Law Associates
D.No : 32-15-104, Flat No:01, Classic Towers,
Ratnamamba Street, Moghalrajpuram,
Vijayawada-10



Court Notice

In the court of the Ist Additional Civil judge ( JUNIOR DIVISION) at Vijayawada
O.S No: 23/2022

Between:-
పి శ్యా. సూర్య ప్రకాశరావు,
తండ్రి లేటు వరహాలు,
డోర్ నెంబరు : 9-48-16, కుమ్మరివీధి,
4వ లైను, నెహ్రూ బొమ్మ సెంటర్, కొత్తపేట,
విజయవాడ -1..........................వాది.
మరియు
శ్యామల దేవి కొరాడి,
భర్త : తరుణ్ కుమార్ ,
డోర్ నెం:6-20-14రు, పరుచు రామయ్య వీధి,
కొత్తపేట , విజయవాడ-1.............ప్రతివాది.

పై నెంబరు దావా లో వాది, ప్రతివాది నుండి ప్రోనోటు బాకీ మొత్తంను రాబట్టు కొనుటకు దావా దాఖలు చేయగా , ప్రతివాది అయిన మీకు నోటీసులు జారీ చేయు నిమిత్తం శ్రీ కోర్టు వారు ప్రత్యమ్నాయ సర్వీసుగా పేపరు ప్రకటన ద్వారా నోటీసు ఆర్డర్ చేసి యున్నారు. కావున ప్రతివాది అయిన మీరు ది 14-07-2026 న ఉదయం గం॥10-30 నిమిషము లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయముగా గాని, మీ న్యాయవాది గారి ద్వారా గాని, హాజరై మీకు గల అభ్యంతరములు తెలియజేయగలరు. లేని యెడల శ్రీ కోర్టు వారు మీ పరోక్షమున తీర్మానించెదరు

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం //
వాయిదా తేది: 14/07/2026
ఇట్లు
పిళ్ళా రవి ,
వాది తరపున న్యాయవాది,
సామారంగ చౌక్ , విజయవాడ-1
సెల్ ఫోన్ : 9848110109


# ప్రభుత్వ సేవలు మరింత సులభతరం

- మనమిత్ర ద్వారా ఫిర్యాదుల స్వీకరణ
- ఆర్టీజీఎస్ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- జిల్లాల్లో క్షేత్రస్థాయి పర్యటనకు సర్క్యులర్ జారీ చేసినట్లు తెలిపిన అధికారులు



**అమరావతి, జూన్ 29 (వార్తాప్రభ) :** ప్రభుత్వ సేవలు ప్రజలకు సులభంగా అందించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలోని ఆర్టీజీఎస్ సెంటర్ నుంచి వివిధ శాఖల పనితీరుపై సీఎం సమీక్షించారు. ఈ మేరకు ప్రభుత్వ సేవలను ప్రజలకు అందించే అంశంపై అధికారులకు ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు. ప్రజలతో నిత్యం సంబంధాలున్న శాఖలు, విభాగాల్లో ప్రభుత్వ సేవలు పొందడం సులభతరం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈ మేరకు సేవల్ని సులభతర ప్రక్రియను మొదలు పెట్టామని.. ముందుగా 11 రకాల సేవల్లో ప్రక్రియలను కుదిస్తున్నామని అధికారులు తెలిపారు. అలాగే ప్రజా ఫిర్యాదుల వ్యవస్థను ప్రజలకు మరింత అందుబాటులోకి తీసుకురావాలని సీఎం ఆదేశించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు. ఆన్‌లైన్లో ఫిర్యాదులు చేసే అవకాశాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంతోపాటు... మనమిత్ర వాట్సాప్‌లో కూడా ఫిర్యాదులు చేసే అవకాశం కల్పించాలన్నారు. వాయిస్ మెసేజెస్ పెట్టినా వాటిని కూడా ఫిర్యాదులుగా స్వీకరించేలా చూడాలని సీఎం అధికారులకు సూచించారు. రాష్ట్రంలో మొబైల్ నెట్‌వర్క్ సమస్యలు లేకుండా చూడాలన్నారు. రాష్ట్రంలో సుమారు 3 వేల ప్రాంతాల్లో కనెక్టివిటీ సమస్య ఉందని.. మూడు నెలల్లో సమస్య పరిష్కరించాలన్నారు. ఈ మేరకు నెట్‌వర్క్ సంస్థలతో మాట్లాడాలని సూచించారు. నవచేతన పేరుతో స్త్రీ శిశు సంక్షేమ శాఖ చేపట్టిన ఎర్లీ చైల్డ్ హుడ్ డెవలప్మెంట్ స్క్రీనింగ్ విధానంపై సమావేశంలో అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు.

# షైనింగ్ స్టార్లే మా బ్రాండ్ అంబాసిడర్లు!

- దేశం మొత్తం ఏపీ మోడల్ ఎడ్యుకేషన్ గురించే మాట్లాడాలి
- వచ్చే ఏడాది 2లక్షలమంది ప్రైవేటు నుంచి ప్రభుత్వ స్కూళ్లకు రావాలి
- విద్యార్థికోణం నుంచే విద్యాశాఖలో సంస్కరణలు చేపట్టాం
- ప్రభుత్వ స్కూళ్లలో సీట్లకు రికమండేషన్ అడిగే రోజులు వచ్చాయి
- షైనింగ్ స్టార్స్ సత్కార కార్యక్రమంలో రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి లోకేష్



**తాడేపల్లి,జూన్ 29 (వార్తాప్రభ) :** ఇప్పుడు మనం బెస్ట్ టీచర్లను సింగపూర్, ఫిన్ లాండ్ కి పంపుతున్నాం. అక్కడ ఉన్న బెస్ట్ ప్రాక్టీసెస్ రాష్ట్రంలో అమలు చేస్తున్నాం. నా కోరిక ఒక్కటే. భవిష్యత్తులో దేశం మొత్తం ఏపీ మోడల్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ గురించే మాట్లాడాలి. వచ్చే ఏడాది రెండు లక్షల మంది ప్రైవేట్ నుండి ప్రభుత్వ పాఠశాలల్లో చేరాలి, షైనింగ్ స్టార్లే మా బ్రాండ్ అంబాసిడర్లని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. గత ఏడాది పదోతరగతి, ఇంటర్మీడియట్ లో ఉత్తమ ఫలితాలు కనబర్చిన విద్యార్థులను పాఠశాల విద్యాశాఖ తరపున మంత్రి లోకేష్ తాడేపల్లిలోని సిఎస్ఆర్ ఫంక్షన్ హాలు వేదికగా ఘనంగా సత్కరించారు. 55మంది టెన్త్ షైనింగ్ స్టార్లకు....రూ. 30వేలు ప్రైజ్ మనీ, మెడల్, సర్టిఫికేట్, 61మంది ఇంటర్మీడియట్ షైనింగ్ స్టార్లకు ల్యాప్ ట్యాప్, మెడల్ అందజేశారు.

**మీరు గెలిచారు, నన్ను గెలిపించారు..** ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... షైనింగ్ స్టార్స్... మిమ్మల్ని చూసిన తర్వాత నాకు అబ్దుల్ కలాం గారు చెప్పిన ఒక మాట చెప్పాలనిపించింది. నిద్రలో కనిపించేది కల కాదు... కల మిమ్మల్ని నిద్రపోనివ్వదు. నిద్రపోకుండా మీరు పడిన కష్టం మిమ్మల్ని షైనింగ్ స్టార్స్ గా నిలబెట్టింది. మీరు గెలిచారు...నన్ను గెలిపించారు. మన విద్యావ్యవస్థను గెలిపించారు. మీరు పాఠశాలలకు పూర్వ వైభవం తీసుకొచ్చారు. మీకు తక్కువ మార్కులు వస్తే నాకు సీఎం గారు తక్కువ మార్కులు వేస్తారు. షైనింగ్ స్టార్స్ ఎక్కువ మార్క్లు తెచ్చుకున్నారు. నాకు ఎక్కువ మార్కులు పడేలా చేసారు. మీ పెర్ఫార్మెన్స్ వల్ల మంత్రిగా నా గౌరవంతోపాటు 2లక్షలమంది టీచర్ల గౌరవం కూడా పెరిగింది. గతంలో ప్రభుత్వ స్కూళ్లంటే చిన్నచూపు ఉండేది. చరిత్ర తిరగరాసిన ఘనత మీ అందరిది. జులైలో మెగా పిటిఎం నిర్వహిస్తాం. మొదటి పిటిఎంలో ప్రభుత్వ పాఠశాలలకు పూర్వవైభవం తెస్తానని చెప్పా. మీ అందరి కృషి, కష్టంతో ఆ మాటను సుసాధ్యం చేశా.


ప్రకటన

ఎన్‌టిఆర్ జిల్లా, విజయవాడ, సత్యనారాయణపురం, శివరావు వీధి, డోరు నెం.23-23-22 కాపురస్తురాలు జూపూడి బాల రంగారావు గారి భార్య జూపూడి వెంకట నాగదేవి అను నేను తెలియపరచునదేమనగా నాయొక్క పుట్టినతేది:17-10-1962. కానీ పాసుపోర్టు నెం.M4276460 నందు పుట్టిన తేది: 15-05-1961గా తప్పుగా నమోదుకాబడినది. కావున యావన్మందికి తెలియజేయుచున్నాను.

సెల్ నెం. 9493722886



ప్రకటన

ఎన్‌టిఆర్ జిల్లా, విజయవాడ, సత్యనారాయణపురం, శివరావు వీధి, డోరు నెం.23-23-22 కాపురస్తుడు జూపూడి కుటుంబరావు గారి కుమారుడు జూపూడి బాల రంగారావు అను నేను తెలియపరచునదేమనగా నాయొక్క పుట్టిన తేది: 30-04-1956. కానీ పాసుపోర్టు నెం.M4352658 నందు పుట్టిన తేది: 30-04-1957గా తప్పుగా నమోదుకాబడినది. కావున యావన్మందికి తెలియజేయుచున్నాను.

సెల్ నెం. 9849249585


'ఆసిడ్ ప్లే'పై అపోహలు వద్దు సరైన అవగాహనతోనే రక్షణ

- చర్మంపై నలిపితేనే సమస్య సూర్య స్కిన్ హాస్పిటల్ అధినేత డా. కడి రమేష్

- 7లో

# ఆంధ్రాలో పాస్ పోర్ట్ అవసరమా?

● వైసిపి జిల్లా లీగల్ సెల్ కార్యదర్శి లాయర్ శిరసాని ప్రకాష్



**విస్సన్నపేట,జూన్ 29 (వార్తాప్రభ)** : అమరావతి సి ఆర్ డి ఏ పరిధిలో రైతులు ఆహ్వానం మేరకు వైసీపీ నాయకులు వెళితే కూటమి పార్టీ కి చెందిన కొందరు రాళ్లు, కోడిగుడ్లు తో దాడి చేయడం దురదృష్టకరమని ఎన్టీఆర్ జిల్లా లీగల్ సెల్ కార్యదర్శి సిరసాని ప్రకాష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని పరిపాలించిన మాజీ మంత్రులు సైతం అమరావతిలో పర్యటించాలంటే పాస్ పోర్టు తీసుకునే పరిస్థితిలో ఉన్నదని ఇది రాజ్యాంగ విరుద్ధమన్నారు. రెండవ విడత భూసేకరణకు భూములు ఇవ్వమని రైతుల్ని ప్రభుత్వం వేధిస్తున్న తరుణంలో వారి ఆహ్వానం మేరకు మద్దతు ఇచ్చేందుకు వెళ్లిన మా వైసీపీ నేతలు మొదలు పెట్టిన పర్యటనను ఉండవెల్లి పెనుమాక ప్రాంతాలలో టిడిపి నాయకులు అడ్డుకోవడం స్వేచ్ఛని హరించటమేనన్నారు. దేశం యావత్తు ప్రత్యక్ష వాస్తవాలను చూస్తుందన్నారు.

# పోలియో రైతు సమాజం కూటమి ప్రభుత్వ లక్ష్యం

-తిరువూరు ఏఎంసి వైస్ చైర్మన్ కె.వి నాగేశ్వరరావు



**విస్సన్నపేట,జూన్ 29 (వార్తాప్రభ)** : స్థానిక మండల కేంద్రంలో బస్టాండ్ ప్రాంగణంలో పల్స్ పోలియో చుక్కల కార్యక్రమంలో తిరువూరు ఏఎంసీ వైస్ చైర్మన్ ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు వైభవ్ జ్యుయలరీ అధినేత కె.వి నాగేశ్వరరావు పాల్గొన్నారు. పోలియో రైతు సమాజాన్ని సాధించే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కేంద్రంలో బిజెపి రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారన్నారు. చిన్నారులకు ఆయన పోలియో డ్రాప్స్ వేయడం జరిగింది.

# సంక్షేమ పథకాలపై సుదీర్ఘ చర్చ

-మండల టిడిపి అధ్యక్షులు రాయల సుబ్బారావు




**విస్సన్నపేట,జూన్ 29 (వార్తాప్రభ)** : స్థానిక మండలంలో మండల అభివృద్ధి సంక్షేమ పథకాలపై ఎంపీడీవో చిన్న రాట్నాలు తో మండల టిడిపి అధ్యక్షులు రాయల సుబ్బారావు సుదీర్ఘంగా చర్చించారు.

# కోకనాడ అన్నదాన సమాజం అభివృద్ధికి కృషి చేస్తాం: చైర్మన్ చింతా పేర్రాజు



**కాకినాడ,జూన్ 29 (వార్తాప్రభ)** : కోకనాడ అన్నదాన సమాజం అభివృద్ధితో పాటు మరిన్ని సేవా కార్యక్రమాలను విస్తరించేందుకు కృషి చేస్తున్నట్లు సంస్థ చైర్మన్ చింతా పేర్రాజు తెలిపారు. సోమవారం కోకనాడ అన్నదాన సమాజంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమాన్ని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు) సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా స్టోర్‌రూమ్‌ను తనిఖీ చేసి నిర్వహణకు సంబంధించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ చింతా పేర్రాజు మాట్లాడుతూ, కోకనాడ అన్నదాన సమాజం ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతిరోజూ సుమారు 150 మంది విద్యార్థులు, విద్యార్థినులతో పాటు అవసరమైన పలువురికి ఉచితంగా అన్నదానం చేస్తున్నట్లు చెప్పారు. అలాగే ప్రతి వేసవిలో 40 రోజుల పాటు చలివేంద్రాన్ని నిర్వహిస్తూ ప్రజలకు సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టి సంస్థ సేవలను విస్తరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, తెలుగుదేశం పార్టీ నాయకులు గదుల సాయిబాబా, బలరామ్, కార్యనిర్వాహణ అధికారి పి.వి. సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# ఎజ్జు శివాజి ని సత్కరించిన కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ రఘురామ్



**పెడన,జూన్ 29 (వార్తాప్రభ)** : ఆకులమన్నాడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం 2025-26 సంవత్సరానికి గాను సంఘ సభ్యులు తీసుకున్న రుణాలను 100 శాతం రికవరీ చేయడం జరిగింది ఈ సందర్భంగా జడ్పీ కన్వెన్షన్ హాల్ లో సోమవారం నాడు జరిగినటువంటి కేడీసీసీ బ్యాంక్ మహాజనసభలో సంఘ చైర్పర్సన్ ఎజ్జు శివాజీ ని అపకబ్ ఎండీ రామకృష్ణ కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాం ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ100 శాతం రికవరీకి సహకరించిన రైతులకు నాకు చైర్మన్ గా అవకాశం కల్పించినటువంటి పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ కి ధన్యవాదాలు తెలియజేశారు

# వేంపాడులో రూ.2 లక్షలతో బస్సు షెల్టర్ నిర్మాణం

వేంపాడు బస్ షెల్టర్ ను ప్రారంభించిన ఆర్టీసీ అధికారులు






**ఉంగుటూరు, జూన్ 29 (వార్తాప్రభ)** : ఉంగుటూరు మండలం పరిధిలో వేంపాడు గ్రామంలో కి"శే మునగా కోటేశ్వరరావు (తండ్రి), కీ"శే మునగా వెంకటరత్నమ్మ (తల్లి), కీ" శే మునగా నాగమణి (భార్య) వారి జ్ఞాపకార్థంగా మునగా సుభాష్ చంద్రబోస్ రెండు లక్షల రూపాయలతో బస్సు షెల్టర్ ను నిర్మించారు. మునగా సుభాష్ చంద్రబోస్ సహకారంతో ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించిన నూతన బస్సు షెల్టర్ ను సోమవారం ఆర్టీసీ అధికారులు, గ్రామ పెద్దలు కలిసి ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. చంద్రబోస్ మాట్లాడుతూ గ్రామ ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న బస్సు సౌకర్యం మరియు బస్ షెల్టర్ ఏర్పాటు చేసినందుకు సంతోషంగా ఉందని అన్నారు. ఇకపై ప్రయాణికులు ఎండ, వర్షం నుండి రక్షణ పొందుతూ బస్సు ప్రయాణం కొరకు వేచి ఉండుటకు సౌకర్యవంతంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గన్నవరం బస్సు డిపో మేనేజర్ శివాజీ, సూపర్వైజర్ మధు, కంట్రోలర్ బాబురావు, గ్రామ ప్రజలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# సుగుణాల నాయకులు ఎందరు?



**విస్సన్నపేట,జూన్ 29 (వార్తాప్రభ)** : నేటి సమాజంలో విద్య వైద్య వాణిజ్య రాజకీయ రంగాలు ఏవైనా అభివృద్ధి చెందాలంటే సంబంధించిన యజమాని లేక నాయకుడనే వాడు ఎలా ఉండాలంటే మాటలకంటే చేతల్లోనే ఎక్కువ పనితనం కనబడుతూ నాయకత్వ ప్రతిభతో ఉండాలి. వినే గుణం ముందు తమ వద్దకు వచ్చే వాళ్ళ మాటలో వినటం తర్వాతే నిర్ణయం తీసుకోవడం అందరికంటే తానే తెలివైన వాడినని అనుకోకుండా ఉండటం మొదటి లక్షణం అయితే, వ్యాపారంలో లాభాలు లేక విజయం వస్తే తమతో పాటు పనిచేసిన టీంకు క్రెడిట్ ఇవ్వడం ఫెయిల్ లేదా నష్టం వస్తే తానే ముందుండి బాధ్యతగా భరోసా ఇస్తూ ఎక్కడ తేడా వచ్చిందో చూసుకొని ఈసారి జాగ్రత్త పడదాం అని చెప్పడం అనేది అనుభవజ్ఞుడైన నాయకుడు లక్షణం అని చెప్పవచ్చు. రేపు ఏమి చేయాలి అనే పథక రచన పర్ఫెక్ట్ గా ఉండి ఎటు వెళ్తున్నాము ఎందుకు వెళ్తున్నాము అనేది స్పష్టంగా చెప్పగలిగిన దార్శనికత ఉండటం అవసరం అని చెప్పవచ్చు. వీటి అన్నిటిని మించి చెప్పింది చేయటం చేసేదే చెప్పటం మాట ఇస్తే మడిమ చెప్పకుండా ఉండటం కష్టమైన నిర్ణయం అయినా అవసరం అయితే తీసుకోవటం ప్రధాన క్వాలిటీలై ఉండాలని ఉత్తమోత్తమ లీడర్ షిప్ లక్షణాలుగా భావించబడుతున్నాయి. నాయకుడనేవాడు బాస్ కానే కాదు. సేవకుడుగా జనం గుండెల్లో శాసనం రాసేవాడై ఉండాలి గాని ఫైలు మీద సంతకాలు పెట్టడానికి మాత్రమే కాదని గుర్తించాల్సిన అవసరం ఉన్నది. నేటి సమాజంలో ఎదుగుతున్న ప్రతి ఒక్క వ్యక్తికి రంగం ఏదైనా లక్షణాలు ఇవేనని కొసమెరుపుగా చెప్పుకోవచ్చు . నేటి సమాజంలో ఓడ ఎక్కిన తర్వాత ఒక మాట ఓడ ఎక్కక ముందు మాటకు తేడా రావడం వలనే సుదీర్ఘకాలం ప్రజల గుండెలలో గూడుకట్టుకోలేకపోతున్నారని సర్వత్రా వినిపిస్తుంది.

# కాకర్ల రామన్నపాలెం ఆంజనేయస్వామి ఆలయం తొలగింపు ఆపాలి: పీజీఆర్ఎస్ ద్వారా ఎమ్మార్వోకు వినతి



**తిరువూరు,జూన్ 29 (వార్తాప్రభ)** : ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మండలం కాకర్ల రామన్నపాలెం గ్రామ సరిహద్దులోని వేంసూర్ అడ్డరోడ్డు వద్ద ఆర్‌డబీ స్థలంలో ఉన్న ఆంజనేయస్వామి వారి దేవస్థానాన్ని రోడ్డు విస్తరణలో భాగంగా తొలగించవద్దని కోరుతూ స్థానిక నాయకులు సోమవారం పీజీఆర్ఎస్ ద్వారా తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. రోడ్డు వెడల్పు పనుల్లో ఈ పురాతన ఆలయానికి నష్టం కలిగే అవకాశం ఉందని, భక్తుల మనోభావాలు దెబ్బతింటాయని నాయకులు వినతిపత్రంలో పేర్కొన్నారు. ఆలయానికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని, అవసరమైతే రోడ్డు డిజైన్‌లో మార్పులు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, "ఆంజనేయస్వామి ఆలయం గ్రామ ప్రజల విశ్వాసానికి ప్రతీక. దశాబ్దాలుగా ఇక్కడ పూజలు జరుగుతున్నాయి. అభివృద్ధి పేరుతో ఆలయాన్ని తొలగించడం సరికాదు. అధికారులు వెంటనే స్పందించి ఆలయాన్ని పరిరక్షించాలి" అని డిమాండ్ చేశారు. వినతిపత్రం స్వీకరించిన ఎమ్మార్వో కార్యాలయ సిబ్బంది, సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, పలువురు భక్తులు పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు దుక్కి పాటి ప్రసాద్ పట్టణ పార్టీ అధ్యక్షుడు మల్లెల శ్రీనివాసరావు తుళ్లూరు అనిల్ ఎమ్మార్వో కలిశారు

# వీధికుక్కల బెడద సుప్రీం ఆదేశాల పట్ల

-ఉదాసీనత క్షమార్హం కాదు!! దూసర్లపూడి రమణరాజు




**కాకినాడ,జూన్ 29 (వార్తాప్రభ)** : ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యల్లో వీధి కుక్కల సమస్య తీవ్రమైందని, ఢిల్లీలో ఒక చిన్నారి ని వీధి కుక్కల గుంపు వెంటాడి కరిచి చంపిన ఘటనపై చలించిన సుప్రీం కోర్టు సుమోటో గా స్వీకరించి సుదీర్ఘంగా విచారించి వీధి కుక్కల నియంత్రణకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ కాకినాడ నగర పాలక సంస్థతో బాటుగా జిల్లాలోని అన్ని మున్సిపల్ నగర పంచాయతీల్లో స్థానిక సంస్థల అధికార యంత్రాంగం సుప్రీం ఆదేశాల అమలులో పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సామాజికవేత్త దూసర్లపూడి రమణరాజు అన్నారు. ఇందుకు నిరసనగా కాకినాడ జిల్లా కలెక్టరేట్ వద్ద ఒకరోజు నిరాహార దీక్ష చేపట్టారు. దేశంలో ప్రతి ఏడాది 2 కోట్ల మంది కుక్కకాటుకు గురవుతు న్నారని ,అందులో సుమారు 25 వేల మంది ర్యాబిస్ వ్యాధితో మరణిస్తున్నారని మరణిస్తున్న వారిలో 50 నుంచి 60శాతం 15 సంవత్సరాల లోపు పిల్లలు ఉంటున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ వంటి అంతర్జాతీయ సంస్థ గణాంకాలు సైతం పేర్కొంటు న్నాయన్నారు. వీధి కుక్కల అంశం స్థానిక సంస్థల అధికారులకు చిన్నదిగా కనిపించవచ్చని, ఇది వేలాది మంది ముఖ్యంగా చిన్నారుల ప్రాణాలతో ముడిపడిన అంశమన్నారు. వీధి కుక్కల నియంత్రణ విషయం లో జిల్లాలోని కార్పొరేషన్ మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యాన్ని ప్రజలు సహించారన్నారు. కాకినాడ నగర కార్పొరేషన్ వంటి స్థానిక సంస్థలు దుబారా మానుకుని ఊరి చివర తీర ప్రాంత కేంద్ర ప్రభుత్వ సాల్ట్ భూముల్లో స్థలం సేకరించటం, సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం వీధికుక్కలకు షెల్టర్లు ఏర్పాటు చేయడం పెద్ద విషయం కాదన్నారు. స్థానిక సంస్థలలో అధికారుల "ఉదాసీనత" ప్రధాన సమస్య గా ఉందన్నారు. ఇటీవల సాంబమూర్తి నగర్ లో చిన్నారులు మహిళతో సహా నలుగురిని ఒక "పిచ్చి కుక్క" కాటు వేయడం పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఒక "పిచ్చి కుక్క" యదేచ్ఛగా వీధుల్లో తిరుగుతోందంటే వాక్సినేషన్ జరుగుతున్న విధానంపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. స్థల సేకరణ జరిగితే కాకినాడ నగర పరిసరాల్లో ఉన్న పారిశ్రామిక సంస్థల నుంచి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ వంటి నిధుల నుండి షెల్టర్ హోమ్స్ నిర్మాణం నిర్వహణ చేయవచ్చున్నారు. ప్రత్యేక అధికారిగా కలెక్టర్ కు సోషల్ రెస్పాన్సిబులిటీ నిధుల సేకరణ అతి చిన్న విషయమన్నారు. పాలకులకు సమస్యను పరిష్కరించాలనే అంకిత భావం ఉండాలన్నారు. 8ఏళ్ల కిందట (జూన్16,2018లో) ఫ్రేజర్ పేట బాలాజీ చెరువు సెంటర్ రెవిన్యూ కార్యాలయం వీధిలో ఆరేళ్ల బాలుడ్ని (నాగేంద్ర) గోడలు దూకి వచ్చిన వీధి కుక్కలు కొరికి చంపేసిన భయానకఘటన ఎన్నటికీ మరువలేనిదన్నారు. ప్రతి సంవత్సరం కార్పొరేషన్ బడ్జెట్ నుండి రూ.15 నుండి రూ.20 లక్షలు కేటాయించి వీధికుక్కలకు ఆహారము నీరు కూడా కోర్ట్ ఆదేశం ప్రకారం షెల్టర్ల లో సులభంగా అందించవచ్చని సూచించారు. పిచ్చికుక్క కాటుకు గురై జిల్లాలో ఏడాదికి సగటున 6 నుండి 8 రేబిస్ మరణాలు సంభవిస్తున్నాయన్నారు. 2025-26 లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా కాకినాడ రాజమహేంద్రవరం అమలాపురం రంపచోడవరం పరిధిలో దాదాపు 86వేల యాంటీ-రేబిస్ వ్యాక్సిన్ (ఎ ఆర్ వి) ఇంజక్షన్లు ఉపయోగించారంటే వీధి కుక్కల బెడద తీవ్రత తెలుసుకోవచ్చున్నారు. కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో ఏటా 5వేలకు పైగా కుక్క కాటు కేసులు నమోదవుతున్నాయ న్నారు. వీరికి ఉచితంగా సాధారణ వ్యాక్సిన్ లభిస్తున్న పరిస్తితి క్రమబద్ధం లేక బయటి మార్కెట్ లో కొందరు కొనుక్కోవాల్సిన దుస్తితి తప్పడం లేదన్నారు. ప్రయివేటు ఆస్పత్రుల్లో వీధి కుక్కల కాటుకు వేలు ఖర్చు చేసి వ్యాక్సిన్ చేయించుకుంటున్న సంఖ్య 9వేలకు పైగా వుందన్నారు. కుక్కకాటు కేసులు గరిష్ట స్థాయికి చేరడంతో ప్రైవేట్ మార్కెట్‌లో వ్యాక్సిన్ల అమ్మకాలు 5 ఏళ్ల గరిష్టానికి పెరిగాయన్నారు. కాకినాడ జిల్లా ప్రైవేట్ సెక్టార్ లో కుక్కకాటు సాధారణవ్యాక్సిన్ అమ్మకాలు 22వేలకు పైగా దాటిన అంచనా వుందన్నారు. కుక్క కాటుకు గురైన వారు 5 డోసుల పూర్తి కోర్సుకు సుమారు రూ.3వేలు ఖర్చు చేయాల్సి వస్తున్నదన్నారు. గాయం తీవ్రంగా ఉంటే రూ.1,200 నుండి రూ.6వేల వరకు ఖరీదైన అయిదు డోసులు చేయించుకోవాల్సి వస్తున్నదన్నారు. కాకినాడ నగరంలో ఐదున్నర లక్షలకు పైగా జనాభా నివాసం ఉండగా వీధి కుక్కలు డివిజన్ కు 560వంతున 28వేలకు పైగా ఇప్పటికీ ఉన్నాయన్నారు. 2025-26లో 12వేలవీధి కుక్కలకు మాత్రమే సంతాన నిరోధక శస్త్రచికిత్సలతో రేబిస్ నిరోధక టీకాలు వేసారన్నారు. జిల్లా కేంద్రంలో ఉదాసీనత వైఖరికి నిరసనగా కామన్ మ్యాన్ ప్రొటెక్షన్ కోసం కలెక్టరేట్ వద్ద ఒక రోజు నిరాహారదీక్ష చేస్తూ ప్రభుత్వం సుప్రీం దృష్టికి తీసుకువెళ్ళే ప్రయత్నం చేస్తున్నానని రమణరాజు పేర్కొన్నారు.

# కారుణ్య నియామకం



**ఘంటసాల/అవనిగడ్డ,జూన్ 29 (వార్తాప్రభ)** : గ్రామ సచివాలయంలో ఏఎన్ఎంగా పనిచేస్తూ మృతిచెందిన మహిళ కుమారునికి కారుణ్య నియామకంలో భాగంగా ఉద్యోగం ఇస్తూ జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ ఉత్తర్వులు ఇచ్చారు. చల్లపల్లి మండలం మంగలాపురం గ్రామానికి చెందిన దాసి సబిత మోపిదేవి సచివాలయంలో పనిచేస్తూ ఈ ఏడాది ఫిబ్రవరిలో చనిపోయింది. దీంతో ఆమె కుమారుడు తూము ప్రమోద్ కు కారుణ్య నియామకం ద్వారా ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చారు. ఘంటసాల తహశీల్దార్ కార్యాలయంలో అటెండర్ గా నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు ఇవ్వగా ఈరోజు ఉద్యోగంలో చేరారు. ఈ కార్యక్రమంలో ఘంటసాల తహశీల్దార్.బి.విజయ ప్రసాద్ , డీఆర్వో సీసీ తూము వెంకటేశ్వరరావు, విశ్రాంత ఈఓఆర్డీ దాసి సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు. కారుణ్య నియామకం ఉత్తర్వులు ఇచ్చిన జిల్లా కలెక్టర్ కు ఈ సందర్భంగా ప్రమోద్ కృతజ్ఞతలు తెలిపారు.

# డ్రైనేజీల్లో,రోడ్లపై చెత్త వేయొద్దు

-కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ ప్రజలకు సూచన



**కాకినాడ,జూన్ 29 (వార్తాప్రభ)** : నగరంలో పారిశుద్ధ్య పరిరక్షణలో ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించాలని, ఇంటి చెత్తను తడి, పొడి చెత్తగా వేరు చేసి పారిశుద్ధ్య కార్మికులకు మాత్రమే అందించాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు. సోమవారం బర్మా కాలనీ, శాంతినగర్ ప్రాంతాల్లో కమిషనర్ విస్తృతంగా పర్యటించి పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. లక్ష్మీనారాయణ నగర్ వద్ద కల్వర్ట్‌పై ఉన్న మ్యాన్‌హోల్‌ను తొలగించి, డ్రైనేజీని అడ్డుకుంటున్న చెత్తను సిబ్బందితో తొలగింపజేశారు. అలాగే డాగ్ స్క్వాడ్ సహాయంతో వీధి కుక్కలను పట్టించి ఏబీసీ కేంద్రానికి తరలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్రజలు ఇంటి చెత్తను రోడ్లపై లేదా డ్రైనేజీల్లో వేయకుండా పారిశుద్ధ్య కార్మికులకు మాత్రమే అందించాలని సూచించారు. డ్రైనేజీల్లో చెత్త వేయడం వల్ల అవి మూసుకుపోయి, వర్షాకాలంలో నీటి నిల్వలు ఏర్పడి ఆయా ప్రాంతాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. నగర పరిశుభ్రత కోసం ప్రజలందరూ నగరపాలక సంస్థకు సహకరించాలని కోరారు. ఈ పర్యటనలో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీచరణ్, శానిటేషన్ సూపర్‌వైజర్ నాయుడు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ సుదర్శన్, డీఈ రత్నబాల, ఈఈ అర్జున్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# ప్రారంభమైన సహకార వారోత్సవాలు

● కోడూరు పి ఎస్ ఎస్ వద్ద సహకార జెండాను ఎగిరి వేసిన పూత బోయిన



**కోడూరు,జూన్ 29 (వార్తాప్రభ)** : ఆంధ్రప్రదేశ్ సహకార శాఖ ఆధ్వర్యంలో సహకార వారోత్సవాలు సోమవారం నుండి ప్రారంభమయ్యాయి.. ఈ సందర్భంగా కోడూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయం వద్ద సహకార జెండాను సొసైటీ చైర్ పర్సన్ పూతబోయిన కరుణ్ కుమార్ ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 29వ తేదీ నుండి వచ్చే నెల 7వ తేదీ వరకు సహకార రచ్చబండ, సహకార వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

# త్వరితగతిన న్యాయం అందించడమే పోలీసు కర్తవ్యం

-జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాలు



**కాకినాడ,జూన్ 29 (వార్తాప్రభ)** : ప్రజలకు సత్వరం న్యాయం అందించడమే పోలీసు కర్తవ్యం అని కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్ అన్నారు. కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ మొత్తం 45 ఫిర్యాదులను స్వీకరించారు. వాటిలో భూ తగాదాలు 13, కుటుంబ కలహాలు 13, ఇతర విభాగాలకు చెందినవి 19 గా గుర్తించబడ్డాయి. ఈ సందర్భంగా ఎస్పీ సంబంధిత స్టేషన్ పోలీసు అధికారులను ఆదేశిస్తూ,ప్రతి ఫిర్యాదును నిశితంగా పరిశీలించి వాస్తవాలు నిర్ధారించగానే, తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, 7 రోజుల లోపు విచారణ పూర్తిచేసి, తగిన పరిష్కారం చూపాలని,వివరాలను జిల్లా పోలీసు కార్యాలయానికి సమర్పించాలని సూచించారు. ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను విన్న ఎస్పీ ప్రజలకు త్వరితగతిన న్యాయం అందించడమే పోలీసుల ప్రధాన కర్తవ్యమని, ప్రజా సమస్యలను న్యాయపరంగా పరిష్కరించడంలో కాకినాడ జిల్లా పోలీసులు పూర్తి నిబద్ధతతో పని చేస్తున్నారని తెలిపారు.



ఏలూరు జిల్లా, పెదవేగి మండలం, రాట్నాలకుంట రాట్నాలమ్మ సన్నిధి శ్రీ సాయి కళ్యాణమండపంలో ఏలూరు వాస్తవ్యులు సోదరుడు కాట్రూ బాలకృష్ణ, హైమవతి దంపతుల కుమారులు సుదీప్ కృష్ణ, మహీధర కృష్ణ నూతన వస్త్ర బహుకరణ కార్యక్రమానికి హాజరై చిన్నారులను ఆశీర్వదించిన అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర జనరల్ సెక్రటరీ పెద్దిబోయిన శ్రీనివాస్ యాదవ్, యూత్ జనరల్ సెక్రటరీ దుగ్గని సూర్య యాదవ్,ఎస్విటి ఇన్ఫోటెక్ అధినేత పెద్దిబోయిన శ్రీనివాస్ యాదవ్, రాష్ట యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ పెనుబోయిన మహేష్ యాదవ్, ఏలూరు జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు మల్లిపూడి రాజు యాదవ్ తదితరులు.

-ఏలూరు,జూన్ 29 (వార్తాప్రభ) :

## జిల్లా బిజెపి ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా బొల్లంపల్లి సీతారామరాజు



**శేరిలింగంపల్లి,జూన్ 29 (వార్తాప్రభ):**రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా బొల్లంపల్లి సీతారామరాజు సోమవారం మసీద్‌బండలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో శేరిలింగంపల్లి నియోజకవర్గం కంటెస్టెడ్ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రవికుమార్ యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్ సూచనల మేరకు సీతారామరాజును రంగారెడ్డి అర్బన్ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా నియమించడం అభినందనీయమన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తూ, వారి సమస్యలను పార్టీ తరపున బలంగా వినిపించడంతో పాటు భారతీయ జనతా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాజేష్ గౌడ్, శ్రీనివాస్ యాదవ్, పద్మ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## బాలల సంరక్షణ కై అన్ని డిపార్ట్మెంట్లు సమన్వయంతో పని చేయాలి

### ఆపరేషన్ ముస్కాన్ పోస్టర్లను ఆవిష్కరించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూన్ 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఎస్పీ కార్యాలయం,జనవరి 1వ తారీఖు నుండి నెల రోజుల పాటు నిర్వహించబడే ఆపరేషన్ ముస్కాన్ -12 వ విడత కార్యక్రమంపై కొత్తగూడెం జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో సోమవారం కాన్ఫరెన్స్ హాల్ నందు అధికారులతో సమన్వయ సమావేశాన్ని ఏర్పాటు కెసిఆర్ యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ విభాగం, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ,జిల్లా బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ,చైల్డ్ హెల్ప్ లైన్1098, కైలాష్ సత్యర్థి చిల్డ్రన్ ఫౌండేషన్ ఎన్జీవో,విద్యాశాఖ, వైద్య శాఖ,కార్మిక శాఖకి చెందిన అధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు హాజరై ఆపరేషన్ ముష్కన్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గత 12 సంవత్సరాలుగా ఆపరేషన్ స్మైల్ ఉ ముస్కాన్ భారతదేశ వ్యాప్తంగా తప్పిపోయిన పిల్లలను, భిక్షాటన చేయుచున్న పిల్లలను, నిరాదరణ కలిగిన పిల్లలకు, బాల కార్మికులను సంరక్షించే ప్రాథమిక ఉద్దేశాలతో నిర్వహించడం జరుగుతుందని ఈ కార్యక్రమం వలన బాధితులైన పిల్లల్ని సంరక్షించి వారి కుటుంబాలకు అప్పగించడం జరుగుతుందని. ఈ సంవత్సరము 12 వ విడత ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాన్ని జులై 1 తారీకు నుంచి 31వ తారీకు వరకు జిల్లా పరిధిలో నిర్వహిస్తు బాలల సంరక్షణ కొరకు ప్రత్యేకంగా పోలీస్ టీం లను ఏర్పాటు చేయడం జరిగిందని, హాజరైన అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో కలిసి పనిచేయాలని సూచనలు చేశారు.కొత్తగూడెంజిల్లా పరిధిలో ఎవరైనా 18 సంవత్సరాలలోపు పిల్లల్ని హింసించిన ,భిక్షాటన చేపించిన ,పిల్లల్ని బాల కార్మికులు గా మార్చిన అట్టి వ్యక్తులపై చట్ట ప్రకారము కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నందు కొత్తగూడెం డిసిఆర్బి డిఎస్పి మల్లేష్ స్వామి, డిస్టిక్ వెల్ఫేర్ ఆఫీసర్ లెనినా స్వర్ణలత, డీసీపీవో హరి కుమారి, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ఇన్స్పెక్టర్ రాము,అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్స్ నాగరాజు, శాస్త్రి, ఏసుపాదం, ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ డిస్టిక్ కో ఆర్డినేటర్ సైదులు, కేఎస్సిఎఫ్ కో ఆర్డినేటర్ రాజేష్, మరియు కమిటీ మెంబెర్స్, ఎస్సైలు రమాదేవి, రాంబాబు, , పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## కారు అగ్నిప్రమాద ఘటన స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే



**జగ్గయ్యపేట, జూన్ 29 (వార్తప్రభ)** పట్టణం చెరుకూరి వారి వీధికి చెందిన చౌడవరపు సుధీర్ కి చెందిన హ్యుండాయ్ ఐ 20 కారు జగ్గయ్యపేట నుంచి చిల్లకల్లు వైపు వెళ్తున్న సమయంలో చత్రపతి శివాజీ విగ్రహం సమీపంలో అకస్మాత్తుగా కారులో మంటలు చెలరేగాయి. కారులో ప్రయాణిస్తున్న వారు వెంటనే అప్రమత్తమై కారు నుంచి క్షేమంగా బయటకు దిగడంతో పెను ప్రమాదం తప్పింది.ఈ ఘటన గురించి సమాచారం అందుకున్న వెంటనే శాసనసభ్యులు తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ఫైర్ శాఖ అధికారులకు సమాచారం అందించి సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అదృష్టవశాత్తు కారులో ఉన్న ప్రయాణికులెవరూ గాయపడకపోవడంతో వారు ఊపిరి పీల్చుకున్నారు.అనంతరం ఎమ్మెల్యే ఫైర్ సిబ్బందితో మాట్లాడి అగ్నిప్రమాదానికి గల కారణాలను పూర్తిస్థాయిలో విచారించి నివేదిక ఇవ్వాలని సూచించారు. అలాగే బాధిత కారు యజమానికి బీమా (ఇన్సూరెన్స్) ద్వారా తగిన పరిహారం అందేలా సంబంధిత అధికారులు సహకరించాలని కోరారు.కాగా ఎమ్మెల్యే సోదరులు శ్రీరాం ధనుంజయ (చినబాబు) ముందుగానే సంఘటన స్థలానికి చేరుకుని స్థానికుల సహకారంతో మంటలను అదుపులోకి తీసుకురావడానికి చర్యలు చేపట్టారు. అనంతరం ఫైర్ సిబ్బంది పూర్తిస్థాయిలో మంటలను అదుపులోకి తీసుకుని పరిస్థితిని నియంత్రించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

# సింగరేణి అధికారుల ఆవేదన!!

**● హక్కుల కోసం సమర శంఖం ● ఆర్జీ-1 ఏరియాలో రిలే నిరాహార దీక్షలు ప్రారంభం ● జీఎం ఆఫీస్ ముందు దీక్షకు కూర్చున్న సీఎంఓఏఐ నేతలు ● మూడేళ్ల పీఆర్పీ బకాయిలు, అలవెన్సుల తక్షణ విడుదలకై డిమాండ్**






**పెద్దపల్లి/గోదావరిఖని: జూన్ 29 (వార్తాప్రభ ప్రతినిధి)**సింగరేణి బొగ్గు గనుల సాక్షిగా... తమ చెమటను, రక్తాన్ని ధారపోస్తూ సంస్థను లాభాల బాటలో నడిపిస్తున్న అధికారుల గుండె రగిలింది. అవును, కోల్ ఇండియాతో సమానంగా తమకూ న్యాయమైన పీఆర్పీ బకాయిలు, వేతన సవరణ, మరియు ఇతర సౌకర్యాలు కల్పించాలనే సముచిత డిమాండ్‌తో, సింగరేణి చరిత్రలోనే ఒక భావోద్వేగ అధ్యాయానికి తెరలేచింది. ఆర్జీ-1 ఏరియా జీఎం కార్యాలయం సాక్షిగా, సోమవారం నాడు సీఎంఓఏఐ ఎస్సీసీఎల్ నేతృత్వంలో అధికారులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కేవలం ఒక నిరసన మాత్రమే కాదు... అది ఏళ్ల తరబడి అణచివేసిన ఆవేదనకు, ఆత్మగౌరవానికి ప్రతిరూపంగా నిలిచింది. సీఎంఓఏఐ బ్రాంచ్ సారథులు లక్ష్మీపతి గౌడ్, పెద్ది నరసింహులు, పొనుగోటి శ్రీనివాస్‌ల మార్గదర్శకత్వంలో ప్రారంభమైన ఈ పోరాటంలో, తొలిరోజు ఆర్జీ-1 ఏరియా ప్రధాన కార్యదర్శి కోల మల్లేశం, ఇన్‌చార్జి ప్రెసిడెంట్ డాక్టర్ విష్ణుమూర్తి, డిప్యూటీ ఎస్.ఈ. రమేష్, డిప్యూటీ మేనేజర్ సల్మాన్ ఖాన్ లాంటి ఎందరో నిబద్ధత గల అధికారులు దీక్షా శిబిరంలో కూర్చుని తమ ఆవేదనను కన్నీటి సిరాగా మార్చారు. ఈ సందర్భంగా ఆఫీసర్ అసోసియేషన్ అధినేతలు మాట్లాడారు. “తమ పిల్లల ఐఐటీ, ఐఐఎం ఫీజుల రీయింబర్స్‌మెంట్ కోసం, 2022 నుండి పేరుకుపోయిన పీఆర్పీ బకాయిల కోసం, కోల్ ఇండియాతో సమానమైన అలవెన్సులు మరియు ఉచిత విద్యుత్ కోసం మేము యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. శ్రమకు తగ్గ ఫలితాన్ని మాత్రమే అడుగుతున్నాం అంటూ మల్లేశం పలికిన భావోద్వేగ మాటలు ప్రతి ఒక్కరి హృదయాలను కదిలించాయి. జూలై 13 వరకు సాగనున్న ఈ శాంతియుత సమరంలో ప్రతి ఎగ్జిక్యూటివ్ తమ వంతు బాధ్యతగా భాగస్వామ్యమవుతుంటే, ఈ దృశ్యం సింగరేణి వ్యాప్తంగా ఒక సానుభూతి పవనాన్ని సృష్టిస్తోంది. ఇకనైనా యాజమాన్యం తమ మొండివైఖరి వీడి, సింగరేణిని తమ భుజాలపై మోస్తున్న ఈ అధికారుల కన్నీళ్లను తుడవాలి అని ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రధాన డిమాండ్. లేనియెడల నిరసన మరింత వృతం చేస్తామని మీడియా సాక్షిగా తమ ప్రణాళికను వివరించారు. ఈ రిలే నిరాహార దీక్ష కార్యక్రమంలో డిప్యూటీ ఎస్.ఈ. రమేష్, డిప్యూటీ మేనేజర్ సల్మాన్ ఖాన్, ఇతరులు పాల్గొన్నారు.

# రామగుండం ప్రగతిపై సీఎంతో ఎమ్మెల్యే భేటీ!!

**● పవర్ ప్లాంట్, అర్బన్ ఫండ్స్ కోసమే భేటీ ● నిరుద్యోగుల ఉపాధి కోసం థర్మల్ ప్లాంట్ పనులు ప్రారంభించాలి ● రామగుండం రూపురేఖలు మార్చడమే లక్ష్యంగా భేటీ**



**పెద్దపల్లి/గోదావరిఖని: జూన్ 29 (వార్తాప్రభ ప్రతినిధి)**రామగుండం నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి, పారిశ్రామిక ప్రగతి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రామగుండం శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ సోమవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని వివిధ విజ్ఞప్తుల మేర కలిశారు. పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి జరిగిన ఈ భేటీలో ప్రాంతీయ ప్రగతికి ఊతమిచ్చే పలు కీలక అంశాలపై ముఖ్యమంత్రితో ఎమ్మెల్యే సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా రామగుండం పారిశ్రామిక ప్రాంత భవిష్యత్తును మార్చగల అత్యంత ప్రతిష్టాత్మకమైన 1ఐ800 మెగావాట్ల ‘బి’ థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణ పనులను త్వరితగతిన ప్రారంభించి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సీఎంకు విజ్ఞప్తి చేశారు. ఈ భారీ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం గణనీయంగా పెరగడమే కాకుండా, స్థానిక నిరుద్యోగ యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని, తద్వారా అనుబంధ పరిశ్రమలు వృద్ధి చెంది ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని వివరించారు. దీనితో పాటు, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌ను ‘అర్బన్ చాలెంజ్ ఫండ్’ స్కీమ్‌లో చేర్చడం ద్వారా నగర రూపురేఖలను మార్చాలని కోరారు. నగరంలో మౌలిక వసతుల పెంపు, అంతర్గత రహదారుల విస్తరణ, ఆధునిక డ్రైనేజీ వ్యవస్థల నిర్మాణం, నిరంతర తాగునీటి సరఫరా, ఆధునిక వీధి దీపాల ఏర్పాటు, మెరుగైన పారిశుధ్య నిర్వహణ, పార్కుల అభివృద్ధి, పచ్చదనం పెంపుతో పాటు ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. పారిశ్రామిక నగరంగా ఉన్న ప్రత్యేకతను బట్టి ప్రజలకు నాణ్యమైన వైద్య, విద్యా సౌకర్యాలు, ఆధునిక పట్టణ వసతులు కల్పించాల్సిన అవశ్యకతను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఈ ప్రణాళికాబద్ధమైన కార్యక్రమాల ద్వారా ప్రజా జీవన ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు, రామగుండం రాష్ట్రంలోనే ఒక ఆదర్శ పారిశ్రామిక నగరంగా ఎదుగుతుందని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వెల్లడించింది. ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ సమగ్ర ప్రతిపాదనలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ, వీటిని పరిశీలించి సాధ్యమైనంత త్వరగా తగిన చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వ పరంగా పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చినట్లు వివరించారు. సీఎం సానుకూల స్పందన పట్ల హర్షం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే, రామగుండం ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడానికి, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో అగ్రగామిగా నిలిపేందుకు తాను నిరంతరం శ్రమిస్తానని ఈ సందర్భంగా కట్టుబాటును చాటి చెప్పారు అని తెలిపారు.

# ఉద్యోగ నోటిఫికేషన్లు వెంటనే విడుదల చేయాలి...

### అఖిలభారత యువజన సమైక్య ( ఏఐవైఎఫ్) సుజాతనగర్ మండల సమితి...



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూన్ 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)** సుజాతనగర్, మండల కేంద్రంలో శ్రీ భారత కమ్యూనిస్టు పార్టీ (రజాబ్ అలీ భవన్) నందు ఉద్యోగ నోటిఫికేషన్లు వెంటనే విడుదల చేయాలని సోమవారం అఖిల భారత యువజన సమైక్య( ఏఐవైఎఫ్ ) మండల కార్యదర్శి భూక్య రాజేష్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూతెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి దాదాపు సుమారు మూడు సంవత్సరాల కాలం గడుస్తున్నా ఇప్పటివరకు ఏ ఒక్క ఉద్యోగం నోటిఫికేషన్ విడుదల చేయకపోవడం బాధాకరమైన విషయం అని, అన్నారుకాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అయినటువంటి నిరుద్యోగ భృతి, ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా లోను ఇచ్చి స్వయం ఉపాధి కల్పిస్తామన్న హామీలను వెంటనే అమలు పరచాలి అన్నారుఏదైతే 5 వేలు కానిస్టేబుల్ పోస్టులు ఉన్నాయో వాటిని 20వేలకు పెంచి నోటిఫికేషన్ వెంటనే విడుదల చేయాలని గత ప్రభుత్వాలు నిరుద్యోగులను, యువతను విస్మరించి నందు వల్ల వాళ్లకు చెప్పిన బుద్ధి, మీరు నోటిఫికేషన్ ఇయ్యకపోతే మీకు కూడా అదే బుద్ధి చెప్తామని అన్నారుభద్రాద్రి కొత్తగూడెం జిల్లా, లిపూర్తిగా ఏజెన్సీ జిల్లా,ఈ జిల్లాలో ఆదివాసి గిరిజనులు ఎక్కువగా నివసిస్తున్నారని గిరిజన యువతకు ప్రభుత్వం వెంటనే ఉచిత స్టడీ సర్కిల్లు పెట్టి కోచింగ్ ఇవ్వాలని డిమాండ్స్ ఏవైతే ఉన్నాయో వెంటనే అమలు చేయకపోతే దశల వారీగా ఉద్యమానికి సిద్ధమవుతామని తెలిపారు ఈ కార్యక్రమంలో ఏ ఐ వై ఎఫ్ సుజాతనగర్ మండల నాయకులు ముకర కృష్ణ , జంపాల అర్జున్ వర్మ మాచర్ల సాగర్,నవీన్ పొడియాల, భూక్య నరేష్, మేఘశ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## నాగారం డివిజన్‌లో ఓటర్ లిస్టు సవరణ కార్యక్రమాన్ని పరిశీలించిన డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్.

### నాగారం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి.





**కీసర, నాగారం, జూన్ 29:(వార్తా ప్రభ)**మల్కాజ్గిరి కార్పొరేషన్ ఘట్కేసర్ సర్కిల్ పరిధిలోని నాగారం డివిజన్ ఎస్సీ క్వార్టర్స్‌లో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ ఐ ఆర్) కార్యక్రమాన్ని మేడ్చల్--మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు శ్రీ తోటకూర వజ్రేష్ యాదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా బూత్ నెం. 216లో బీఎల్ఓ సీహెచ్ అనురాధ ఆధ్వర్యంలో, బూత్ నెం. 242లో బీఎల్ఓ మహేష్ తివారి ఆధ్వర్యంలో ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారమ్‌ల పంపిణీని పరిశీలించి, అధికారులతో మాట్లాడారు. అనంతరం వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఓటరు తప్పనిసరిగా ఎన్యూమరేషన్ ఫారమ్‌ను పూర్తి చేసి సంబంధిత బీఎల్ఓకు సమర్పించాలని సూచించారు. ఫారమ్‌ను సక్రమంగా సమర్పించిన వారి పేర్లు మాత్రమే తుది ఓటరు జాబితాలో కొనసాగుతాయని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ ఈ ప్రక్రియను బాధ్యతగా పూర్తి చేయాలని కోరారు.అలాగే కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్లు (బి ఎల్ ఏలు) ప్రతి ఇంటిని సందర్శించి అర్హులైన ఓటర్లందరికీ ఎన్యూమరేషన్ ఫారమ్‌లు అందేలా చూడాలని, ఏ ఒక్క అర్హుడి ఓటు కూడా తొలగించబడకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ అశోక్ గౌడ్ , మాజీ వైస్ చైర్మన్ మల్లేష్ యాదవ్, మాజీ కౌన్సిలర్లు వెంకట్ రెడ్డి, హరిబాబు, సుమిత్ర, సురేష్, మాజీ ఎంపీటీసీలు పంగ ముత్యాలు, ప్రవీణ్, ముద్రగానం మహేంద్ర యాదవ్, మాజీ ఉపసర్పంచ్ మహిపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సతీష్ గౌడ్, దాసోహం నర్సింహరావు, రాల కృష్ణయ్య యాదవ్, రాల సన్నీ యాదవ్, పంగ శ్రీహర, పంగ సంతోష్, ప్రసాద్ పంతులు , దాసర్ రామ్ రెడ్డి, శ్రీశైలం యాదవ్, బొల్లబోయిన సత్యనారాయణ యాదవ్, పరమేష్, భూమలి యాదవ్, ఓం ప్రకాష్ గౌడ్, యువ నాయకులు జీవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వార్తా ప్రభ
# హైదరాబాద్

## వడ్డేపల్లి ఎంక్లేవ్ ఓనర్స్ సంక్షేమ సంఘం అధ్యక్షులుగా పి.ఎస్.ఆర్.కే. భగవాన్



**కూకట్ పల్లి జూన్ 29(వార్తప్రభ):** కూకట్ పల్లి వివేకానంద నగర్ లోని వడ్డేపల్లి ఎంక్లేవ్ ఓనర్స్ సంక్షేమ సంఘం నూతన అధ్యక్షులుగా పి ఎస్ ఆర్ కె భగవాన్ నియమితులయ్యారు. అలాగే ఉపాధ్యక్షులుగా కె సురేష్ కుమార్, ఏ రఘునాథ్ చక్రవర్తి, ప్రధాన కార్యదర్శిగా ఏ రామశేషగిరిరావు, కోశాధి కారిగా టి మల్లేశ్వరరావు, సంయుక్త కార్యదర్శిగా ఏ వీరేశప్ప, జి నాంచారయ్య, కార్యవర్గ సభ్యులుగా శ్రీకృష్ణమోహన్, భువన ప్రసాద్, జీవి సాగర్, కె ఎన్ ఎం శ్రీనివాస్, ఎం దాసిరెడ్డి, జయ జ్యోతిర్మయి, సుబ్బారెడ్డి, డాక్టర్ సూర్య ప్రకాష్ తదితరులు నియమితులయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు పీఎస్ఆర్కే భగవాన్ మాట్లాడుతూ వడ్డేపల్లి ఇంట్లో ఓనర్ సంక్షేమ సంఘం అధ్యక్షులుగా తనకు మరో అవకాశం కల్పించి నందుకు సంక్షేమ సంఘం అభివృద్ధికి శాయశక్తుల కృషి చేస్తానని చెప్పారు. అలాగే కాలనీవాసులకు కమిటీ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఇంటింటికి వెళ్లి ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ



**శేరిలింగంపల్లి,జూన్ 29 (వార్తాప్రభ):**హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని పోలింగ్ బూత్‌లు 208, 209, 210, 211, 212 పరిధిలోని ఆల్విన్ కాలనీ, సప్తగిరి కాలనీల్లో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా సోమవారం ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఓ అధికారులు,బీజేపీ బీఎల్ఏ-1, బీఎల్ఏ-2 ప్రతినిధులు, ఇతర రాజకీయ పార్టీల నాయకులు స్థానికులతో కలిసి ఓటర్లకు ఫారాల పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి అసెంబ్లీ బీజేపీ బీఎల్ఏ-1 మాణిక్‌రావు, హఫీజ్‌పేట్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కైతాపురం జితేందర్, బీఎల్ఏ-2 ప్రతినిధులు, బీజేపీ నాయకులు శ్రీధర్‌రావు,కోటేశ్వరరావు, రవి గౌడ్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ జాబితా సవరణ ప్రక్రియ పారదర్శకంగా నిర్ణీత గడువులోగా పూర్తి చేయండి

### - తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి



**శేరిలింగంపల్లి,జూన్ 29 (వార్తాప్రభ):**ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్)-2026 అమలు సమీక్షపై తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి అధ్యక్షతన సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశానికి శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ ఈఆర్వో, జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ (ఐఏఎస్) హాజరయ్యారు.సహాయ ఎన్నికల నమోదు అధికారులు (ఏఈఆర్వోలు) తదితరులు పాల్గొన్నారు.ఎస్ఐఆర్-2026 అమలుకు సంబంధించి ముఖ్య ఎన్నికల అధికారి జారీ చేసిన మార్గదర్శకాలను సమీక్షించారు.ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, ఖచ్చితత్వంతో నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

## డూప్లికేట్, నకిలీ ఓట్లను తొలగించి, అర్హులైన యువత ప్రతి ఓటును చేర్చాలి

### - మాజీ కార్పొరేటర్ వి గంగాధర్ రెడ్డి



**శేరిలింగంపల్లి,జూన్ 29 (వార్తాప్రభ):**గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గౌలిదొడ్డి, నానక్‌రామ్‌గూడ, ఖాజాగూడ ప్రాంతాల్లో కేంద్ర ఎన్నికల సంఘం చేపడుతున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఓటరు మ్యాపింగ్, ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీని మాజీ కార్పొరేటర్ వి. గంగాధర్ రెడ్డి బీఎల్ఓలు, బీఎల్ఏలతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటరు నమోదు, సవరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించడంతో పాటు డూప్లికేట్, నకిలీ ఓట్లను తొలగించి అర్హులైన ప్రతి యువతకు కొత్త ఓటు నమోదు కల్పించాలని సూచించారు. ప్రతి పౌరుడు ఓటరు జాబితాలో తన పేరు ఉందో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని, జూలై 24 వరకు కొనసాగే ఈ కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో గచ్చిబౌలి డివిజన్ అధ్యక్షుడు శివసింగ్, బీఎల్ఓలు, బీఎల్ఏలు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## వైసీపీకి మరీ ఇంత కన్ఫ్యూజన్ నా ?

: అయిదేళ్ళ పాటు ఏపీని ఏలిన పార్టీ. 2024లో దారుణంగా ఓడినా 40 శాతం ఓట్ షేర్ ఉన్న పార్టీ. 2014 నుంచి వరుసగా మూడు సార్లు అసెంబ్లీ మరో మూడు సార్లు పార్లమెంట్ ఎన్నికలలో పాల్గొని బలమైన రాజకీయ పార్టీగా వైసీపీ కొనసాగుతోంది. అలాగే రెండు లోకల్ బాడీ ఎన్నికల్లో కూడా తన సత్తా చాటుకుంది. ఏపీలో ఓటర్లు నాలుగు కోట్లు. జనాభా అయిదు కోట్లు. మరి ఇందులో నలభై శాతం ఓటు షేర్ అంటే కోటీ అరవై లక్షల మందికి పైగా 2024 ఎన్నికల్లో వైసీపీకి ఓటేశారు. అంటే మొత్తం ఏపీ జనాభాలో మూడవ వంతు అన్న మాట. ప్రతీ ముగ్గురిలో ఒకరి వైసీపీ వైపు ఉన్నారు అన్న మాట. మరి ఇంతలా వైసీపీ ఏపీ రాజకీయాల్లో తన బలాన్ని చాటుకున్న వేళ ఏపీకి సంబంధించిన కీలకమైన అంశాలలో మరీ ఇంతగా కన్ఫ్యూజన్ తో వ్యవహరించడం అంటే అది ఆ పార్టీకి మంచిదేనా అన్నది ప్రధాన ప్రశ్న. మరి ఏపీ ప్రజల మెప్పు పొంది మరోసారి అధికారం అందుకుని ఏపీ భవితను శాసించాలని చూస్తున్న వైసీపీకి రాజధాని వంటి అత్యంత ముఖ్యమైన అంశలో అయోమయం ఉండడం అంటే చాలా సీరియస్ గానే ఆలోచించాలని అంటున్నారు. వైసీపీ స్టాండ్ ఏమిటి : ఇదే ప్రశ్నను మీడియా వైసీపీ సీనియర్ నేత, శాసనమండలిలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు బొత్స సత్యనారాయణకు సంధించింది. దానికి ఆయన చెప్పిన జవాబు చూస్తే వైసీపీ ఇంకా కన్ఫ్యూజన్ లోనే ఉన్నట్లుగా అర్ధం అవుతోంది. అయిదేళ్ల పాలనలో మూడు రాజధానులు మా విధానం అని బొత్స అన్నారు. ఇపుడు మావిగన్ పేరుతో ప్రభుత్వానికి సూచన చేశామని చెప్పారు. మరి అమరావతి రాజధాని మీద మీద మీ వైఖరి ఏమిటి అంటే మా వైఖరి ముఖ్యం కాదని ఆయన జవాబు ఇవ్వడం విశేషం. వారు అమరావతిని అభివృద్ధి చేస్తున్నారు కదా చేయనివ్వండి ఎవరు వద్దన్నారు అన్నారు. ఇక అమరావతిలో జరుగుతున్న అవినీతి మీద తాము పోరాడుతామని బొత్స చెప్పారు. మరి వైసీపీ విధానం ఏంటి అంటే ప్రస్తుతం మావిగన్ అని బొత్స అంటున్నారు. ఇక అమరావతిలో పోరాటం చేస్తామని అంటున్నారు. సరే అవినీతి మీద ప్రతిపక్షం ప్రజల పక్షాన నిలిచి పోరాడాల్సిందే. కానీ ఏపీకి అయిదు కోట్ల మందికి రాజధానిగా ఉన్న అమరావతి విషయంలో ఈ రోజుకీ వైసీపీ స్పష్ట లేకుండా ముందుకు సాగుతోందా అన్న సందేహాలకు అయితే బొత్స జవాబులులతో కలుగుతున్నాయి. అమరావతి రాజధానిగా మాకు ఓకే కానీ అక్కడ అవినీతి మీద మాత్రం కాదు అని సూటింగా స్పష్టంగా చెప్పవచ్చు కదా అని అంటున్న వారూ ఉన్నారు. అమరావతి రాజధానిగా ఇష్టం లేదా లేకపోతే ఆ విషయం కూడా సూటిగా చెప్పేయవచ్చు కదా అని అంటున్న వారూ ఉన్నారు. ఇలా ఏ విషయం తేల్చకుండా అమరావతిలో అవినీతి మీద పోరాటం అంటేనే విమర్శలు వస్తున్నాయి. కూటమి నేతలు కూడా సరిగ్గా ఇక్కడే వైసీపీని కార్నర్ చేస్తున్నారు. అమరావతిలో పర్యటించే నైతిక హక్కు మీకు ఎక్కడిది అని కూడా వారు నిలదీస్తున్నారు. అమరావతి మీద వైసీపీకి స్టాండ్ లేదని ఎద్దేవా చేస్తున్నారు. ఒక రాజకీయ పార్టీగా వైసీపీ ఈ విషయంలో తన స్పష్టతను తెలియచేయకుండా ఉద్యమాలు ఎన్ని చేసినా మరెన్ని సూచనలు ఇచ్చినా జనాలు వాటిని ఏ విధంగా తీసుకుంటారు అన్న ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. మరి వైసీపీ పెద్దలే ఈ విషయంలో ఆలోచించుకోవాల్సి ఉందని అంటున్నారు.

## హైస్కూల్ ప్లస్ ఖాళీలకు ఉమ్మడి జిల్లా స్థాయిలో విల్లింగ్‌నెస్ తీసుకోవాలి

### - నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్

**విజయవాడ, జూన్ 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)**హైస్కూల్ ప్లస్ ఖాళీల భర్తీలో మండల పరిమితి విధించడం లేదా కేవలం మిగులు ఉపాధ్యాయులకే అవకాశం కల్పించడం సరైన విధానం కాదని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శి లు కరణం హరికృష్ణ మరియు మాగంటి శ్రీనివాస రావు లు ఒక ప్రకటన లో విజ్ఞప్తి చేశారు.విద్యార్థుల విద్యా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని, ఉమ్మడి జిల్లాలోని అన్ని అర్హత కలిగిన, ఆసక్తి ఉన్న స్కూల్ అసిస్టెంట్ల నుండి విల్లింగ్‌నెస్ తీసుకొని ఖాళీలను భర్తీ చేయాలని కోరారు.హైస్కూల్ ప్లస్ తరగతులకు సబ్జెక్టు పరిజ్ఞానం, అర్హత, అనుభవం కలిగిన ఉపాధ్యాయులు అవసరమని, కాబట్టి ఖాళీల భర్తీని సబ్జెక్టు అవసరం, అర్హత, సీనియారిటీ, విల్లింగ్‌నెస్ ఆధారంగా పారదర్శకంగా చేపట్టాలన్నారు.ఈ విధానం ఉపాధ్యాయులకు న్యాయం చేయడమే కాకుండా, విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన అందించేందుకు ఉపయోగపడుతుం దన్నారు.కావున ఈ విషయంపై పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ తగిన ఆదేశాలు జారీ చేయాలని వారు ఆ ప్రకటనలో కోరారు.

## వడ్డీ లేకుండా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం పన్నులు (ఫస్ట్ హాఫ్) చెల్లించేందుకు జూన్ 30, 2026 చివరి అవకాశం

### నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి: కమిషనర్ ధ్యానచంద్ర




**విజయవాడ పశ్చిమ జూన్ 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్ను, ఖాళీ స్థల పన్ను, వడ్డీ లేకుండా చెల్లించేందుకు జూన్ 30, 2026 చివరి తేదీ అని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు..ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, నగర ప్రజలు ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (ఫస్ట్ హాఫ్) సంబంధించిన తమ మున్సిపల్ పన్నులను జూన్ 30లోగా చెల్లించి వడ్డీ భారం నుంచి తప్పించుకోవాలని సూచించారు. నగరంలోని అన్ని మున్సిపల్ క్యాష్ కౌంటర్లలో, ఆన్‌లైన్ ద్వారా, అలాగే పురమిత్ర మొబైల్ యాప్ ద్వారా పన్నులు సులభంగా చెల్లించవచ్చని తెలిపారు. ఆస్తి పన్ను తో పాటు నీటి, డ్రైనేజ్ పన్నులు చెల్లించాలని నాగరాభివృద్ధి కి తొడ్పాడాలని అన్నారు.నగరంలోని అన్ని మున్సిపల్ క్యాష్ కౌంటర్లలో, ఆన్‌లైన్ ద్వారా, అలాగే పురమిత్ర మొబైల్ యాప్ ద్వారా పన్నులు సులభంగా చెల్లించవచ్చని తెలిపారు. ఆస్తి పన్ను తో పాటు నీటి, డ్రైనేజ్ పన్నులు చెల్లించాలని నాగరాభివృద్ధి కి తొడ్పాడాలని అన్నారు. జూన్ 30, 2026 తర్వాత ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (ఫస్ట్ హాఫ్) సంబంధించిన చెల్లించని పన్నులపై నిబంధనల ప్రకారం వడ్డీ విధించబడుతుందని, అందువల్ల నగర ప్రజలందరూ గడువు తేదీలోగా పన్నులన్ని చెల్లించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ ధ్యానచంద్ర విజ్ఞప్తి చేశారు.

## జూలై 17, 18, 19 తేదీల్లో ఊర్మిళ నగర్ పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్లు



**విజయవాడ పశ్చిమ జూన్ 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)** స్థానిక భవానిపురం ఊర్మిళ నగర్ లోని గ్రామదేవత పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్లు జూలై 17, 18, 19 తేదీల్లో వైభవంగా నిర్వహించనున్నట్లు పోలేరమ్మ దేవస్థానం కమిటీ అధ్యక్షులు సూరసాని రామిరెడ్డి చెప్పారు. పోలేరమ్మ దేవస్థానం ప్రాంగణంలో అమ్మవారి తిరునాళ్లకు సంబంధించిన ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో దేవస్థానం కమిటీ అధ్యక్షులు సూరసాని రామిరెడ్డి మాట్లాడుతూ జూలై 17న కుంకుమ పూజ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని, 18న సాయంత్రం అమ్మవారికి లక్ష కుంకుమార్చన చేస్తామని, 19వ తేదీన కృష్ణానది జలాలతో కుంభాభిషేకం, పంచామృత అభిషేకం, అనంతరం పొంగలి నివేదన వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. అలాగే 19వ తేదీ సాయంత్రం 6 గంటలకు బొల్లావులతో, కోలాటంతో అమ్మవారి ఊరేగింపు వైభవంగా నిర్వహిస్తామని చెప్పారు. గత 40ఏళ్ళ నుంచి ప్రతి యేటా అమ్మవారి తిరునాళ్ళు వైభవంగా నిర్వహిస్తున్నామని రామిరెడ్డి వివరించారు. పోలేరమ్మ ఉత్సవాల అనంతరం దేవస్థానం రేకుల షెడ్డు స్థానంలో స్లాబ్ వేయుటకు నిర్ణయించడం జరిగిందని, కావున దాతలు స్లాబ్ వేసేందుకు తమ వంతు ఆర్థిక సహకారం అందించాలని ఆయన కోరారు. అలాగే జూలై 27వ తేదీన పోలేరమ్మ అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలోని శ్రీ లక్ష్మీ సాయి బాబా ఆలయంలో గురు పౌర్ణమి సందర్భంగా పలు కార్యక్రమాలు 27, 28, 29 తేదీల్లో నిర్వహించనున్నట్లు చెప్పారు. 29వ తేదీన మధ్యాహ్నం భక్తులకు అన్న సమారాధన, సాయంత్రం 6 గంటలకు బాబా గారి ఊరేగింపు కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కమిటీ కార్యదర్శి గుత్తావళి విజయబాబు, కోశాధికారి దొడ్డా వెంకటేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇంద్రకీలాద్రిపై వైభవంగా 'ఏరువాక పౌర్ణమి వేడుకలు.



**విజయవాడ పశ్చిమ జూన్ 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఆంధ్రప్రదేశ్ దేవదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఇంద్రకీలాద్రిపై వేంచేసియున్న శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో "ఏరువాక పౌర్ణమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన రైతు భక్త బృందానికి ఆలయ అధికారులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికి, అమ్మవారి ప్రత్యేక దర్శనం మరియు వేదాశీర్వచనం ఏర్పాటు చేసి, పవిత్ర తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ విశిష్ట కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ దేవదాయ ధర్మాదాయ శాఖ పరిధిలోని హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ మహిళా విభాగం సంకల్పంతో, ఆ సంస్థ రాష్ట్ర మహిళా కో-ఆర్డినేటర్ శ్రీమతి కరి రమాసుందరి బృందం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా రూపకల్పన చేసి నిర్వహించారు. ఏరువాక పౌర్ణమి అనేది రైతులు గింజలు (విత్తుకొని) నాటుకొని నారు తయారు చేసుకునే పవిత్రమైన వ్యవసాయ సీజన్ ప్రారంభ దినం. అనాదిగా వస్తున్న సాంప్రదాయం ప్రకారం సోమవారం భూమాతను, పశువులను, గంగమ్మను భక్తితో పూజించుకుంటారు. ఈ సనాతన సంప్రదాయాన్ని కాపాడుతూ, హిందూ ధర్మ పరిరక్షణలో భాగంగా మహిళలు ఎంతో భక్తిశ్రద్ధలతో కొన్ని కోట్ల సార్లు చేసిన 'రామనామ జపము' ద్వారా పవిత్రీకరించబడిన వడ్లను (ఆహార గింజలను) శ్రామిక రైతు మహిళలకు దోసిడు వడ్లుగా పసుపు, కుంకుమ మరియు సౌభాగ్య సత్కారాలతో సమర్పించారు.?పంట విత్తినప్పటి నుండి, ఆ పంట చేతికి వచ్చి ఉత్తమ ఫలితం రైతు మహిళలు పొందే వరకు నిరంతరం రామనామ జపంతో ప్రకృతిని ప్రసన్నం చేసుకోవడం, అలాగే భూసూక్త, నీలా సూక్త, వరుణసూక్త పారాయణలతో ప్రకృతిని నిత్యం పూజించే ఒక గొప్ప వ్రత దీక్షను ఈ సందర్భంగా వారు చేపట్టారు. ఆహార గింజలను దైవత్వంతో పవిత్రీకరించి రైతులకు అందించడం ద్వారా రాష్ట్రంలో పాడిపంటలు సమృద్ధిగా పండాలని, రైతులు సుభిక్షంగా ఉండాలనే సత్సంకల్పం ఈ కార్యక్రమం వెనుక దాగి ఉంది.ఈ కార్యక్రమంలో హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ మహిళా ప్రతినిధులు ఆలయ అధికారులు, అర్చకులు,పెద్ద సంఖ్యలో శ్రామిక రైతు మహిళలు ఎంతో భక్తి శ్రద్ధలతో పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలు పొందారు.

## సచివాలయ దివంగత ఉద్యోగి కుటుంబానికి సహోద్యోగులు అండగా నిలబడటం ఐక్యతకు చిహ్నం

### విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర



**విజయవాడ పశ్చిమ జూన్ 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో విధులు నిర్వహించిన స్వర్గీయ చింత రాజశేఖర్ కుటుంబానికి సహోద్యోగులు అండగా నిలబడటం ఐక్యతకు నిదర్శనమని నగర కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ ఎం పేర్కొన్నారు. విజయవాడ నగరపాలక సంస్థ సర్కిల్-3 పరిధిలోని 111వ వార్డు సచివాలయంలో వార్డు డేటా ప్రాసెసింగ్ కార్యదర్శిగా పనిచేస్తున్న చింత రాజశేఖర్ జూన్ 3వ తేదీన ఆకస్మిక గుండెపోటుతో మరణించడం అత్యంత విషాదకరమని పేర్కొన్నారు. సోమవారం ఉదయం ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్ లో స్వర్గీయ చింత రాజశేఖర్ కుటుంబ సభ్యులకు వార్డు సచివాలయ కార్యదర్శులు సమకూర్చిన రూ.2,57,700 నగదు విరాళాన్ని అందజేశారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, స్వర్గీయ చింత రాజశేఖర్ కుటుంబానికి అండగా నిలిచిన వార్డు సచివాలయ ఉద్యోగుల ఫెడరేషన్ నాయకులను అభినందించారు. ఈ కార్యం ఎంతో గొప్పదని, సహోద్యోగి కుటుంబానికి సచివాలయ కార్యదర్శులందరూ అండగా నిలబడటం ఐక్యతకు చిహ్నమని పేర్కొన్నారు. అలాగే, ఆ కుటుంబానికి ప్రభుత్వ పరంగా రావలసిన అన్ని ప్రయోజనాలను సాధ్యమైనంత త్వరగా మంజూరు చేయడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ సందర్భంగా విజయవాడ నగరపాలక సంస్థ సెక్రటేరియట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షులు డా. జైకర్ కొమ్ముకూరి మరియు సభ్యులు మాట్లాడుతూ, మృతుని కుటుంబానికి అండగా నిలవాలనే సంకల్పంతో విజయవాడలో పనిచేస్తున్న వార్డు సచివాలయ ఉద్యోగులందరూ సెక్రటేరియట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ప్రతి ఉద్యోగి జీతం నుంచి కొంత మొత్తాన్ని విరాళంగా సమకూర్చి, మొత్తం రూ.2,57,700 నగదు విరాళాన్ని కుటుంబ సభ్యులకు అందజేశామని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ (ఎస్‌జీఎస్‌డబ్ల్యూ) శ్రీమతి శకుంతల, అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) డా. డి. చంద్రశేఖర్, విజయవాడ నగరపాలక సంస్థ సెక్రటేరియట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సభ్యులు, వార్డు కార్యదర్శులు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## వర్షాకాలంలో డ్రైన్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి

### విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర





**విజయవాడ పశ్చిమ జూన్ 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర సోమవారం ఉదయం నగరంలోని ఎర్రకట్ట, సీవీఆర్ ఫ్లైఓవర్, మిల్క్ ప్రాజెక్ట్, ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్, కనకదుర్గ ఫ్లైఓవర్, సితార జంక్షన్, తదితర ప్రాంతాల్లో పర్యటించి అభివృద్ధి పనులు, డ్రైనేజీ వ్యవస్థ, పారిశుధ్య నిర్వహణను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.సీవీఆర్ ఫ్లైఓవర్ కింద రహదారికి ఇరువైపులా ఉన్న ప్రధాన అవుట్‌ఫాల్ డ్రైన్లలో తేలియాడే వ్యర్థాలను తొలగించేందుకు నూతనంగా ఏర్పాటు చేసిన యంత్రాల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నగరంలోని అన్ని ప్రధాన డ్రైన్లు, కాలువల్లో డీ-సిల్టింగ్, తేలియాడే వ్యర్థాల తొలగింపు ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగాలని అధికారులను ఆదేశించారు. ఎక్కడా నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. రహదారులపై వర్షపు నీరు నిల్వ కాకుండా డ్రైన్లలో నీటి ప్రవాహం సాఫీగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.అనంతరం సితార జంక్షన్‌లోని డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించారు. పాడైపోయిన డ్రైన్ స్థానంలో వెంటనే నూతన డ్రైన్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కొండ ప్రాంతం నుంచి వచ్చే వర్షపు నీరంతా సక్రమంగా డ్రైన్ ద్వారా వెళ్లేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సూచించారు.తదుపరి ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్డులోని అన్న క్యాంటీన్‌ను పరిశీలించి అక్కడి నిర్వహణపై అధికారులకు పలు సూచనలు చేశారు. తాగునీటి సరఫరా, వినియోగ నీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలని, ఆహార నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. క్యాంటీన్ పరిసరాల్లో పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి లోపం ఉండకూడదని, ప్రజల నుంచి ఏవైనా ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందించి, సాధ్యమైనంత త్వరగా సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.ఈ పర్యటనలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు జె.శ్రీనివాస్, గోపాలకృష్ణమూర్తి, అసిస్టెంట్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎం ఎల్ ఏ సుజన చౌదరి



**విజయవాడ పశ్చిమ జూన్ 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)**పశ్చిమ ఎం ఎల్ ఏ సుజన చౌదరి ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారుహెచ్ బీ కాలనీ , ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించి చిన్నారులకు స్వయంగా పోలియో చుక్కలు వేశారు.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుజనా చౌదరి మాట్లాడుతూ పోలియో లాంటి ప్రమాదకర వ్యాధులనుంచి చిన్నారులను రక్షించేందుకు ఈ కార్యక్రమం కీలకమన్నారు.. చిన్నారులకు వేసే రెండు పోలియో చుక్కలు జీవితానికి రక్షణగా భవిష్యత్తుకు భరోసాగా నిలుస్తాయని పేర్కొన్నారు ఐదేళ్ల లోపు వయసున్న ప్రతి ఒక్కచిన్నారికీ తల్లితండ్రులు మర్చిపోకుండా పోలియో చుక్కలు వేయించి వారిని ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు..

## సర్ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొంటున్న తెదేపా నాయకులు



**విజయవాడ పశ్చిమ జూన్ 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విజయవాడ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని తెదేపా రాష్ట్ర స్థాయి, పార్లమెంట్ స్థాయి, నియోజకవర్గ,డివిజన్ స్థాయిలోని తెదేపా నాయకులు సర్ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొంటున్నారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాద్ చిన్ని ఆదేశాలతో. టిడిపి పార్టీ పశ్చిమ నియోజవర్గం మాజీ బీసీ సెల్ అధ్యక్షులు నమ్మి భాను ప్రకాష్ యాదవ్.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ూ×=-2026 (ూజూవఎఋశ్రీ ×త్వఅంఅజవ =వజఅంఅశీఅ) కార్యక్రమంలో భాగంగా సోమవారం విజయవాడ పశ్చిమ నియోజకవర్గం 47వ డివిజన్ జీవరత్నం వీధి 110బూత్ నందు బి ఎల్ ఓ ఝాన్సీ లక్ష్మి తో పాటు డోర్ టు డోర్ వెళ్లి ఓటర్ ఎన్రోల్మెంట్ ఫారాలు అందజేసి ఓటరు జాబితా పరిశీలన, కొత్త ఓటరు నమోదు, వివరాల సవరణ, చిరునామా మార్పు, తొలగింపు దరఖాస్తులు మరియు సర్-2026 సంబంధిత వివరాలపై అవగాహన కల్పించారు. అవసరమైన సహాయం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు నాగోతి రామారావు టిడిపి పార్టీ110 నెంబర్ బూత్ కన్వీనర్ పైలా నరసింహారావు, దేవనా శీను తదితరులు పాల్గొన్నారు

### జులై 1 న జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా

## ఐఎంఏ ఆధ్వర్యంలో ఐదుగురు సీనియర్ వైద్యులకు సన్మానం


Dr. T. Venugopala Rao


Dr. D. Uday Kumar


Dr. G. Venugopal


Dr. Chebrolu Visweswara Rao


Dr. Peddi Siva Deva Prasad

**గుంటూరు టౌన్ జూన్ 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)**జూలై 1న జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ఐఎంఏ గుంటూరు శాఖ ఆధ్వర్యంలో వివిధ వైద్య విభాగాలలో సుదీర్ఘకాలంగా ఉత్తమ సేవలు అందిస్తున్న ఐదుగురు వైద్యులను సన్మానిస్తున్నట్టు ఐఎంఏ గుంటూరు శాఖ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ టి. సేవ కుమార్, డాక్టర్ బి .సాయికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు .జూలై 1వ తేదీ బుధవారం సాయంత్రం స్థానిక కలెక్టర్ బంగ్లా రోడ్ లోని జిఎంఎ హాల్లో నిర్వహించే ఈ కార్యక్రమంలో సీనియర్ ఫిజీషియన్స్ డాక్టర్ జి. వేణుగోపాల్, డాక్టర్ పి. శివదేవ ప్రసాద్ ,ఎనస్తీషియా వైద్య నిపుణులు, డాక్టర్ ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ మాజీ రిజిస్ట్రార్ డాక్టర్ తన్నీరు వేణుగోపాలరావు, ప్రముఖ యూరాలజిస్ట్ డాక్టర్ చేబ్రోలు విశ్వేశ్వరరావు, నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ ధరణికోట ఉదయ్ కుమార్ లను సన్మానిస్తున్నట్టు వారు ఆ ప్రకటనలో తెలిపారు. ఐఎంఏ గుంటూరు శాఖ వైద్యులు అందరు ఈ జాతీయ వైద్యుల దినోత్సవ కార్యక్రమంలో పాల్గొనాలని వారు ఆ ప్రకటనలో కోరారు .

## మెరుగైన వైద్యం కోసం ఎల్ఓసిలు అందజేత ..



**విజయవాడ పశ్చిమ జూన్ 29(వార్తా ప్రభ ప్రతినిధి)**ఎం ఎల్ ఏ సుజన చౌదరి సౌజన్యంతో ముఖ్యమంత్రి సహాయనిది నుండి మంజూరైన ఎల్ ఓ సీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) లను కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ కూటమి నేతలతో కలిసి ఎన్డీయే కార్యాలయంలో అందజేశారు .. 53 వ డివిజన్ కు చెందిన పీ కనకరావు (44) హృద్రోగం తో బాధపడుతూ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు అతనికి మెరుగైన వైద్యం అందించాలని శస్త్ర చికిత్స చేయాలని వైద్యులు తెలపడంతో బీజేపీ నాయకులు పోతిన అవినాష్ ఎన్డీయే కార్యాలయంలో వైద్యం సాయం కోసం దరఖాస్తు చేయగా మంజూరైన రూ 8 లక్షల ఎల్ ఓ సీ ను బాధితుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. 39 వ డివిజన్ కు చెందిన డి లక్ష్మణ్ ( 21) అనారోగ్యం తో బాధపడుతూ వైద్యం సాయం కోసం దరఖాస్తు చేసుకోగా మంజూరైన రూ 4 లక్షల 13 వేల ఎల్ ఓ సీ ను అందజేశారు.త్వరితగతిన స్పందించి ఎల్ ఓ సీ ను అందజేయడంతో బాధిత కుటుంబ సభ్యులు ఎం ఎల్ ఏ సుజన చౌదరి కు కృతజ్ఞతలు తెలిపారు. మాజీ కార్పొరేటర్ బుల్లా విజయ్ కుమార్,ఎన్డీయే కూటమి నేతలు పచ్చిపులుసు వెంకట శివప్రసాద్ ,అడ్డూరి భాస్కరరావు, పులిచేరి రమేష్, విజయలక్ష్మి, సాయి శరత్, సుజనా మిత్రా కోఆర్డినేటర్లు పాల్గొన్నారు..

## సమస్యలు సహజమే!




సముద్రంలో కెరటాలు
జీవితంలో సమస్యలు
ఉంటాయి నిరంతరము
జయిస్తేనే విజయము
జీవితమే పోరాటము
అంతులేని ఆరాటము
స్థిరమైన సంకల్పమే
విజయానికి సోపానము
ఉండరాదు పిరికితనము
గుండెల్లో అధైర్యము
మనోనిబ్బరము ఘనము
గెలుపు బాటకు మూలము
గెలుపు ఓటములు సహజము
మానరాదు ప్రయత్నాలు
అక్షరాలది సత్యము
గుర్తించుకో నిత్యము

**-గద్వాల సోమన్న,**
ఎమ్మిగనూరు,
సెల్ :9966414580

# “ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఎంపీ కేశినేని చిన్ని”

**“అభివృద్ధి ఆగదు... ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తాం”**
**- ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)**
**గుణదల ప్రజలకు రూ.98.68 కోట్ల అభివృద్ధి కానుక - దశాబ్దాల ట్రాఫిక్ కష్టాలకు శాశ్వత పరిష్కారానికి శ్రీకారం**





**విజయవాడ పశ్చిమ జూన్ 29 :,(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడప్రజలకు ఇచ్చిన హామీలను కార్యరూపంలో చూపిస్తూ విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్ (చిన్ని) మరో కీలక అభివృద్ధి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దశాబ్దాలుగా గుణదల--నున్న ప్రాంత ప్రజలను వేధిస్తున్న రైల్వే గేటు ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారంగా రూ.98.68 కోట్ల వ్యయంతో నిర్మించనున్న అత్యాధునిక రోడ్డు ఓవర్ బ్రిడ్జి (ఆర్‌ఓబీ)కి సోమవారం ఘనంగా శంకుస్థాపన చేశారు.ఎన్నికల సమయంలో గుణదల ప్రజలకు ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం తీసుకొస్తానని హామీ ఇచ్చిన కేశినేని చిన్ని, ఆ మాటను ఏడాది వ్యవధిలోనే నిలబెట్టుకోవడం స్థానిక ప్రజల్లో విశేష చర్చనీయాంశంగా మారింది. ఈ శంకుస్థాపనతో “మాటలు కాదు, చేతలే” అనే సందేశాన్ని ఆయన మరోసారి ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లారని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.శంకుస్థాపన కార్యక్రమంలో మాట్లాడిన ఎంపీ కేశినేని చిన్ని, “గుణదల ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న రోజు ఇదని, ఈ ఆర్‌ఓబీ పూర్తయితే గుణదల--నున్న ప్రాంతాల రాకపోకలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడమే తన బాధ్యత అనీ అభివృద్ధి ఆగదనీ, డబల్ ఇంజిన్ సర్కారుతో తమ ప్రయాణం కొనసాగుతుంది” అని స్పష్టం చేశారు.విజయవాడ పార్లమెంట్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అన్ని రైల్వే ఓవర్ బ్రిడ్జిలను దశలవారీగా పూర్తి చేయడమే తన లక్ష్యమని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే బోండా ఉమా మహేశ్వరరావుతో సమన్వయం చేసుకుంటూ ఉలవచారు కంపెనీ సమీపంలో మరో ఆర్‌ఓబీకి కూడా త్వరలో శంకుస్థాపన చేసి, రెండేళ్లలో పూర్తయ్యేలా పర్యవేక్షిస్తామని వెల్లడించారు.గుణదల రైల్వే లెవెల్ క్రాసింగ్ నంబర్--316 వద్ద రోజూ సుమారు 170 రైళ్లు రాకపోకలు సాగుతుండటంతో గేటు దాదాపు 14 నుంచి 16 గంటల పాటు మూసివేయాల్సిన పరిస్థితి నెలకొంది. వేలాది మంది వాహనదారులు ప్రతిరోజూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ఆర్‌ఓబీ పూర్తయిన తర్వాత ప్రస్తుతం 15 నుంచి 20 నిమిషాలు పట్టే నిరీక్షణ సమయం దాదాపు నిమిషానికి తగ్గనుంది. ట్రాఫిక్ సమస్య పూర్తిస్థాయిలో తొలగి రాకపోకలు సులభతరం కానున్నాయి.రూ.98.68 కోట్ల వ్యయంతో నిర్మించే ఈ ఆర్‌ఓబీ 920 మీటర్ల పొడవుతో, 18 స్పాన్లతో అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించనున్నారు. ప్రధాన రహదారితో పాటు సర్వీస్ రోడ్లు, క్రాష్ బ్యారియర్లు, ఆధునిక డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రాజెక్టును 18 నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు.ఈ సందర్భంగా ఎంపీ కేశినేని చిన్ని మాట్లాడుతూ, ఈ ప్రాజెక్టు కోసం కేంద్ర రైల్వే శాఖతో పలుమార్లు చర్చలు జరిపి, ప్రజల సమస్యను పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేశామని తెలిపారు. ఈ అవకాశం కల్పించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.గుణదల ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చడం ద్వారా “మాట నిలబెట్టుకునే నాయకుడు”గా ఎంపీ కేశినేని చిన్ని మరోసారి తన ప్రత్యేకతను చాటుకున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. గుణదల ఆర్‌ఓబీ శంకుస్థాపన విజయవాడ అభివృద్ధి చరిత్రలో మరో కీలక మైలురాయిగా నిలవనుందని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో రైల్వే అధికారులు ఏ డి ఆర్ ఎమ్ ఎడ్విన్,సైమన్, డీ సీ ఎమ్ ప్రశాంత్ కుమార్,సీనియర్ ఇంజినీర్ ఎస్ శ్రీనివాసరావు, రమణారావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానిక టీడీపీ నాయకులు,సీనియర్ నాయకులు బొప్పన భవ కుమార్ జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి చిట్టిబాబు,రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి దాసరి ఉదయశ్రీ,కె కిరణ్, రఘురామరాజు, గురునాథం, భవకుమార్,కరీముల్లా,సాయి చరణ్,ఉషారాణి,సంజయ్ వర్మ,వల్లభనేని సతీష్,రేగేళ్ల లక్ష్మణరావు, పిళ్లా శ్రీనివాసరావు, ఆషా, మాల్యాద్రి,తదితరులు పాల్గొన్నారు.

## తిరుమలలో శరభయ్య యాదవ్ విగ్రహం, మఠం ఏర్పాటు చేయాలి: యాదవ మహాసభ



**తిరుపతి, జూన్ 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)** కలియుగంలో శ్రీ వేంకటేశ్వర స్వామిని మొట్టమొదట దర్శించిన మానవుడు శరభయ్య యాదవ్ అని, ఆయన చరిత్రను ప్రజలకు విస్తృతంగా తెలియజేయాల్సిన అవసరం ఉందని అఖిల భారతీయ యాదవ మహాసభ నగర అధ్యక్షుడు సుబ్బు యాదవ్ తెలిపారు.తిరుపతి ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఉదయం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, శరభయ్య యాదవ్ చరిత్ర గురించి చాలా మంది యాదవులకు కూడా పూర్తి అవగాహన లేకపోవడం బాధాకరమన్నారు. ఈ నేపథ్యంలో జూలై 5, 2026న నిర్వహించనున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.తిరుమలలో శరభయ్య యాదవ్ విగ్రహం, మఠం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ యాదవ సమాజం ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. యాదవుల చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేయడానికి ఈ ఉద్యమం దోహదపడుతుందని పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న ప్రతి ఒక్కరూ సమావేశాలకు హాజరై ఉద్యమాన్ని విజయవంతం చేయాలని సుబ్బు యాదవ్ పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో శంకర్ యాదవ్, కృష్ణ యాదవ్, హరి యాదవ్ ,శివా యాదవ్ ,సద్దా సుబ్రహ్మణ్యం యాదవ్ ,ఆర్ఆర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ విద్యార్థులకు ఏఐ ఫౌండేషన్ కోర్సు.!

**సీడ్స్ ఆధ్వర్యంలో వై జె ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శిక్షణా కార్యక్రమం.**



**మచిలీపట్నం జూన్ 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)**సోషల్ ఎంపవర్మెంట్ ఎకనామిక్ డెవలప్మెంట్ సొసైటీ (సీడ్స్) ఆధ్వర్యంలో స్థానిక వై జె ఆర్ బి ఎం ఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం పాలిటెక్నిక్ విద్యార్థుల కోసం ఫౌండేషన్ కోసం ఏఐ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు.కార్యక్రమంలో విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యొక్క ప్రాథమిక అంశాలు, జనరేటివ్ ఏఐ, ఏఐ ఇన్ ఎడ్యుకేషన్, ప్రాంప్ట్ ఇంజనీరింగ్ ,ఏఐ ఎథిక్స్ ఆధునిక ఏఐ సాంకేతికతలపై అవగాహన కల్పించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ భవిష్యత్‌లో ప్రతి రంగంలో కీలక పాత్ర పోషిస్తుందని, విద్యార్థులు ఈ సాంకేతికతను నేర్చుకోవడం ద్వారా ఉన్నత విద్య, పరిశోధన మరియు ఉద్యోగ అవకాశాలను మెరుగుపరచుకోవచ్చని వివరించారు.అలాగే చాట్ జిపిటి, గూగుల్ జెమినీ, మైక్రోసాఫ్ట్ కాపీలట్ కాన్వా ఏఐ వంటి ప్రముఖ ఏ ఐ టూల్స్‌ను ఉపయోగించి ప్రాజెక్ట్ రిపోర్టులు, సెమినార్ రిపోర్టులు, ప్రజెంటేషన్లు, అసైన్‌మెంట్లు, రెజ్యూమ్‌లు, అధికారిక లేఖలు, ఇ-మెయిల్స్, స్టడీ మెటీరియల్ తయారు చేయడం, కోడింగ్, డీబగ్గింగ్, డేటా విశ్లేషణ, పరిశోధన (రీసెర్చ్) అనువాదం, ఇంటర్వ్యూ ప్రిపరేషన్ వంటి అంశాలపై ప్రాక్టికల్ శిక్షణ అందించారు. సరైన ప్రోమో ఇవ్వడం ద్వారా ఏఐ నుండి నాణ్యమైన ఫలితాలను ఎలా పొందాలో ప్రత్యక్షంగా ప్రదర్శించారు.ఫౌండేషన్ కోర్స్ ఇన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏ ఐ) విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులకు ఎన్ ఎస్ డి సి నుంచి గుర్తింపు పొందిన సర్టిఫికేట్ అందజేయబడుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ సర్టిఫికేట్ విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి తోడ్పడటంతో పాటు ఉన్నత విద్య మరియు ఉపాధి అవకాశాలకు ఉపయోగపడుతుందని వివరించారు.విద్యార్థులు ఈ శిక్షణలో ఉత్సాహంగా పాల్గొని ఏ ఐ టూల్స్‌ను స్వయంగా ఉపయోగించి వాటి ప్రయోజనాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో ఏఐ పట్ల ఆసక్తిని పెంచడంతో పాటు ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించడంలో ఎంతో ఉపయోగపడిందని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. టి. రవికుమార్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ఎన్. సుష్మ, కళాశాల మేనేజ్‌మెంట్ సభ్యులు కిరణ్, సీడ్స్ ప్రతినిధుల బృందానికి చెందిన వేణు,ఉదయ్, అధ్యాపకులు, పాలిటెక్నిక్ విద్యార్థులు పాల్గొన్నారు.

## మీకోసం కార్యక్రమంలో స్పందించిన జిల్లా కలెక్టర్..

**అనాథ గిరిజన విద్యార్థినికి వెంటనే ఆదాయ ధ్రువీకరణ పత్రం జారీకి ఆదేశం..**



**మచిలీపట్నం జూన్ 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)**జిల్లా కలెక్టర్ నిర్వహించిన “మీకోసం” ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో హృదయాన్ని కదిలించే ఘటన చోటుచేసుకుంది. గిరిజన సంచార జాతికి చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థిని సి.హెచ్. నరసమ్మ తనకు ఆదాయ ధ్రువీకరణ పత్రం (ఇన్‌కమ్ సర్టిఫికెట్) ఇవ్వడం లేదని కలెక్టర్‌ను ఆశ్రయించింది.చింతకుంటపాలెంకు చెందిన నరసమ్మ చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయి ప్రస్తుతం తన అమ్మమ్మ సంరక్షణలో పెరుగుతోంది. ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని ఇటీవల ఇంటర్మీడియట్ పూర్తి చేసి, ఎంసెట్ పరీక్ష కూడా రాసినట్లు కలెక్టర్‌కు వివరించింది. విద్యార్థినితో కాసేపు ఆప్యాయంగా మాట్లాడిన జిల్లా కలెక్టర్, ఆమె పరిస్థితిని తెలుసుకుని అభినందించారు. “బాగా చదివి ఎంసెట్‌లో అత్యుత్తమ ర్యాంకు సాధించి ఉన్నత స్థాయికి చేరుకోవాలి” అంటూ ఆమెను ప్రోత్సహించారు.అనాథ కావడంతో ఆదాయ ధ్రువీకరణ పత్రం మంజూరు చేయడం లేదని ఆమె ఫిర్యాదు చేయగా, వెంటనే స్పందించిన కలెక్టర్ సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేసి, తక్షణమే ఇన్‌కమ్ సర్టిఫికెట్ మంజూరు చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ సత్వర స్పందనతో ఆనందం వ్యక్తం చేసిన నరసమ్మ, తన సమస్యను వెంటనే పరిష్కరించినందుకు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపింది. ఈ ఘటన ప్రజల సమస్యల పరిష్కారంలో “మీకోసం” కార్యక్రమం ప్రభావాన్ని మరోసారి చాటిచెప్పింది.

## రైతు రాజైతే.. రాజ్యం సుభిక్షమవుతుంది

**- రాష్ట్రంలో వ్యవసాయ రంగ పరిరక్షణకు పెద్దపీట వేస్తున్నాం - రూ.58 వేల కోట్లతో వ్యవసాయ బడ్జెట్ దేశానికే ఆదర్శం - వీలైనంత త్వరగా పోలవరం పూర్తి చేసి రైతాంగానికి అంకితమిస్తాం - ఏరువాక కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర.**



**మచిలీపట్నం జూన్ 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)** రాష్ట్రంలో రైతాంగం సంక్షేమానికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మచిలీపట్నం రూరల్ మండలం బుద్దాలపాలెంలో నిర్వహించిన ఏరువాక కార్యక్రమంలో పాల్గొన్నారు. రైతులతో కలిసి భూదేవికి పూజలు చేశారు. వ్యవసాయ క్షేత్రంలోకి వెళ్లి దుక్కి దున్ని విత్తనాలు చల్లారు. రైతులకు ఎరువులు, విత్తనాల బస్తాలను పంపిణీ చేశారు. బుద్దాలపాలెంకు రోడ్డు మంజూరైంది. త్వరలోనే పూర్తి చేస్తాం. మంచినీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం. ఇంటింటికీ కుళాయి అందుబాటులోకి తీసుకొస్తాం. మౌలిక సదుపాయాలు కల్పించి తీరుతాం. బందరు పోర్టు వీలైనంత త్వరగా పూర్తి చేసి.. స్థానికంగా యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తాం. పర్యాటకాన్ని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. రైతుని, వ్యవసాయాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపైనా ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక రైతాంగాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో పని చేస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.58 వేల కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టాం. వ్యవసాయ బడ్జెట్ ప్రవేశపెట్టిన ఘనత కూడా చంద్రబాబు నాయుడిదే. రైతులకు వ్యవసాయంలో అండగా నిలిచేందుకు ఉచితంగా భూసార పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఏ సీజన్లో ఎలాంటి పంటలు వేస్తే లాభసాటిగా ఉంటుందో వ్యవసాయ అధికారులతో సలహాలు సూచనలు అందిస్తున్నాం. నీటి సంఘాలను ఏర్పాటు చేసి.. సాగునీటి కాలువలన్నీ బాగు చేసుకున్నాం. బందరు నియోజకవర్గంలోని రూ.3 కోట్లతో సాగునీటి కాలువలను అభివృద్ధి చేశాం. ప్రకృతి వ్యవసాయానికి పెద్దపీట వేశాం. కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహకాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. సబ్సిడీతో విత్తనాలు, ఎరువులు అందిస్తున్నాం. గతంలో పండిన పంటను అమ్ముకునే దిక్కులేదు. డబ్బులు ఎప్పుడొస్తాయో తెలియదు. కానీ నేడు పంట అమ్ముకున్న 24 గంటల్లోనే రైతు ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నాం. సాగునీటికి ఇబ్బందులు లేకుండా పట్టిసీమ నిర్మాణంతో కృష్ణా డెల్టాను సస్యశ్యామలం చేశాం. పొరుగు రాష్ట్రం ప్రయోజనాల కోసం జగన్ రెడ్డి పోలవరం ప్రాజెక్టును పాడుబెట్టాలని ప్రయత్నిస్తే.. కూటమి వచ్చిన వెంటనే పోలవరం ప్రాజెక్టు పనులు వేగం పెంచాం. వచ్చే ఏడాది నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి చూపిస్తాం. గ్రావిటీ ద్వారా సాగునీరు అందిస్తాం. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంక్షేమ పథకాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాం. 63 లక్షల మందికి పెన్షన్లు అందిస్తున్నాం. రెండేళ్లలో రూ.65 వేల కోట్లు అందించాం. ఎంత మంది పిల్లలుంటే అంతమందికీ తల్లికి వందనం పథకం అందిస్తున్నాం. జులై 15న తల్లికి వందనం అమలు చేయబోతున్నాం. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ప్రతి రైతుకు రూ.20 వేలు ఇస్తున్నాం. గతంలో కేంద్రం ఇచ్చే సొమ్ము మాత్రమే రైతుల ఖాతాల్లో వేసి ఉద్ధరించినట్లు చెప్పుకున్నారు. కానీ మనం కేంద్రం ఇచ్చే రూ.6 వేలకు రూ.14 వేలు చేర్చి రూ.20 వేల చొప్పున అందిస్తున్నాం. ఉచిత బస్సు, ఉచిత గ్యాస్ సిలిండర్ అందిస్తున్నాం. గతంలో రోడ్లు అన్నీ గుంతలమయం అయితే.. నేడు గుంతలు లేని రోడ్లు సాకారం చేసి చూపించాం. సంక్షేమం అభివృద్ధికి సమ ప్రాధాన్యమిస్తున్నాం. రాష్ట్రాన్ని సర్వతోముఖాభివృద్ధి దిశగా నడిపిస్తున్నాం. అమరావతి, పోలవరం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పరిశ్రమలు పెట్టుబడులతో రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నాం. రాష్ట్రంలో జరుగుతున్న మంచి చూసి ఓర్వలేక జగన్ రెడ్డి రోజుకో కుట్రకు తెరలేపుతున్నాడు. ఈ మధ్య విజయవాడలో ఒక సంఘటన జరిగితే.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సింగపూర్ నుండి రాగానే బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. ఘటనపై పూర్తి విచారణ జరిపించేందుకు సిట్ వేశారు. సీఐని సస్పెండ్ చేశారు. ఆ ఘటనకు కులం అంటగడుతున్నారు. ఆడబిడ్డలపై దాడి చేసిన వాడికి కులం ఏంటి? హత్యలు చేసిన వాడికి కులం ఏంటి? కులం మతం ప్రాంతం పేరుతో ప్రజల మధ్య చిచ్చు పెట్టేందుకు ప్రయత్నించే వైసీపీ నాయకుల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. మొన్నటి వరకు అమరావతి వద్దు మూడు రాజధానులు కావాలన్నారు. ఇప్పుడు అమరావతిని ఉద్ధరిస్తామంటూ రాజకీయం చేయాలని ప్రయత్నిస్తే.. రైతులంతా తిరగబడి పరిగెత్తించి మరీ కొట్టారు. బందరు నుండి ఒక వ్యక్తి ఎగేసుకు వెళ్లి ప్రజలతో చీవాట్లు తిని వచ్చాడు. జగన్ రెడ్డి లాంటి దుర్మార్గుల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. మనం ఇటుక ఇటుక పేర్చి నిర్మాణం చేస్తుంటే.. జగన్ రెడ్డి లాంటి వాళ్లు వచ్చి కూలగొడుతున్నారు. ఒకే ప్రభుత్వం పాతికేళ్లు నిలకడగా ఉండాలి. అప్పుడే మనం అభివృద్ధిని సాధించగలుగుతాం. గతంలో గుజరాత్ లాంటి రాష్ట్రాల్లో ప్రభుత్వాలు కొనసాగడంతోనే అభివృద్ధి శాశ్వతంగా నిలిచింది. అదే స్ఫూర్తి ఇక్కడా చూపిస్తే.. ఏపీని దేశంలోనే అగ్రస్థానంలో నిలిపి చూపిస్తామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

సంబంధించిన చెల్లించని పన్నులపై నిబంధనల ప్రకారం వడ్డీ విధించబడుతుందని, అందువల్ల నగర ప్రజలందరూ గడువు తేదీలోగా పన్నులన్నీ చెల్లించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ ధ్యానచంద్ర విజ్ఞప్తి చేశారు.

## ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలి

**ఏఈఆర్‌వోలు, బీఎల్‌వోలతో సమీక్ష నిర్వహించిన కమిషనర్ ధ్యానచంద్ర**



**విజయవాడ పశ్చిమ జూన్ 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర సోమవారం సాయంత్రం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమం పురోగతిపై ఏఈఆర్‌వోలు, బీఎల్‌వోలతో ఏకేటిపి స్కూల్ సత్యనారాయణపురం లో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ఎస్ఐఆర్‌లో భాగంగా అర్హులైన ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీని వేగవంతంగా పూర్తి చేయడంతో పాటు, డిజిటలైజేషన్ ప్రక్రియను కూడా అదే స్థాయిలో వేగవంతం చేయాలని సూచించారు. విజయవాడ నగర పరిధిలోని తూర్పు, పశ్చిమ, సెంట్రల్ నియోజకవర్గాలకు చెందిన ఏఈఆర్‌వోలు, బీఎల్‌వోలు ఒకే కేంద్రంలో సమన్వయంతో డిజిటలైజేషన్ చేపట్టడం ద్వారా పనుల వేగం మరింత పెరుగుతుందని తెలిపారు.డిజిటలైజేషన్ ప్రక్రియలో ఎదురయ్యే సాంకేతిక సమస్యలు, సందేహాలను అధికారులు పరస్పరం చర్చించుకుని వెంటనే పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ విధానం ద్వారా పనుల్లో ఏకరూపతతో పాటు వేగం కూడా పెరుగుతుందన్నారు.అదేవిధంగా ఎన్నికల విధులకు సంబంధించిన అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డిజిటలైజేషన్ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ఏదైనా సందేహం తలెత్తిన వెంటనే ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవడం ద్వారా డిజిటలైజేషన్‌ను నిర్ణీత గడువులోగా పూర్తి చేయవచ్చని కమిషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు.ఈ సమావేశంలో అదనపు కమిషనర్ శకుంతల, జోనల్ కమిషనర్ కె. ప్రభుదాస్, ఏ ఈ ఆర్ వో రాంబాబు, ఎలక్షన్ డిటి యస్. సురేష్ కుమార్, బిఎల్వోలు పాల్గొన్నారు.

## ప్రధాన మంత్రి స్కూల్ ఫర్ రైసింగ్ ఇండియా కార్యక్రమం



**పెనుగంచిప్రోలు, జూన్ 29( వార్త ప్రభ )** ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైసింగ్ ఇండియా కార్యక్రమంకాకాని వెంకటరత్నం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను సమగ్ర శిక్ష రాష్ట్ర స్థాయి అధికారులు పాఠశాలను సోమవారం సందర్శించడం జరిగినది. పీఎం శ్రీ ప్రాజెక్టుకు సంబంధించి పాఠశాలలు అమలవుతున్న పథకాలను మరియు మనబడి మన భవిష్యత్తు క్రింద మంజూరైన అదనపు తరగతి గదులను పరిశీలించి మరియు విద్యార్థుల యొక్క సిలబస్ మరియు పాఠ్య పుస్తకాలు స్కూల్ డెవలప్మెంట్ కు సంబంధించిన విషయాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష రాష్ట్ర స్థాయి ఉన్నత అధికారులైన బట్టు సురేష్, ఏ ఎమ్ ఓ అశోక్ , మండల విద్యాశాఖ అధికారి డి రవీందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కే జలజ, ఉపాధ్యాయులు సిఆర్ పి జొన్నల గడ్డ చిన్న గోపాల్ తదితరులు పాల్గొన్నారు..

## వైభవంగా ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు





**విజయవాడ పశ్చిమ జూన్ 29 : (వార్తా ప్రభ ప్రతినిధి)** చిట్టినగర్లో వేంచేసివున్న శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీ గరుడాచల స్థిత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో సోమవారం నుండి వచ్చే నెల 03-07-2026 బుధవారము వరకు జరుగు స్వామివారి15వ వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగవైభవంగా మొదలైయ్యాయి. మొదటిరోజులో భాగంగా సోమవారం పౌర్ణమి సందర్భంగా ఉదయము కృష్ణానది నుండి దేవస్థానం కోశాధికారి పిళ్ళా శ్రీనివాస్ మరియు భక్తులు కృష్ణాజలము తెచ్చి1008 కలశములతో స్వామివారికి జలాభిషేఖం ఆనంతరము పంచామృతము వివిధ రకముల పళ్ళరసములతో స్వామివారికి అభిషేకం అత్యంత వైభవపేతంగా నిర్వహించబడినది. ఈ బ్రహ్మోత్సవాలు నిమిత్తము విజయవాడ నగర మాజీ మేయర్ శ్రీమతి రాయన భాగ్యాలక్ష్మీ నరేంద్ర గ దంపతులు పట్టువస్త్రములు సమర్పించారు. సాయంత్రం అఖండ దీపారాధన అంకురార్పణ వాస్తు పూజ, వాస్తు హోమం, దీక్షా చరణ, కంకణ ధారణ గరుడ ఆరాధన కార్యక్రమాలు విశేషంగా నిర్వహించబడినవి. దేవస్థానం ప్రధాన అర్చకులు వినుకొండ రత్నమాచార్యులు వారి శిష్యబృందం తిరుమల నుండి వచ్చిన పండితులచే కార్యక్రమములు జరుపబడుచున్నవి. ఈ కార్యక్రమములు దేవస్థానం కార్యదర్శి మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు ప్రత్యక్ష పర్యవేక్షణలో జరిగాయి. ఈ కార్యక్రమములో ఉట్టి పుల్లారావు, ఉట్టి విష్ణు వర్ధనరావు, బాయన భాస్కర్ దంపతులు మరియు దేవస్థానం కార్యవర్గసభ్యులు కొరగంజి భాస్కరరావు, మజ్జి శ్రీనివాసరావు, ఈది యల్లారాజారావు, పోతిన వెంకట ధర్మారావు, కామందుల నరసింహారావు, పిళ్ళా విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గం మెడికల్ లాబరేటరీ అసోసియేషన్ నూతన అధ్యక్షులుగా షేక్ మహమ్మద్ అలీ



**జగ్గయ్యపేట జూన్ 29 (వార్తప్రభ)** పట్టణ సమీపంలోని డాల్ఫిన్స్ హోటల్ లో సోమవారం జగ్గయ్యపేట నియోజకవర్గ మెడికల్ లాబరేటరీ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. నూతన అధ్యక్షులుగా షేక్ మహమ్మద్ అలీ, ఉపాధ్యక్షులుగా షేక్ జబ్బార్, కార్యదర్శిగా గరికపాటి రాజు, సహాయ కార్యదర్శిగా షేక్ మహబూబ్ సుభాని, కోశాధికారిగా కేతరాజు పార్థసారథి, కార్యవర్గ సభ్యులుగా కామినేని భూపాలరావు, కట్ట కోటేశ్వరరావు, గాలి చౌడయ్య, మార్తి వీర కృష్ణ, కొరముట్ల శివప్రసాద్, షేక్ షాబుద్దీన్ అహ్మద్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఘనంగా సత్కరించారు. అనంతరం కార్యవర్గం సమావేశంలో పలు నిర్ణయాలను చేశారు. భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ఈ కార్యక్రమంలో లేబరేటరీ సభ్యులు పాల్గొన్నారు.

# అక్రమ రిజిస్ట్రేషన్ పై జిల్లా కలెక్టర్లకు ఫిర్యాదు

**కొండపల్లిలో వక్ఫ్ బోర్డు స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేశారని బాధితుడు ఫిర్యాదు**

**అదే స్థలం తమకు అమ్ముతామని 18 లక్షలు తీసుకున్నారని ఫిర్యాదు**



**ఇబ్రహీంపట్నం, జూన్ 29(వార్తా ప్రభ ప్రతినిధి):** రిజిస్టర్ కార్యాలయం పై ఎన్ని ఆరోపణలు వచ్చినా, అవినీతి నిరోధక శాఖ అధికారులు దాడులు చేసి అధికారులను సస్పెండ్ చేసిన.. అధికారుల తీరు మాత్రం మారటం లేదు. కొండపల్లిలో వక్ఫ్ బోర్డు స్థలాన్ని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారని జిల్లా కలెక్టర్ లక్ష్మి శా కు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు బాధితుడు. కొండపల్లి 293 సర్వే నెంబర్ లో హజరత్ మూర్తుజా అలీ పంజా వక్ఫ్ బోర్డు స్థలం. అది ఆక్రమణకు గురిందని వక్ఫ్ బోర్డు అధికారుల ఫిర్యాదు, కేసు కోర్టులో ఉంది. అదే స్థలాన్ని ఇబ్రహీంపట్నం రిజిస్టర్ కార్యాలయంలో అక్రమ రిజిస్ట్రేషన్ జరిగిందని కలెక్టర్లకు మొరపెట్టుకున్నాడు బాధితుడు. స్థలాన్ని తమకు అమ్ముతామని 18 లక్షల రూపాయలు తీసుకున్నారని అందుకు సంబంధించిన పూర్తి ఆధారాలు తన వద్ద ఉన్నాయన్నారు. ఇప్పుడు అడిగితే ముఖం చాటిస్తున్నారని, తనకు న్యాయం చేయాలని ఫిర్యాదులు విన్నవించుకున్నాడు. ఇబ్రహీంపట్నం రిజిస్టర్ కార్యాలయం జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్ పై అధికారులు విచారణ చేయాలని విజ్ఞప్తి చేశారు.

## గుంటుపల్లి గ్రామంలో బాల సభ, మహిళా సభ, గ్రామ సభల నిర్వహణ

**మాల్దీవుల ప్రజాప్రతినిధుల సందర్శన**






**ఇబ్రహీంపట్నం, జూన్ 29(వార్తా ప్రభ ప్రతినిధి):** గుంటుపల్లి జెడ్పీ హైస్కూల్ వద్ద రైజ్ సెంటర్ లో బాల సభ, మహిళా సభ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం గుంటుపల్లి గ్రామ పంచాయతీలో గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు మాల్దీవుల గౌరవనీయ ఎన్నికైన ప్రజాప్రతినిధుల బృందం హాజరై, గ్రామ స్థాయిలో అమలవుతున్న స్థానిక పాలన, ప్రజల భాగస్వామ్యం, బాలలు మరియు మహిళల సాధికారతకు సంబంధించిన కార్యక్రమాలను ఆసక్తిగా పరిశీలించారు. బాల సభ, మహిళా సభల ద్వారా స్థానిక సమస్యలపై పిల్లలు, మహిళలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడం, గ్రామ సభలో ప్రజా సమస్యలపై చర్చించి అభివృద్ధి కార్యక్రమాలపై నిర్ణయాలు తీసుకోవడం వంటి అంశాలను వారు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి సీతా మహాలక్ష్మి, జిల్లా స్థానిక పంచాయతీ అధికారి రాఘవన్, ఎంపీడీఓ శకుంతల, డిప్యూటీ ఎంపీడీఓ వి. మనోజ్ తదితర అధికారులు పాల్గొన్నారు. అధికారులు మాల్దీవుల ప్రతినిధులకు గ్రామ పంచాయతీ పరిపాలన, గ్రామ సభల నిర్వహణ విధానం, ప్రజల భాగస్వామ్యంతో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. మాల్దీవుల ప్రతినిధులు భారతదేశంలోని పంచాయతీ రాజ్ వ్యవస్థను అభినందిస్తూ, ఈ పద్ధతులు తమ దేశంలో కూడా ఉపయోగకరంగా ఉంటాయని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు, మహిళా సంఘాల సభ్యులు, విద్యార్థులు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## "విద్యాసంస్థల భద్రతపై రాజీ లేదు.. సీసీ కెమెరాలు తప్పనిసరి" : సీఐ సురేష్ కుమార్



**చంద్రగిరి, జూన్ 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)** చంద్రగిరి మండల పరిధిలోని అన్ని పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు తమ విద్యాసంస్థల ఆవరణలో నాణ్యమైన సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని భద్రతా చర్యలను మరింత పటిష్ఠం చేయాలని చంద్రగిరి సీఐ సురేష్ కుమార్ సూచించారు. రాష్ట్రంలో ఇటీవల చోటుచేసుకున్న వరుస చోరీల నేపథ్యంలో కళాశాలల ప్రిన్సిపాల్స్, కరస్పాండెంట్లు, పరిపాలనా అధికారులు, భద్రతా సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించి పలు కీలక సూచనలు చేశారు. మధ్యప్రదేశ్, గుజరాత్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలకు చెందిన కరడుగట్టిన కూరవ, ధాన్, చెడ్డీ గ్యాంగ్‌లు రాష్ట్రంలోకి చొరబడి గతంలో అనంతపురం, కడప జిల్లాలతో పాటు ఈ ఏడాది దువ్వాడ, రాజమండ్రి, ఏలూరు, తిరుపతి జిల్లాల్లోని పలు విద్యాసంస్థలను లక్ష్యంగా చేసుకుని రాత్రివేళల్లో లాకర్లను పగులగొట్టి నగదు చోరీలకు పాల్పడినట్లు పోలీసు నిఘా వర్గాలకు సమాచారం అందిందని తెలిపారు. ప్రస్తుతం విద్యార్థుల అడ్మిషన్లు కొనసాగుతున్న నేపథ్యంలో కళాశాలల్లో నగదు లావాదేవీలు ఎక్కువగా జరుగుతున్నందున యాజమాన్యాలు అప్రమత్తంగా ఉండాలని సీఐ సూచించారు. కార్యాలయ లాకర్లలో రాత్రి వేళల్లో నగదు నిల్వ ఉంచకూడదని, రోజువారీ వసూళ్లను అదే రోజు బ్యాంకులో జమ చేయాలని తెలిపారు. అలాగే కళాశాల ప్రాంగణంలో 24 గంటలూ పనిచేసే విధంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కనీసం 30 రోజుల ఫుటేజీని భద్రపరచాలని సూచించారు. రైల్వే ట్రాక్‌లు, రైల్వే స్టేషన్లు లేదా నిర్మానుష్య ప్రాంతాలకు సమీపంలో ఉన్న విద్యాసంస్థలు వెనుక భాగంలో ఫ్లడ్‌లైట్లు, అదనపు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. రాత్రి వేళల్లో భద్రతా సిబ్బంది తరచూ గస్తీ నిర్వహించాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సీఐ సురేష్ కుమార్ యాజమాన్యాలకు విజ్ఞప్తి చేశారు. భద్రతా నిబంధనలను కచ్చితంగా అమలు చేయడం ద్వారా చోరీలు, ఇతర అవాంఛనీయ ఘటనలను నివారించవచ్చని ఆయన స్పష్టం చేశారు.

# నీరుకుల్లలో పల్లె ప్రగతి పనుల జాతర!!

**● రైతులకు ఆదర్శం కాంగ్రెస్ పాలన ● గత పదేళ్లలో చేయని అభివృద్ధిని రెండేళ్లలో చేసి చూపిస్తున్నాము ● ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణరావు**





**పెద్దపల్లి/గోదావరిఖని: జూన్ 29 (వార్తాప్రభ ప్రతినిధి)** పెద్దపల్లి శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు సోమవారం సుల్తానాబాద్ మండలం నీరుకుల్ల గ్రామంలో సహకార వారోత్సవాల సందర్భంగా రూ. 30 లక్షల సిసి రోడ్లు, డ్రైనేజీ పనుల ప్రారంభోత్సవాలతో పాటు, స్థానిక సహకార సంఘం ఆధ్వర్యంలో రైతులు, మహిళల సౌకర్యార్థం నూతనంగా ఏర్పాటు చేసిన కన్స్యూమర్ పెట్రోల్, డీజిల్ ఫిల్లింగ్ స్టేషన్‌ను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం 7 వేల మెట్రిక్ టన్నుల గోదాముల నిర్మాణం చేపడితే, సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే 20 వేల మెట్రిక్ టన్నుల పనులు ప్రారంభించి, రాబోయే రెండేళ్లలో నియోజకవర్గవ్యాప్తంగా లక్ష మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాములను నిర్మించడమే లక్ష్యంగా పెట్టుకుందని, ఇందులో భాగంగానే ఎలిగేడు శివారులో 15 వేల మెట్రిక్ టన్నుల గోదాముల నిర్మాణం జరుగుతోందని వెల్లడించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే విత్తన శుద్ధి కేంద్రంగా సుల్తానాబాద్ సొసైటీ ఎంపికైందని హర్షం వ్యక్తం చేస్తూ, గత వైఎస్సార్ హయాంలో మహిళా సంఘాలకు దక్కిన గౌరవాన్ని గత ప్రభుత్వం విస్మరిస్తే, ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ గర్రెపల్లి, భూపతిపూర్ శివార్లలో మహిళల ఆధ్వర్యంలో పెట్రోల్ పంప్ ఏర్పాటు చేసి వారి ఆర్థికాభివృద్ధికి అండగా నిలుస్తోందని స్పష్టం చేశారు. నీరుకుల్ల, కోమండ్లపల్లి, రంగంపల్లి, వేగురుపల్లి గ్రామస్తుల రవాణా కష్టాలను తీర్చేందుకు ఈ కొత్త బంక్ ఉపయోగపడుతుందని, గర్రెపల్లి నుండి పెగడపల్లి వరకు రూ. 100 కోట్లతో డబుల్ రోడ్డు పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని, అలాగే నీరుకుల్ల గ్రామ ప్రజల చిరకాల కోరికలైన మానేరు వాగు మంచినీటి సరఫరాను రెండు నెలల్లో పూర్తి చేసి, బస్సు సౌకర్యాన్ని కూడా కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో సర్పంచ్ కాంపల్లి సతీష్ కుమార్, ఏఎంసీ చైర్మన్ ప్రకాష్ రావు, సింగిల్ విండో చైర్మన్ గిరి శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ, డిసిఓ శ్రీమాల సహా పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, రైతులు, గ్రామస్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు

# యువతకు ఎన్టీపీసీ భరోసా!!

**● రామగుండంలోనే పోటీ పరీక్షల శిక్షణ ● ఆరు నెలల ప్రత్యేక శిక్షణా కార్యక్రమం ● ఉపాధి కల్పనే ధ్యేయంగా సరికొత్త అడుగు ● నాణ్యమైన కోచింగ్, స్టడీ మెటీరియల్స్ పంపిణీ**



**పెద్దపల్లి/గోదావరిఖని: జూన్ 29 (వార్తాప్రభ ప్రతినిధి)** పారిశ్రామిక ప్రగతికే కాకుండా సామాజిక బాధ్యతలోనూ తాము ఎప్పుడూ ముందే ఉంటామని ఎన్టీపీసీ రామగుండం మరోసారి చాటిచెప్పింది. గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతను ఉన్నత ఉద్యోగులుగా తీర్చిదిద్దాలనే సత్సంకల్పంతో, దీప్తి మహిళా సమితితో కలిసి ఆరు నెలల ఉచిత పోటీ పరీక్షల శిక్షణ కార్యక్రమానికి సోమవారం శ్రీకారం చుట్టింది. సాధారణంగా ఇక్కడి పిల్లలు ప్రభుత్వ ఉద్యోగం సాధించాలంటే హైదరాబాద్ లేదా ఇతర నగరాలకు వెళ్లి, వేలాది రూపాయల కోచింగ్ ఫీజులు, హాస్టల్ ఖర్చులు మరియు స్టడీ మెటీరియల్స్ కోసం తల్లిదండ్రులపై మోయలేని ఆర్థిక భారాన్ని మోపాల్సి వచ్చేది. ఈ క్లిష్ట పరిస్థితిని, పేద విద్యార్థుల కష్టాలను గుర్తించిన ఎన్టీపీసీ యాజమాన్యం, స్థానికంగానే కార్పొరేట్ స్థాయి నాణ్యమైన ఉచిత శిక్షణను అందించాలని నిర్ణయించడం గమనార్హం. ఎన్టీపీసీ ఆవరణలోని సాయి సేవా సమితి – లైఫ్ స్కిల్ అకాడమీ వేదికగా ఈ అద్భుత శిక్షణా తరగతులు సోమవారం నుంచే అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. ఈ ఆరు నెలల సుదీర్ఘ ప్రయాణంలో నిపుణులైన అధ్యాపకులచే మార్గదర్శకత్వం, సమగ్రమైన స్టడీ మెటీరియల్స్ మరియు పరీక్షల వ్యూహాలను అందించి యువతను ఉద్యోగ సాధకులుగా మార్చడమే ఈ ప్రోగ్రామ్ యొక్క ముఖ్య ఉద్దేశ్యం అని కంపెనీ అధికారులు తెలిపారు. కేవలం విద్యను అందించడమే కాకుండా, వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపి విభిన్న ప్రభుత్వ ఉద్యోగాల పోటీలో ముందు వరుసలో నిలబెట్టేందుకు ఈ శిక్షణ ఎంతగానో దోహదపడుతుంది. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తూ, వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తున్న ఎన్టీపీసీ రామగుండం సంస్థ తీసుకున్న ఈ చొరవ చుట్టుపక్కల గ్రామాల్లో సరికొత్త వెలుగులను నింపుతోంది. ఈ వినూత్న కార్యక్రమం ద్వారా ఎన్టీపీసీ రామగుండం కేవలం విద్యుత్‌ను మాత్రమే కాకుండా, గ్రామీణ యువత జీవితాల్లో ఆశల దీపాలను కూడా వెలిగిస్తూ సామాజిక–ఆర్థిక అభివృద్ధిలో సరికొత్త చరిత్రను లిఖిస్తోంది.

# ఎముకలు, కీళ్ల ఆరోగ్యానికి పోషకాహారమే బలం

**- ఫార్మా డైరెక్టర్ ఆళ్ళ లీలారాణి - ఐసీఏఐ బృందానికి లీ ఫార్మా ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం**
**- 100 మందికి పైగా ఉద్యోగులకు ఆరోగ్య పరీక్షలు**






**విశాఖపట్నం:జూన్ 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఎముకలు, కీళ్లు పటిష్టంగా ఉండాలంటే పోషకాలు సమృద్ధిగా ఉన్న నాణ్యమైన ఆహారం తీసుకోవడం అత్యంత ముఖ్యమని లీ ఫార్మా డైరెక్టర్ ఆళ్ళ లీలారాణి అన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ, సమతుల్య ఆహారం, క్రమబద్ధమైన జీవనశైలిని అలవాటు చేసుకోవాలని సూచించారు. లీ ఫార్మా లిమిటెడ్, లీ హెల్త్ డొమైన్ ఆధ్వర్యంలో ఐసీఏఐ వైజాగ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ బృందం ఉద్యోగుల కోసం సోమవారం ఉచిత ఎముకలు, కీళ్ల ఆరోగ్య వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి విశేష స్పందన లభించగా, 100 మందికి పైగా ఉద్యోగులు ఆరోగ్య పరీక్షలు చేయించుకుని వైద్యుల సలహాలు పొందారు. శిబిరంలో భాగంగా హ్యాండ్ గ్రిప్ స్ట్రెంత్ (చేతి పట్టు బలం), బాడీ మాస్ ఇండెక్స్ (బీఎంఐ), హీమోగ్లోబిన్ (హెచ్‌బీ), రాండమ్ బ్లడ్ షుగర్ (ఆర్‌బీఎస్), రక్తపోటు (బీపీ), బోన్ మినరల్ డెన్సిటీ (ఎముకల సాంద్రత), బాడీ కంపోజిషన్ అనాలిసిస్ వంటి పలు పరీక్షలు నిర్వహించారు. అనంతరం వైద్యులు, పోషకాహార నిపుణులు పరీక్షల నివేదికలను పరిశీలించి, వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితులకు అనుగుణంగా ఆహారపు అలవాట్లు, జీవనశైలి మార్పులపై కౌన్సిలింగ్ అందించారు. ఈ సందర్భంగా ఆళ్ళ లీలారాణి మాట్లాడుతూ, రోజువారీ ఆహారంలో అవసరమైన పోషకాలు ఉండేలా చూసుకోవాలని, ఆరోగ్య పరిరక్షణలో నిర్లక్ష్యం చేయకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో క్యాంప్ కోఆర్డినేటర్లు సరోజిని, జయలక్ష్మి, డాక్టర్ రాజారామ్, న్యూట్రిషనిస్టులు మాధురి, అనూష, భాగ్యలత, యోగా మాస్టర్ అఖిల్, ఐసీఏఐ వైజాగ్ ఛైర్మన్ సీఏ లోకేష్, ఐసీఏఐ వైజాగ్ సభ్యులు, లీ ఫార్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయమే దేశానికి వెన్నెముక-రైతే మన అన్నదాత

**ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య)**



**వత్సవాయి జూన్ 29 (వార్తప్రభ)** మండలం లోని కన్నెవీడు గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయిలో ఘనంగా నిర్వహించిన ఏరువాక పౌర్ణమి కార్యక్రమంలో శాసనసభ్యులు, తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ,20 సూత్రాల అమలు చైర్మన్ లంక దినకర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సాంప్రదాయ వ్యవసాయ సంస్కృతికి ప్రతీకగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కి గ్రామ రైతులు, మహిళలు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. అలంకరించిన ఎడ్లబండిపై ఎమ్మెల్యే ని ఊరేగింపుగా సభా ప్రాంగణానికి తీసుకువెళ్లగా, గ్రామస్తులు హర్షధ్వానాలతో స్వాగతం తెలిపారు. జానపద కళారూపాలు, మంగళవాయిద్యాలు, సంప్రదాయ వేషధారణలతో కార్యక్రమం ఎంతో వైభవంగా జరిగింది. సభా ప్రాంగణానికి చేరుకున్న అనంతరం ఎమ్మెల్యే , జిల్లా కలెక్టర్ తో కలిసి వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ, పశుసంవర్ధక శాఖ, సహకార శాఖ, వ్యవసాయ అనుబంధ విభాగాలు ఏర్పాటు చేసిన వివిధ ప్రదర్శన స్టాల్స్‌ను సందర్శించి రైతులకు అందుబాటులో ఉన్న ఆధునిక వ్యవసాయ సాంకేతికత, నూతన పంటల సాగు విధానాలు, యంత్రాల వినియోగం, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులతో మమేకమై వారి సమస్యలు, సూచనలు తెలుసుకొని ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. అనంతరం సాంప్రదాయ వ్యవసాయానికి ప్రతీకగా నిర్వహించిన అరక దున్నే కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) స్వయంగా పాల్గొని రైతులతో కలిసి పొలంలో అరక దున్నారు. రైతు జీవన విధానాన్ని ప్రతిబింబించే ఈ కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. రైతుల కష్టాన్ని గుర్తిస్తూ వారి శ్రమకు గౌరవం ఇవ్వడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎమ్మెల్యే అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) మాట్లాడుతూ ఏరువాక పౌర్ణమి తెలుగు రైతు సంప్రదాయంలో అత్యంత విశిష్టమైన పండుగ అని, భూమాతను పూజించి కొత్త వ్యవసాయ సంవత్సరానికి శ్రీకారం చుట్టే పవిత్రమైన రోజుగా రైతులు భావిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా జగ్గయ్యపేట నియోజకవర్గంలోని రైతులందరికీ హృదయపూర్వక ఏరువాక పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు. వ్యవసాయమే దేశానికి వెన్నెముక రైతే మన అన్నదాత అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రైతు సంతోషంగా ఉంటేనే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. రైతు సంక్షేమం, వ్యవసాయాభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రైతుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు, మౌలిక సదుపాయాలు, ఆధునిక వ్యవసాయ విధానాలను అమలు చేస్తోందని వివరించారు. భూమాత ఆశీస్సులతో ఈ ఏడాది సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, ప్రతి రైతు కుటుంబం సుఖసంతోషాలు, ఐశ్వర్యాలతో కళకళలాడాలని ఆకాంక్షించారు. రైతులు ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ నాణ్యమైన విత్తనాలు, శాస్త్రీయ పద్ధతులతో సాగు చేసి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న పథకాలను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని, వ్యవసాయాన్ని మరింత లాభదాయకంగా మార్చేందుకు అధికారులు రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే సూచించారు. గ్రామీణ వ్యవసాయ వ్యవస్థ బలోపేతం, సాగునీటి వసతుల అభివృద్ధి, వ్యవసాయ యాంత్రీకరణకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట మార్కెట్ యార్డ్ చైర్మన్ మల్లెల సీతమ్మ కొండయ్య, వత్సవాయి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వడ్లమూడి రాంబాబు, కానూరి కిషోర్, గ్రామ సొసైటీ చైర్మన్ కర్నాటి శంకర్, సాగర్ల కృష్ణవేణి, చావా నాగేశ్వరరావు, నెల్లూరి శ్రీనివాసరావు, జామ ఆనందరావు, దారెల్లి చిరంజీవి, ఆదిమల్ల రమేష్, చిట్టూరి రమేష్, కర్నాటి వివేక్, ధారావతు శ్రీను, కూరపాటి నాగేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, మహిళలు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కొల్లి కుళ్ళ, సుబ్బాయి గుడెం గ్రామాల్లో "స్వచ్ఛ రథం"



**పెనుగంచిప్రోలు, జూన్ 29 (వార్త ప్రభ )** స్వచ్ఛరథం కొల్లికుళ్ళ,సుబ్బాయిగూడెం గ్రామాలలో తిరుగుతుంది,ప్రజలు వారి ఇళ్లలో వుండే పనికిరాని ప్లాస్టిక్ వస్తువులను, పాత ఇనుము,పాత పుస్తకాలు, పాత పేపర్స్,మొదలైన వాటిని స్వచ్ఛ రథం నిర్వాహకునికి ఇచ్చి వాటికి సరిపడ నిత్యవసరవస్తువులు తీసుకోవచ్చని ఎంపిడిఓ శ్రీమతి జి శ్రీను మేడం తెలియజేశారు, దీనివలన గ్రామం చెత్త రహిత గ్రామంగా ఉంటుందని, ఎంపిడిఓ తెలియజేశారు,

# విశాఖలో నేడు కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం తొలి స్నాతకోత్సవం

**373 మంది పట్టభద్రులకు డిగ్రీ పట్టాలు.. 13 మందికి బంగారు పతకాల ప్రదానం**
**ముఖ్య అతిథిగా విచ్చేస్తున్న భారత రాష్ట్రపతి, హాజరుకానున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు**
**విలేకరుల సమావేశంలో ఛాన్సలర్ మదన్ లాల్ మీనా, వైస్ ఛాన్సలర్ టి. శ్రీనివాసన్**



**విశాఖపట్నం(పి.ఐ.బి.), జూన్ 29 :(వార్తా ప్రభ ప్రతినిధి):** విశాఖపట్నంలో మంగళవారం కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం తొలి స్నాతకోత్సవం (కాన్వొకేషన్) ఘనంగా నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయ ఛాన్సలర్ మదన్ లాల్ మీనా, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి. శ్రీనివాసన్ తెలిపారు. సోమవారం స్థానిక దస్పల్లా హోటల్లో సంయుక్తంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు స్నాతకోత్సవానికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. 2020 నుంచి 2025–26 విద్యా సంవత్సరాల వరకు వివిధ కోర్సులు పూర్తి చేసిన మొత్తం 373 మంది విద్యార్థులకు డిగ్రీ, పీజీ పట్టాలు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. అలాగే అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 13 మంది విద్యార్థులకు రాష్ట్రపతి చేతుల మీదుగా బంగారు పతకాలు అందజేసి సత్కరించనున్నట్లు పేర్కొన్నారు. విజయనగరం కేంద్రంగా 2019లో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటై, 2020 నుంచి తరగతులు ప్రారంభమైనట్లు వివరించారు. ప్రస్తుతం విశ్వవిద్యాలయంలో ఎనిమిది పీజీ కోర్సులు, ఐదు డిగ్రీ కోర్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. స్కూల్ ఆఫ్ సైన్సెస్, స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో విద్యా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని చెప్పారు. స్నాతకోత్సవంలో స్కూల్ ఆఫ్ సైన్సెస్ నుంచి 200 మంది, స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ నుంచి 82 మంది, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ నుంచి 91 మంది విద్యార్థులు పట్టాలు అందుకోనున్నట్లు వెల్లడించారు.

**13 మందికి బంగారు పతకాలు.. అందులో 11 మంది విద్యార్థినులే** ఈ సందర్భంగా ఛాన్సలర్, వైస్ ఛాన్సలర్ మాట్లాడుతూ విశిష్ట ప్రతిభ కనబరిచిన 13 మంది విద్యార్థులకు బంగారు పతకాలు ప్రదానం చేస్తున్నట్లు పేర్కొన్నారు. వారిలో 11 మంది విద్యార్థినులు, ఇద్దరు విద్యార్థులు ఉండటం విశేషమన్నారు. ఎంఎస్సీ కెమిస్ట్రీ విభాగం నుంచి ఐదుగురు, ఇంటిగ్రేటెడ్ ఎంఎస్సీ కెమిస్ట్రీ నుంచి ఇద్దరు, మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్ నుంచి ఇద్దరు, మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ నుంచి ఇద్దరు, ఎంఎస్సీ బయోటెక్నాలజీ నుంచి ఇద్దరు బంగారు పతకాలకు ఎంపికైనట్లు వెల్లడించారు. ఛాన్సలర్ మదన్ లాల్ మీనా మాట్లాడుతూ స్నాతకోత్సవం ప్రతి విద్యార్థి జీవితంలో ఒక ముఖ్యమైన మైలురాయి అని అన్నారు. ఉన్నత విద్యతో పాటు నైతిక విలువలు, సామాజిక బాధ్యత, నవీన ఆలోచనలను అలవరచుకున్నప్పుడే యువత సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించగలదన్నారు. పట్టభద్రులు తమ విద్యను దేశాభివృద్ధికి, సమాజ శ్రేయస్సుకు వినియోగించాలని పిలుపునిచ్చారు. వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి. శ్రీనివాసన్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయం నాణ్యమైన విద్య, పరిశోధన, ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు అనేక వినూత్న కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. స్నాతకోత్సవ కార్యక్రమానికి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ఫౌండర్ వీసీ టి.వి. కట్టిమణి, ఇతర మంత్రులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖ విద్యావేత్తలు, విశిష్ట అతిథులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వివరించారు. పట్టభద్రులు, వారి తల్లిదండ్రులు నిర్ణీత సమయానికి హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. విలేకరుల సమావేశంలో రిజిస్ట్రార్ జితేంద్ర మోహన్ మిశ్రా పాల్గొన్నారు.

## గంజి వెంకట రత్నం కు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం 'డాక్టరేట్' ప్రధానం



**గుడివాడ,జూన్ 29 (వార్తాప్రభ) :** వీ.కే.ఆర్ అండ్ వీ.ఎన్.బి ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతిగా పనిచేస్తున్న గంజి వెంకటరత్నం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం లోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ లో పరిశోధన చేసినందుకు పీహెచ్ డి ప్రధానం చేసినట్లు రీసెర్చ్ అండ్ డవలప్ మెంట్ సెల్ కో-ఆర్డినేటర్ ఆచార్య పి. సుధాకర్ తెలిపారు. "ఏ నావెల్ క్రెడిట్ కార్డ్ ఫ్రాడ్ డిటెక్షన్ ఫ్రేమ్ వర్క్ కంబైనింగ్ ష ఫల్డ్ షెఫర్డ్ పొలిటికల్ ఆప్టిమైజేషన్ అండ్ జెడ్ ఎఫ్ నెట్ వర్క్స్" అను అంశంపై డాక్టర్ సీ.హెచ్ అపర్ణ పర్యవేక్షణలో వెంకటరత్నం పీహెచ్ డి పూర్తి చేశారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెస్సర్ కంచర్ల గంగాధరరావు వెంకటరత్నం కు 'డాక్టరేట్' డిగ్రీ ని ప్రధానం చేశారు. ఈ సందర్భంగా వీ.కే.ఆర్ అండ్ వీ.ఎన్.బి కళాశాల సెక్రటరి, కరస్పాండెంట్ వేములపల్లి కోదండరామయ్య, డైరెక్టర్ బి. కళ్యాణ్ కుమార్, ప్రిన్సిపాల్ డా. ఎస్.హెచ్.వి. ప్రసాదరావు, విభాగాధిపతులు, అధ్యాపకులు, డీన్స్ మరియు విద్యార్థులు డా. వెంకటరత్నం ను పుష్పగుచ్చాలతో అభినందించారు.

## భవన నిర్మాణ కార్మికుల డిమాండ్ల సాధనకు ధర్నా -లేబర్ ఆఫీసర్‌కు వినతిపత్రం



**గుడివాడ,జూన్ 29 (వార్తాప్రభ) :** భవన నిర్మాణ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సోమవారం గుడివాడ లేబర్ ఆఫీస్ వద్ద భవన నిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. గత ఏడు సంవత్సరాలుగా భవన నిర్మాణ కార్మికులకు క్లైయిమ్స్ మంజూరు కాక అనేక ఇబ్బందులకు గురవుతున్నారని సంఘం జిల్లా నాయకుడు రేపాని కొండ తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విధానాలను రద్దుచేసి పాత కార్మిక చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక సంక్షేమ బోర్డు నిధులు సక్రమంగా వినియోగించి పెండింగ్ క్లైయిమ్స్ వెంటనే మంజూరు చేయాలని కోరారు. అనంతరం లేబర్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎ ఎన్ ఆర్ కళాశాలలో జాతీయ గణాంక దినోత్సవం వేడుకలు



**గుడివాడ,జూన్ 29 (వార్తాప్రభ) :** దేశాభివృద్ధికి అవసరమైన నిర్ణయాలు తీసుకోవడంలో గణాంకాలు అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జె.ఎస్. కుమార్ అన్నారు. జాతీయ గణాంక వేడుకల సందర్భంగా కళాశాల స్టాటిస్టిక్స్ విభాగం ఆధ్వర్యంలో ఆన్‌లైన్ క్విజ్, పవర్‌పాయింట్ ప్రజెంటేషన్, పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, పరిపాలనాపరమైన డేటా సామర్థ్యాన్ని వెలికితీయడం, దేశాభివృద్ధికి గణాంక కార్యకలాపాల ప్రాముఖ్యత, ఉపాధి అవకాశాలు, డేటా ఆధారిత నిర్ణయాల అవసరం వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యా ప్రక్రియను మెరుగుపరచడంతో పాటు సమర్థవంతమైన నిర్ణయాలకు గణాంక విశ్లేషణ ఎంతగానో దోహదపడుతుందని వివరించారు. అనంతరం కళాశాల గణాంక శాస్త్ర అధ్యాపకురాలు పి. శ్రీదేవి గణాంక శాస్త్రం యొక్క ప్రాధాన్యం, ప్రస్తుత కాలంలో దాని అవసరం గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు ఎల్.ఆర్.కె. ప్రసాద్, కళాశాల సెక్రటరీ & కరెస్పాండెంట్ కె.ఎస్. అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీమతి బి.ఎస్.ఎస్. పద్మజ, అధ్యాపకులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.



గుడివాడ -పదిహేడవ వార్డు డాక్టర్ గోర్జీ సింహాచలం హాస్పిటల్ మసీదు ఎదురుగా ఉన్న మున్సిపల్ ప్రైమరీ స్కూల్ నందు జరిగిన పల్స్ పోలియో కార్యక్రమం లో ముఖ్య అతిథిగా పాల్గొన్న జనసేన పార్టీ గుడివాడ పట్టణ అధ్యక్షులు, గవర్నమెంట్ హాస్పిటల్ అభివృద్ధి కమిటీ సభ్యులు మజ్జి శ్రీనివాసరావు పాల్గొని పిల్లలకు పోలియో చుక్కలు వేస్తున్న దృశ్యం.. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ వార్డు ఇన్చార్జి షేక్ మీరా షరీఫ్, కమిటీ సభ్యులు గంటా రాజేంద్ర బాబు, ఉయ్యూరు అంజి జనసేన పార్టీ వీర మహిళలు బత్తుల రమాదేవి, పైడి మర్రి నాగరాణి, ఆశావర్కరు ఉప్పాల కుమారి తదితరులు పాల్గొన్నారు.

-గుడివాడ,జూన్ 29 (వార్తాప్రభ) :

# ఉత్తమ సమాజ నిర్మాణానికి సారథులు ఉపాధ్యాయులే...

-ప్రముఖ పారిశ్రామికవేత్త తాళ్ళ వెంకటేష్ యాదవ్....

**విజయవాడ,జూన్ 29 (వార్తాప్రభ) :** దేశ భవిష్యత్తుని తరగతి గదుల లో తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులు ఉత్తమ సమాజ నిర్మాణానికి సారథులని తెలుగు దేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, పారిశ్రామిక వేత్త, ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ తాళ్ల వెంకటేష్ యాదవ్ అన్నారు. విజయవాడ డెమొక్రటిక్ పి ఆర్ టి యు రాష్ట్ర కార్యాలయశీ లో మంగళ వారం జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశం నకు ముఖ్య అతిథిగా విచ్చేసిన తాళ్ల వెంకటేష్ యాదవ్ మాట్లాడుతూ మంచి ఉపాధ్యాయులు ఈ దేశానికి నిజమైన సంపదని వారి బోధనతోనే దేశానికి ఉపయోగ పడే చక్కటి యువతరం రూపుదిద్దుకుంటుదని అన్నారు. సభకు అధ్యక్షత వహించిన రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ డి.శ్రీను మాట్లాడుతూ 2004 కంటే ముందే నోటి ఫై అయిన ఉద్యోగ ఉపాధ్యాయుల కు పాత పెన్షన్ విధానం వర్తించే విధంగా గురుకులాల లో వివిధ ప్రభుత్వ రంగ సంస్థల్లో పని చేస్తున్న ఉద్యోగుల పదవి విరమణ వయోపరిమితి 60 నుండి 62 సంవత్సరాలకు పెంచడం హర్షనీయమని ఈ సందర్భంగా ముఖ్య మంత్రి చంద్రబాబు కు తమ సంఘం పక్షాన కృతజ్ఞతలు తెలియజే స్తున్నామన్నారు. త్వరలోనే ఉద్యోగులు ఎదురు చూస్తున్న పి.ఆర్.సి.ని ఏర్పాటు చేసి తాత్కాలిక భృతి ప్రకటించవలసిన అవసరత ఉందని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్




పరీక్షల మినహాయించాలని ప్రభుత్వం ను కోరారు. ఈ సమావేశం లో అన్ని జిల్లాల కు చెందిన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాష్ట్ర కౌన్సిలర్లు హాజరై ఏక గ్రీవంగా జ్ఞానేశ్వర్ రావు ను నూతన రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పి. వెంకటేశ్వర రావు ను రాష్ట్ర గౌరవాధ్యక్షులు గా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారిగా ఎస్. బాలసుందర్ రావు విశిష్ట అతిథిగా లయన్ నాయకులు ఉపేంద్ర, టి.సంపత్, అధిక సంఖ్యలో డెమొక్రటిక్ పి ఆర్ టి యు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వైద్య సంస్థల్లో అగ్నిభద్రతపై అవగాహన

### గుడివాడ అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో మాక్ డ్రిల్లులు



**గుడివాడ,జూన్ 29 (వార్తాప్రభ) :** ప్రజల ప్రాణాలను కాపాడే వైద్య సంస్థలు అగ్నిప్రమాదాల విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని గుడివాడ అగ్నిమాపక కేంద్రం అధికారులు సూచించారు. అగ్నిప్రమాదాల నివారణతో పాటు అత్యవసర పరిస్థితుల్లో సిబ్బంది సమయస్ఫూర్తితో వ్యవహరించేందుకు అవగాహన కల్పించే ఉద్దేశంతో సోమవారం గుడివాడ డయాగ్నస్టిక్ సెంటర్, శ్రీ లాస్య డెంటల్ కేర్ సెంటర్, నక్షత్ర డెంటల్ హాస్పిటల్లలో అగ్నిభద్రతా అవగాహన కార్యక్రమాలు, మాక్ డ్రిల్లులు నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక సిబ్బంది ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ కేంద్రాల్లో సంభవించే అగ్నిప్రమాదాల కారణాలు, వాటిని నివారించే మార్గాలు, విద్యుత్ భద్రత, ఆక్సిజన్ సిలిండర్ల నిర్వహణ, అత్యవసర నిష్క్రమణ మార్గాల వినియోగం వంటి అంశాలను సవివరంగా వివరించారు. అనంతరం ఫైర్ ఎక్స్టింగ్విషర్ల వినియోగంపై ప్రత్యక్ష ప్రదర్శన నిర్వహించి, నర్సింగ్ సిబ్బంది, ఉద్యోగులతో స్వయంగా అగ్నిమాపక పరికరాలను వినియోగింపజేశారు. అత్యవసర పరిస్థితుల్లో భయాందోళనలకు గురికాకుండా మొదటి కొన్ని నిమిషాల్లో సరైన చర్యలు తీసుకుంటే పెద్ద ప్రమాదాలను సైతం నివారించవచ్చని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుడివాడ అగ్నిమాపక కేంద్రం అధికారులు, అగ్నిమాపక సిబ్బంది, హాస్పిటల్స్ వైద్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# నాగేంద్ర స్వామి దేవాలయం పునః ప్రారంభం

● పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సింహాద్రి,యువ నేత వెంకట రామ్, జడ్పిటిసి యాదవ రెడ్డి





**కోడూరు ,జూన్ 29 (వార్తాప్రభ) :** కోడూరు గ్రామ పరిధిలోని స్వతంత్ర పురం గ్రామంలో గల నాగేంద్ర స్వామి వారి దేవాలయం నూతనంగా పున ప్రారంభ కార్యక్రమం ఘనంగా జరిగింది. సోమవారం ఉదయం ప్రదక్షిణ,గోపూజ, గణపతి పూజ, దీక్షాధారణ, మండపారాధన పూర్ణహుతి కార్యక్రమలను వైబోపితంగా నిర్వహించారు. అనంతరం స్వామి వారికి అభిషేక కార్యక్రమాలు నిర్వహించగా, మాజీ శాసన సభ్యులు సింహాద్రి రమేష్ బాబు, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ తనయుడు మండలి వెంకట్రామ్,జడ్పిటిసి యాదవ రెడ్డి వెంకట సత్యనారాయణ, ఎంపీటీసీలు బడే హేమ గంగాధర్ రావు, తిమ్మన వెంకట నాంచారయ్య, మెండు అర్జున్ రావు, పూత బోయిన కామేశ్వరరావు, జనసేన నేతలు కోట రాంబాబు, కాగిత రామారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, మండలి వెంకట్రామ్, జడ్పిటిసి యాదవ రెడ్డి వెంకట సత్యనారాయణ లను కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు.. అనంతరం దేవస్థానం భక్తులకు భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. నాగేంద్ర స్వామివారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

## సమస్యల పరిష్కారం కోరుతూ సివిల్ సప్లై ముఠావర్కర్ల నిరసన



**గుడివాడ,జూన్ 29 (వార్తాప్రభ) :** ఆంధ్ర ప్రదేశ్ సివిల్ సప్లై ముఠావర్కర్స్ సోమవారం రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేయడం జరిగింది. ఈ సమ్మెకు మద్దతుగా గుడివాడ మార్కెట్ యార్డులో ఉన్న సివిల్ సప్లై ముఠావర్కర్స్ సమ్మెకు పూర్తి మద్దతు తెలిపారు. గతంలో ప్రభుత్వం సివిల్ సప్లై లో పనిచేసిన ముఠా వర్కర్స్ కు ఒకేసారి వేతనం చెల్లించే వారు, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వేతనం కేంద్ర ప్రభుత్వం ఒకసారి రాష్ట్ర ప్రభుత్వం ఒకసారి చెల్లించడం వలన అనేక ఇబ్బందులు పడుతున్నారు, మూడు నెలలకు ఒకసారి వేత్తనాలు బిల్లులు రావడం వలన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు, ఏ నెలకు ఆ నెల బిల్లు చెల్లించాల్సిందిగా డిమాండ్ చేశారు. ఈఎస్ఐ, పిఎఫ్ చెల్లించాలని, ముఠావర్కర్ పనిచేస్తూ చనిపోతే ముఠావర్కర్ కి 10 లక్షల ఎక్స్గ్రేషన్ ఇవ్వాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, కార్మికులు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్సీపి రెడ్డి, ముఠావర్కర్స్ మేడేపల్లి పద్మారావు, కామరాజు గడ్డ రాంబాబు, సమ్మెట శ్రీనివాసు, గోరిపర్తి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

# రంగయ్య అప్పారావుపేట శ్రీ కోదండ రామస్వామి దేవస్థానంలో వైభవంగా సంప్రోక్షణ - కుంభాభిషేక మహోత్సవం







**హనుమాన్ జంక్షన్, జూన్ 29 (వార్తాప్రభ) :** బాపులపాడు మండలం, రంగయ్య అప్పారావుపేట గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ సీతా సమేత కోదండ రామస్వామి దేవస్థానంలో, ఏరువాక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని సంప్రోక్షణ, కుంభాభిషేక మహోత్సవాలు అత్యంత వైభవోపేతంగా, వేదఘోషల మధ్య భక్తిశ్రద్ధలతో నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా ఈరోజు తెల్లవారుజామున 3 గంటలకు శ్రీ మహాగణ పతి పూజతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతరం పుణ్యాహ వాచనం, పంచగవ్యారాధన, సంప్రోక్షణ వంటి వైదిక క్రతువులు నిర్వహించి, పవిత్ర నదీజలాలతో శ్రీ సీతా సమేత కోదండ రామస్వామి, శ్రీ లక్ష్మణస్వామి, శ్రీ ఆంజనేయస్వామి, శ్రీ గోదా రంగనాథస్వామి, శ్రీ విఘ్నేశ్వరస్వామి, శ్రీ దాసాంజనేయస్వామి వారికి మహాభిషేకాలు వైభవంగా నిర్వహించారు. అనంతరం ఆలయ విమాన గోపురానికి వేదమంత్రోచ్చారణల నడుమ కుంభాభిషేకం నిర్వహించగా, ఆ పవిత్ర ఘట్టాన్ని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. తదుపరి స్వామివారికి గోత్రనామాలతో విశేష పుష్పార్చన నిర్వహించారు. అనంతరం జరిగిన ఆకాశ ప్రసాదం స్వీకరించేందుకు మహిళా భక్తులు భక్తిశ్రద్ధలతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ కోదండ రామస్వామి ఆలయ అభివృద్ధి కమిటీ కోశాధికారి శ్రీమతి పరుచూరి సుకన్య మాట్లాడుతూ, గ్రామంలో ధర్మం, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, రైతుల సంక్షేమం, విద్యాభివృద్ధి, ఆరోగ్యం, సుఖశాంతులు, సస్యశ్యామలత, సర్వసమృద్ధులు నెలకొనాలని సంకల్పించి ఈ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి సంవత్సరం ఏరువాక పౌర్ణమి సందర్భంగా ఈ పవిత్ర కార్యక్రమాలను నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. అదేవిధంగా, రైతుల సంక్షేమాన్ని ఆకాంక్షిస్తూ ప్రత్యేకంగా పూజించిన ధాన్యాన్ని ప్రసాదంగా రైతులకు పంపిణీ చేశారు. వారు నారుమళ్లు పోసే సమయంలో ఈ పవిత్ర ధాన్యాన్ని వినియోగిస్తే పంటలు సమృద్ధిగా పండాలని, శ్రీ కోదండ రామస్వామి వారి దివ్య అనుగ్రహం ఎల్లప్పుడూ రైతులపై ఉండాలని ఆలయ నిర్వాహకులు ఆకాంక్షించారు. ఈ మహోత్సవాన్ని ఆలయ ప్రధాన అర్చకులు సామవేదం శ్రీనివాసు శర్మ వేదోక్త విధానంలో అత్యంత శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరుచూరి రామకృష్ణ, దొడ్డపనేని సుశీల, కొల్లిపర శివ నాగేశ్వరమ్మ, పరుచూరి వెంకటసుబ్బమ్మ, లింగం పద్మజ్యోతి, మున్నంగి శివకుమారి, లింగినేని జయలక్ష్మి, సజ్జా రంగావర్ధిని, దొడ్డపనేని భారతీ లక్ష్మి, పొట్లూరి నాగమల్లేశ్వరి, కాటగడ్డ కృష్ణకుమారి, యార్లగడ్డ నాగరత్నమ్మ, నల్లిబోయిన ఈశ్వరమ్మ, నల్లిబోయిన నాంచారమ్మ, కొత్తపల్లి ప్రమీల, కొత్తపల్లి రాజేశ్వరరావు, భూమా లీలమ్మ, లింగం దుర్గ, కొల్లిపర వెంకటేశ్వరరావు, పొట్లూరి వెంకటేశ్వరరావు, నల్లిబోయిన శ్రీనివాసరావు, నల్లిబోయిన శ్రీరాములు, కొక్కిరిపాటి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి అర్జీపైనా ప్రత్యేక దృష్టి పెట్టండి..

● అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యలను పరిష్కరించండి... ● జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ



**విజయవాడ,జూన్ 29 (వార్తాప్రభ) :** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టమ్-పీజీఆర్ఎస్) ద్వారా అందుతున్న ప్రతి అర్జీపైనా సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, అర్జీదారులు పూర్తిస్థాయిలో సంతృప్తి చెందేలా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ, అధికారులతో కలిసి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో మొత్తం 147 అర్జీలు అందగా.. వీటిలో రెవిన్యూ 37, పోలీస్ 25, ఎంఏయూడి 16, ఏపీ ఎస్ డబ్ల్యూఆర్ఐఈఎస్ 12, పంచాయతీరాజ్ 11, ఇంకా వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన 46 అర్జీలను స్వీకరించినట్లు జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ తెలిపారు.

# 'ఆసిడ్ ఫ్లై'పై అపోహలు వద్దు సరైన అవగాహనతోనే రక్షణ

● స్పర్శతో వచ్చే చర్మ అలర్జీ, బొబ్బల పురుగు వల్ల వచ్చే చర్మవాపు ● చర్మంపై నలిపితేనే సమస్య సూర్య స్కిన్ హాస్పిటల్ అధినేత డా. కడి రమేష్

**అమలాపురం,జూన్ 29 (వార్తాప్రభ) :** వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో బొబ్బల పురుగు, "ఆసిడ్ ఫ్లై", "నైరోబీ ఫ్లై", "యాసిడ్ పురుగు" పేర్లతో ఒక చిన్న పురుగు గురించి సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. ఈ పురుగు తాకితే చర్మం పూర్తిగా కాలిపోతుందని, ఇది అత్యంత ప్రమాదకరమైనదని, ప్రాణాపాయం కూడా కలిగిస్తుందని వస్తున్న సందేశాలు ప్రజల్లో తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. అయితే వీటిలో చాలా వరకు శాస్త్రీయ ఆధారం లేని అతిశయోక్తులేనని ప్రముఖ చర్మవ్యాధి నిపుణులు స్పష్టం చేస్తున్నారు. సూర్య స్కిన్ హాస్పిటల్ అధినేత ప్రముఖ చర్మవాధి నిపుణులు డా. కడి రమేష్ మాట్లాడుతూ, ఈ పురుగు అసలు పేరు పేడరస్ లేదా రోవ్ బీటిల్ అని తెలిపారు. ఇది మనుషులను కుట్టదని, కరవదని, శరీరంలోకి విషాన్ని ఇంజెక్ట్ చేయదని వివరించారు. ఈ పురుగు సాధారణంగా చర్మంపై వాలినప్పుడు దానిని చేతితో కొట్టి నలిపితేనే సమస్య ప్రారంభమవుతుందని చెప్పారు. పురుగును శరీరంపై నలిపినప్పుడు దాని నుంచి పెడెరిన్ అనే రసాయన పదార్థం విడుదలవుతుంది. ఈ పదార్థం చర్మాన్ని తాకినప్పుడు కొందరిలో మంట, ఎర్రబడటం, దురద, నీటితో నిండిన బొబ్బలు, మచ్చలు వంటి లక్షణాలు కనిపించవచ్చని తెలిపారు. ఈ పరిస్థితిని వైద్యపరంగా పేడరస్ డెర్మటైటిస్ లేదా పేడరస్ చర్మవాపు అని పిలుస్తారని చెప్పారు.






**వర్షాకాలంలో ఎందుకు ఎక్కువగా కనిపిస్తాయి?..** వర్షాకాలంలో తేమ అధికంగా ఉండే ప్రాంతాలు, పచ్చదనం ఎక్కువగా ఉన్న ప్రదేశాలు, వ్యవసాయ పొలాలు, చెరువుల పరిసరాలు, తోటలు వంటి ప్రాంతాల్లో ఈ పురుగులు ఎక్కువగా కనిపిస్తాయి. ముఖ్యంగా రాత్రివేళల్లో విద్యుత్ దీపాల వెలుతురుకు ఆకర్షితమై ఇళ్లలోకి కూడా ప్రవేశిస్తాయి. అయితే అవి కనిపించాయని భయపడాల్సిన అవసరం లేదని డా. రమేష్ స్పష్టం చేశారు. ఈ పురుగు వల్ల ఏర్పడే చర్మ సమస్యలను చాలా వరకు నివారించవచ్చని చెబుతూ ఆయన కొన్ని సూచనలు చేశారు. రాత్రివేళల్లో కిటికీలు, వెంటిలేటర్లకు దోమతెరలు లేదా మెష్ ఏర్పాటు చేయాలి. అవసరం లేని వెలుతురును తగ్గించాలి. పురుగు శరీరంపై వాలితే చేతితో కొట్టి నలపకూడదు. మెల్లగా ఊది పంపించడం లేదా కాగితం సహాయంతో తొలగించడం మంచిది. పురుగు తాకిందని అనుమానం వచ్చిన వెంటనే ఆ ప్రాంతాన్ని సబ్బు, పరిశుభ్రమైన నీటితో బాగా కడుక్కోవాలి. పిల్లలు పురుగులను చేతులతో పట్టుకోకుండా వారికి అవగాహన కల్పించాలి. బయట ధరించిన దుస్తులను శుభ్రంగా ఉతికి మళ్లీ ఉపయోగించడం మంచిదని సూచించారు. చర్మంపై మంట, ఎర్రదనం లేదా చిన్న బొబ్బలు ఏర్పడిన సందర్భాల్లో చాలా వరకు కొన్ని రోజుల్లో అవే తగ్గిపోతాయని తెలిపారు. అయితే క్రింది పరిస్థితుల్లో మాత్రం తప్పనిసరిగా చర్మవ్యాధి నిపుణులను సంప్రదించాలని సూచించారు. మంట తీవ్రంగా ఉండడం. పెద్ద పరిమాణంలో బొబ్బలు ఏర్పడడం. ముఖం, కళ్ల చుట్టూ ప్రభావం కనిపించడం. శరీరంలోని ఎక్కువ భాగానికి వ్యాపించడం. చిన్నారులు, వృద్ధుల్లో తీవ్ర లక్షణాలు కనిపిస్తాయని, వైద్యుల సూచనల మేరకు మాత్రమే మందులు, లేపనాలు వాడాలని, ఇంటర్నెట్‌లో చూసి లేదా ఇతరుల సలహాలతో స్వయంగా మందులు వాడకూడదని హెచ్చరించారు. ఇతర చర్మవ్యాధులతో పొరబడే అవకాశం పేడరస్ చర్మవాపు లక్షణాలు కొన్ని సందర్భాల్లో ఇతర చర్మవ్యాధులను పోలి ఉంటాయని డా. రమేష్ తెలిపారు. ముఖ్యంగా సర్పి (షింగిల్స్), హెర్పిస్ సింప్లెక్స్, ఇంపెటిగో, స్పర్శతో వచ్చే చర్మ అలర్జీ (కాంటాక్ట్ డెర్మటైటిస్), బొబ్బల పురుగు వల్ల వచ్చే చర్మవాపు వంటి సమస్యలతో పొరబడే అవకాశం ఉందన్నారు. సరైన నిర్ధారణ కోసం తప్పనిసరిగా చర్మవ్యాధి నిపుణులను సంప్రదించడం అవసరమని సూచించారు.

**సోషల్ మీడియా ప్రచారాలను నమ్మొద్దు..** సామాజిక మాధ్యమాల్లో వచ్చే ప్రతి సందేశాన్ని నిజమని భావించి భయపడవద్దని డా. కడి రమేష్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. "ఆసిడ్ ఫ్లై" అనే పేరుతో ప్రచారంలో ఉన్న సమాచారం చాలా వరకు అపోహలేనని, ఈ పురుగు మనుషులను కుట్టదని, చర్మంపై నలిపినప్పుడే రసాయన ప్రభావం వల్ల సమస్య ఏర్పడుతుందని వివరించారు. సరైన అవగాహన, పరిశుభ్రత, సాధారణ జాగ్రత్తలు పాటించడం ద్వారా ఈ సమస్యను చాలా వరకు నివారించవచ్చని, చర్మంపై అసాధారణ లక్షణాలు కనిపించినప్పుడు ఆలస్యం చేయకుండా నిపుణులను సంప్రదిస్తే త్వరగా కోలుకునే అవకాశం ఉంటుందని సూర్య స్కిన్ హాస్పిటల్ అధినేత ప్రముఖ చర్మవ్యాధి నిపుణులు డా. కడి రమేష్ పేర్కొన్నారు.

# ప్రగతి పథంలో కాకినాడ టౌన్ బ్యాంక్

● ఈ ఏడాది మార్చి 31కి 16 కోట్ల 19 లక్షల నికర లాభం ● సభ్యులకు 12శాతం డివిడెంట్

● బ్యాంక్ చైర్మన్ చిట్టూరి రవీంద్ర వెల్లడి



**కాకినాడ,జూన్ 29 (వార్తాప్రభ) :** ఖాతాదారులకు మెరుగైన సేవలను అందిస్తూ ప్రగతి పథంలో ది కాకినాడ కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ ఎంతో పురోగతితో ముందుకు వెళుతుందని 47వ వార్షిక ప్రణాళికను బ్యాంక్ చైర్మన్ చిట్టూరి రవీంద్ర వెల్లడించారు. అంతేగాక ఈ ఏడాది మార్చి 31వ తేదీ నాటికి 16 కోట్ల 19లక్షల నికర లాభం సాధించి ఉండంతో ఖాతాదారులకు 12 శాతం డివిడెంట్ ఇచ్చేందుకు బ్యాంక్ పాలకవర్గం ఆమోదించినట్లు రవీంద్ర తెలిపారు. సోమవారం టౌన్ బ్యాంక్ 47వ వార్షిక నివేదికను రవీంద్ర స్థానికంగా ఓ హోటల్లో విలేకరులతో సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న 16 సహకార బ్యాంకులలో కాకినాడ టౌన్ బ్యాంక్ 2040 కోట్ల టర్నోవర్తో రెండో స్థానంలో ఉందన్నారు. రికార్డు స్థాయిలో బ్యాంక్ టర్నోవర్ ఈ ఏడాది మార్చి 31 నాటికి తాము బిజినెస్ లక్ష్యాన్ని రెండు వేల కోట్లకు నిర్ధారించుకోగా అది అధిగమించి 2040 కోట్ల చేరి రిజర్వ్ బ్యాంక్ దృష్టిలో టైర్ - 3 బ్యాంకుగా స్థిరమైన స్థానం పొందిందన్నారు. మార్చి 31 తేదీ నాటికి బ్యాంకు డిపాజిట్లు 1235.56 కోట్లు, లోన్లు 804.12 కోట్లు, పొదుపు 552.14 కోట్లు, అలాగే 198.20 కోట్లు బ్యాంకు సొంత నిధులు ఉన్నట్లు వెల్లడించారు. ఈ 30 మార్చి 31వ తేదీ నాటికి ఇన్కమ్ టాక్స్ 5.60 కోట్లు చెల్లించిన తర్వాత 16.19 కోట్లు లాభం ఆర్జించినట్లు వెల్లడించారు. బ్యాంకు డేటా చోరీ జరగకుండా ఒరాకిల్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నామని ఇది మరో 15 రోజుల్లో అమల్లోకి వస్తది దీని ద్వారా బ్యాంక్ సైబర్ సెక్యూరిటీకి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. బ్యాంకు ప్రగతి పదంలో నిలిపేందుకు ఖాతాదారుల సేవల కోసం వివిధ కమిటీలను నియమించామని అవి పూర్తిస్థాయిలో పని చేస్తాయని చెప్పారు. బ్యాంకు ప్రధాన కేంద్రంలో ఖాతాదారుల కోసం లాకర్స్ ప్లాజా పేరుతో కొత్త బిల్డింగ్ నిర్మించామని దానిని తక్కువ ఛార్జీలతో వినియోగించుకోవాలని రవీంద్ర సూచించారు. వివిధ రుణాలపై ఎటువంటి చార్జీలు తీసుకోకుండా ఖాతాదారులకు నగదును అందిస్తున్నట్లుగాను, మండపేటలో ఒక బ్యాంకును టేకోవర్ చేసుకున్నామని అది త్వరలోనే వివరిస్తామని వెల్లడించారు. ఖాతాదారులకు మేలైన సేవలు అందించే లక్ష్యంగా బ్యాంకును పురోగతిలో ముందుకు తీసుకెళ్లేందుకు పాలకవర్గం సమన్వయంతో పనిచేసి మన్ననలను అందుకునేందుకు ఎనలేని కృషి చేస్తామని రవీంద్ర వెల్లడించారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు మదాని హుస్సేన్ మోహిద్దీన్ ఖాన్, కంటిపూడి సత్యనారాయణ, గొల్లపూడి కృష్ణమూర్తి, గారపాటి అచ్యుత కళ్యాణ్ ప్రసాద్, సత్తి రామారెడ్డి, రిమ్మలపూడి ధర్మేంద్ర, అయ్యగారి వెంకటేష్, మల్లిపూడి శివరామ ప్రసాద్, బ్యాంకు సీఈవో సి సుగుణ రావు తదితరులు పాల్గొన్నారు.

# యుటిఎఫ్ కృషి ఫలితంగా ఉపాధ్యాయులకు పిఎఫ్ స్లిప్పుల అందజేత



**కృత్తివెన్ను,జూన్ 29 (వార్తాప్రభ) :** ఉపాధ్యాయులకు2022 ప్రావిడెంట్ ఫండ్ కు జమ చేయబడిన స్లిప్పులు అందని కారణంగా 2025 నవంబర్ నెలలో కృష్ణాజిల్లా ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా నాయకులు జెడ్పి సీఈవో కన్నమ నాయుడు దృష్టికి తీసుకువెళ్లి మెమొరాండం ఇవ్వడం జరిగింది .2026 జనవరి 30న యుటిఎఫ్ జిల్లా అగ్ర నాయకులు బి కనకారావు మహమ్మద్ షౌకత్ హుస్సేన్, ఉమామహేశ్వరరావు ,లెనిన్ బాబు జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ మీటింగ్ నందు గౌరవ కలెక్టర్ బాలాజీ గారి దృష్టికి ఈ విషయం తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించి అధికారులకు ఆదేశాలు ఇవ్వడం మూలంగా ఉపాధ్యాయుల యొక్క ప్రావిడెంట్ ఫండ్ లోని మిస్సింగ్ క్రెడిట్లు అలాగే పిఎఫ్ ఆన్లైన్ కార్యక్రమం వేగవంతంగా జరిగి ఈరోజు జిల్లాలోని అందరు ఉపాధ్యాయులకు పోస్టు ద్వారా ప్రావిడెంట్ ఫండ్స్ స్లిప్పులు అందజేయడం జరేగింది. ఈ సందర్భంగా యు టీ ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కొప్పినీడి సూర్య ప్రకాష్ ,జిల్లా కార్యవర్గ సభ్యులు బి వీరాస్వామి, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్ రామకృష్ణ, ఉండి పురుషోత్తం ,యుటిఎఫ్ మండల్ నాయకులు సైకం ఆదినారాయణ,సిహెచ్ రంగనాయకులు ,సానా ఏడుకొండలు ,పట్టాభి విశ్వనాథ్ ,సత్యనారాయణ నాగరాజు ,వీరంకి శ్రీనివాసరావు ,చంద్రమోహన్ తదితరులు గౌరవ కలెక్టర్ శ్రీ బాలాజీ గారికి జిల్లా పరిషత్ అధికారులకు యుటిఎఫ్ జిల్లా బాధ్యులకు కృతజ్ఞతలు తెలియజేయడం జరిగినది.

# మూల్పూరు వెంకటరత్నం జీవితం విలువల రాజకీయాలకు నిదర్శనం: ఎమ్మెల్యే యార్లగడ్డ

● 1983 నుంచి టీడీపీకి జీవితాంతం నిబద్ధతతో పనిచేసిన నాయకుడు మూల్పూరు : యార్లగడ్డ

● పేర్ని నాని, కొడాలి నాని కృష్ణా జిల్లా రాజకీయాలను భ్రష్టు పట్టించారు: యార్లగడ్డలి

● కుటిల రాజకీయాలు నేను చేయను.. ప్రజల కోసమే పని చేస్తా: యార్లగడ్డ

● మూల్పూరు వెంకటరత్నం రాజకీయ జీవితాన్ని కార్యకర్తలు ఆదర్శంగా తీసుకోవాలి: యార్లగడ్డ





**హనుమాన్ జంక్షన్, జూన్ 29 (వార్తాప్రభ) :** బాపులపాడు మండలం హనుమాన్ జంక్షన్లోని కాకాని కళ్యాణ మండపంలో దివంగత మూల్పూరు వెంకటరత్నం (మునసబు) గారి సంస్మరణ సభ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ హాజరై వెంకటరత్నం గారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ వెంకటరత్నం 1983 నుంచి తెలుగుదేశం పార్టీ పట్ల జీవితాంతం నిబద్ధతతో పనిచేసిన నాయకుడని కొనియాడారు. తాను వైసీపీలో ఉన్న సమయంలో కూడా వ్యక్తిగతంగా ఆప్యాయంగా మెలిగినా, పార్టీ పట్ల తన విధేయతను ఏమాత్రం విడిచిపెట్టలేదని గుర్తు చేశారు. రాజకీయాల్లో అభిప్రాయ భేదాలు సహజమేనని, కానీ పార్టీ పట్ల అంకితభావం, సిద్ధాంతాల పట్ల నిబద్ధత ప్రతి కార్యకర్తకు ఆదర్శమని అన్నారు. పోలవరం – ఏలూరు కాలువ అనుసంధానం రూ.38 కోట్ల నిధులు సాధించామని, అసెంబ్లీలో పోరాడి ఈ నిధులను తీసుకొచ్చానని అన్నారు. మాజీ మంత్రులు పేర్ని నాని, కొడాలి నానిలపై విమర్శలు చేస్తూ, కృష్ణా జిల్లా రాజకీయాలను భ్రష్టు పట్టించారని, జగన్మోహన్ రెడ్డి రాజకీయ పతనానికి వారిద్దరి వైఖరే కారణమని ఆరోపించారు. అభివృద్ధిపై ఎక్కడైనా బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరిన ఆయన, తాను కుటిల రాజకీయాలు చేయనని, ప్రజల హక్కులు, పార్టీ కార్యకర్తల గౌరవాన్ని కాపాడేందుకు ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు. మంచి తనాన్ని చేతగానితనంగా భావించవద్దని హెచ్చరిస్తూ, మూల్పూరు వెంకటరత్నం రాజకీయ జీవితాన్ని ప్రతి కార్యకర్త ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, మునసబు గారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొని ఆయనకు ఘన నివాళులర్పించారు.

# చేపల వేటకు వెళ్లిన మామ అల్లుళ్ళ అనుమానాస్పద మృతి...



**కృత్తివెన్ను,జూన్ 29 (వార్తాప్రభ) :** కృత్తివెన్ను మండలం చినగొల్లపాలెం గ్రామంలో అమానుష ఘటన చోటుచేసుకుంది. చేపల వేటకు వెళ్లిన మామా అల్లుళ్లు శెట్టి సుబ్బన్న, గొలుసు అయ్యప్పలు అనుమానాస్పదంగా మృతి చెందారు. కొత్త కాలువ మొగ వద్ద వీరి మృతదేహాలు బైక్ పై తాళ్లతో కట్టి ఉన్న స్థితిలో లభ్యమవడం స్థానికంగా కలకలం రెపింది. సమాచారం అందుకున్న కృత్తివెన్ను పోలీసులు, సిఐ నాగేంద్రప్రసాద్, ఎస్ ఐ పైడి బాబు సంఘటన స్థలానికి చేరుకుని అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కేసు తీవ్రత దృష్ట్యా జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు సంఘటనా స్థలానికి చేరుకుని అన్ని కోణాలలో దర్యాప్తును ముమ్మరం చేశారు. మామ అల్లుళ్ళ మృతిపై గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

# 5 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బోడె..



**కంకిపాడు,జూన్ 29 (వార్తాప్రభ)** కూటమి ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాలలో నియోజకవర్గంలో 200 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టి వేగవంతంగా పూర్తి చేశామని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. కంకిపాడు మండలం ఈడుపుగల్లు గ్రామంలోని బందర్ రోడ్డు నుంచి ఈడుపుగల్లు గ్రామ శివారు వరకు సుమారు సిఆర్డిఏ నిధులు ఐదు కోట్లతో నిర్మించే అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే బోడి ప్రసాద్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న విజయవాడ నగరానికి అతి సమీపంలో ఉన్న ఈడుపుగల్లు గ్రామం ప్రశాంతమైన వాతావరణం, అన్ని వసతులు కలిగిన ప్రాంతం కావడంతో గేటెడ్ కమ్యూనిటీ, అపార్ట్మెంట్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారానికి అనువుగా మారి వేగంగా విస్తరిస్తుందన్నారు. గ్రామానికి ప్రధాన రహదారిని, అంతర్గత రోడ్లను ఇప్పటికే అభివృద్ధి చేశామని తెలిపారు. ఈ కొత్త బైపాస్ రహదారి గ్రామానికి మరింత శోభనిస్తుందని అన్నారు. రానున్న రెండు నెలల్లో పల్లె పండుగ -3 కార్యక్రమం ద్వారా అంతర్గత రహదారుల అభివృద్ధికి శ్రీకారం చుడుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నేరుసు రాజ్యలక్ష్మి, మాజీ ఎంపీపీ దేవినేని రాజా, మండల పార్టీ అధ్యక్షుడు జంపాన వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ ఇందిరాని, నియోజకవర్గం బీసీ సెల్ అధ్యక్షుడు సంగేపు రంగారావు గ్రామ టిడిపి నాయకులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే లక్ష్యంగా కేడీసీసీ బ్యాంక్ ప్రగతి పథంలో దూసుకెళ్తోంది

● 2026-27 వార్షిక సర్వసభ్య సమావేశంలో పలు కీలక తీర్మానాలు. ● నాబార్డ్ మార్గదర్శకాల మేరకు ఆర్థిక పరిపుష్టి లేని పిఎసిఎస్ ఉద్యోగుల జీతాల చెల్లింపుల కోసం జిల్లా స్థాయి సహకార స్థిరీకరణ నిధి (డి ఎల్ ఎస్ ఎఫ్) గ్రాంట్ కింద ?4.43 కోట్ల మంజూరుకు సర్వసభ్య సమావేశం ఆమోదం. ● - 12,456.77 కోట్ల వ్యాపారం -- ?82 కోట్ల నికర లాభంతో రాష్ట్రంలో అగ్రగామిగా కేడీసీసీ బ్యాంక్. ● రైతులు, సహకార సంఘాలు, ఉద్యోగుల సంక్షేమమే బ్యాంక్ ప్రధాన లక్ష్యం -- చైర్మన్ నెట్టెం రఘురాం






**మచిలీపట్నం,జూన్ 29 (వార్తాప్రభ) :** కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (కేడీసీసీ బ్యాంక్) 2026-27 వార్షిక సర్వసభ్య సమావేశం బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో చైర్మన్ నెట్టెం శ్రీ రఘురాం అధ్యక్షతన ఘనంగా జరిగింది. ఈ సమావేశంలో వార్షిక నివేదిక, ఆడిట్ నివేదిక, ఆర్థిక ప్రగతి, భవిష్యత్ కార్యాచరణ, సహకార సంఘాల బలోపేతానికి సంబంధించిన పలు కీలక తీర్మానాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా చైర్మన్ నెట్టెం రఘురాం మాట్లాడుతూ, రైతు సంక్షేమం, సహకార రంగ అభివృద్ధి, పారదర్శక పాలన, సభ్యులకు నాణ్యమైన బ్యాంకింగ్ సేవలందించడమే కేడీసీసీ బ్యాంక్ ధ్యేయమని పేర్కొన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే లక్ష్యంతో వ్యవసాయం, పాడి, మత్స్య, పౌల్ట్రీ, ఉద్యానవనం, మహిళా స్వయం సహాయక సంఘాలు, యువ పారిశ్రామికవేత్తలకు ప్రాధాన్యతతో రుణాలు అందిస్తున్నామని తెలిపారు. పీఎంఈజీపి పిఎం సూర్యఘర్, వ్యవసాయ అనుబంధ రంగాలు, స్వయం ఉపాధి పథకాల కింద భారీగా రుణాలు అందిస్తున్నామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలుకు ప్రత్యేక రుణాలు, విద్యార్థులకు విద్యా రుణాలను కూడా ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. 2015కు ముందు రుణాలు పొంది వివిధ కారణాలతో చెల్లించలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు వన్ టైమ్ సెటిల్మెంట్ (ఓ టి ఎస్) అమలు చేయనున్నట్లు తెలిపారు. అలాగే 3 లక్షల వరకు పంట రుణాలు తీసుకుని మరణించిన అప్పుదారుల కుటుంబాలకు వడ్డీని పూర్తిగా మాఫీ చేయాలని సర్వసభ్య సమావేశం తీర్మానించినట్లు వెల్లడించారు. బ్యాంకు విస్తరణలో భాగంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అనుమతితో , వెలటూరు శాఖను ప్రారంభించామని, సేరి లక్ష్మీపురం రెడ్డిగూడెం శాఖలను ప్రారంభిస్తామని భవిష్యత్తులో ఊటుకూరు, మీర్జాపురం, చిల్లకల్లు, సింగరాయపాలెం ప్రాంతాల్లో కూడా నూతన శాఖల ఏర్పాటుకు ఆర్బీఐకి ప్రతిపాదనలు పంపినట్లు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు బ్యాంకింగ్ సేవలను మరింత చేరువ చేయడానికి మూడు మొబైల్ బ్యాంకింగ్ వాహనాలు, మొబైల్ యాప్, యూపీఐ, క్యూ ఆర్ చెల్లింపులు వంటి డిజిటల్ సేవలను విస్తరిస్తున్నామని తెలిపారు. 2022-27 వేతన ఒప్పందాన్ని అమలు చేసి రాష్ట్రంలోనే తొలిసారిగా ఏరియర్స్‌తో సహా ఉద్యోగులకు పెరిగిన వేతనాలు చెల్లించిన జిల్లా సహకార బ్యాంక్ కేడీసీసీ బ్యాంకేనని చైర్మన్ గర్వంగా పేర్కొన్నారు. అదేవిధంగా సొసైటీ అధ్యక్షులు మరియు ఉద్యోగులకు రూ.5 లక్షల ఆరోగ్య బీమా కల్పించే నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలే గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అని పేర్కొంటూ,పిఎసిఎస్ బలోపేతం కాకుండా రైతు సంక్షేమం సాధ్యం కాదన్నారు. ప్రతి సంఘం రైతులకు నమ్మకమైన ఆర్థిక భాగస్వామిగా నిలవాలని సూచించారు. రుణాల పంపిణీతో పాటు వసూళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, 100 శాతం రుణ వసూళ్లు సాధించే సంఘాలే ఆదర్శ సహకార సంఘాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆప్కాబ్, నాబార్డ్ మార్గదర్శకాల మేరకు పిఎసిఎస్ లను కంప్యూటరీకరణ, కోర్ బ్యాంకింగ్, యూపీఐ క్యూఆర్ చెల్లింపులు వంటి ఆధునిక సాంకేతిక సేవలతో అనుసంధానం చేస్తున్నామని తెలిపారు. రైతులు గ్రామాన్ని విడిచి వెళ్లకుండా తమ సహకార సంఘంలోనే అన్ని బ్యాంకింగ్ సేవలు పొందేలా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి నాబార్డ్ మార్గదర్శకాల మేరకు ఆర్థికంగా బలహీనంగా ఉన్న పిఎసిఎస్ లలో పనిచేస్తున్న అర్హులైన ఉద్యోగుల జీతాల చెల్లింపుల కోసం జిల్లా స్థాయి సహకార స్థిరీకరణ నిధి (డి ఎల్ ఎస్ ఎఫ్) గ్రాంట్ కింద 4.43 కోట్ల మంజూరుకు సర్వసభ్య సమావేశం ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయం సహకార సంఘాల ఆర్థిక స్థిరత్వాన్ని పెంచడంతో పాటు ఉద్యోగుల సంక్షేమానికి మరింత భరోసా కల్పిస్తుందని చైర్మన్ పేర్కొన్నారు. బ్యాంక్ సీఈఓ శ్యామ్ మనోహర్ వార్షిక నివేదికను సభ ముందుంచి మాట్లాడుతూ, 2025-26 ఆర్థిక సంవత్సరంలో బ్యాంక్ 82 కోట్ల నికర లాభం నమోదు చేసిందని తెలిపారు. మొత్తం వ్యాపారం 12,456.77 కోట్లకు, డిపాజిట్లు 3,850.76 కోట్లకు, రుణాలు 8,606.01 కోట్లకు చేరుకున్నాయని వెల్లడించారు. వరుసగా 'ఏ 'ఆడిట్ క్లాసిఫికేషన్ కొనసాగిస్తూ ఆర్థిక క్రమశిక్షణ, రుణ వసూళ్లు, డిజిటల్ సేవల విస్తరణలో విశేష పురోగతి సాధించిందన్నారు. ఆప్కాబ్ మేనేజింగ్ డైరెక్టర్ వెంకట రామకృష్ణ మాట్లాడుతూ, చైర్మన్ నెట్టెం రఘురాం నాయకత్వంలో కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ రాష్ట్రంలోనే అత్యుత్తమ జిల్లా సహకార బ్యాంకులలో ఒకటిగా ఎదిగిందని ప్రశంసించారు. రైతు సంక్షేమం, పారదర్శక పాలన, ఆర్థిక క్రమశిక్షణలో కేడీసీసీ బ్యాంక్ ఇతర జిల్లాలకు ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొంటూ, భవిష్యత్తులో కూడా ఆప్కాబ్ తరఫున సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.సమావేశంలో 100 శాతం రుణ వసూళ్లు సాధించిన 61 సహకార సంఘాలు, చైర్‌పర్సన్లు, డైరెక్టర్లు, సీఈఓలు, ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. చివరగా పలువురు పిఎసిఎస్అధ్యక్షులు మాట్లాడుతూ, కేడీసీసీ బ్యాంక్‌ను రాష్ట్రంలో ఆదర్శ సహకార బ్యాంకుగా తీర్చిదిద్దిన చైర్మన్ శ్రీ నెట్టెం రఘురాం నాయకత్వాన్ని కొనియాడుతూ, రైతు సంక్షేమం, సహకార రంగ బలోపేతం కోసం ఆయన తీసుకుంటున్న నిర్ణయాలకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా చైర్మన్ నాయకత్వంలో బ్యాంక్ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంకు ప్రొఫెషనల్ డైరెక్టర్ మురళీధర్, ఆప్కాబ్ జనరల్ మేనేజర్ జమున, డి ఎల్ చంద్రశేఖర్ రెడ్డి, కేడీసీసీ బ్యాంకు జనరల్ మేనేజర్ చంద్రశేఖర్, రంగబాబు, ఉమ్మడి కృష్ణా జిల్లా పరిధిలోని అన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పిఎసిఎస్) అధ్యక్షులు పాల్గొన్నారు.

# రైతుల ఇంట ధాన్యరాశులు నిండాలి..

● మండలి వెంకట్రామ్ ఆకాంక్ష. ● యార్లగడ్డలో ఏరువాక పౌర్ణమి వేడుకలు



**చల్లపల్లి/అవనిగడ్డ,జూన్ 29 (వార్తాప్రభ) :** ఈ ఏడాది వర్షాలు సకాలంలో సమృద్ధిగా కురిసి రైతు సోదరుల ఇంట ధాన్యరాశులు నిండాలని నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ ఆకాంక్షించారు. సోమవారం ఏరువాక పౌర్ణమి వేడుకలు చల్లపల్లి మండలం యార్లగడ్డలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండలి వెంకట్రామ్ విచ్చేసి జోడెడ్లకు పూజలు చేసి పొలం దున్ని, వరి విత్తనాలు చల్లి వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాత – సుఖీభవ అంటూ కూటమి ప్రభుత్వం అందిస్తున్న అండదండలతో రైతు సోదరులు ఆర్థికంగా బలోపేతం కావాలని, ఆంధ్రరాష్ట్రం అన్నపూర్ణగా వర్ధిల్లాలని కోరుకున్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, చల్లపల్లి పీఏసీఎస్ చైర్మన్ బొందలపాటి వీరబాబు, మాజీ సర్పంచులు పరుచూరి సురేష్, బొబ్బా కృష్ణారావు, ఏఓ కే.మురళీకృష్ణ, పలువురు రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.ఇదే విధంగా అవనిగడ్డలో జరిగిన ఏరువాక కార్యక్రమంలో అవనిగడ్డ ఎఎంసి చైర్మన్ కొల్లూరు వెంకటేశ్వరరావు స్థానిక కూటమి శ్రేణులు , రైతులతో కలిసి పాల్గొని అరక దున్ని , విత్తనాలు చల్లి వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు.

# శ్రీ కాటమరాజు గంగాభవాని దేవస్థానం వద్ద బీసీ కమ్యూనిటీ హాల్‌కు రూ.32 లక్షలు మంజూరు

--టిడిపి ఇన్చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు కి ధన్యవాదాలులితెలిపిన దేవస్థాన కమిటీ



**మార్కాపురం, జూన్ 29 (వార్తాప్రభ) :** శ్రీ కాటమరాజు గంగాభవాని దేవస్థానం అభివృద్ధే ధ్యేయంగా ఎన్నో పనులను రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో మంజూరు చేయిస్తున్న యర్రగొండపాలెం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్ బాబు మరో ఘనత సాధించారు. ఇటీవల రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు యాదవ్ నిధుల నుండి శ్రీ కాటమరాజు స్వామి వారి ఆలయం వద్ద బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.32 లక్షలు మంజూరు చేయించిన సందర్భంగా, తెలుగుదేశం పార్టీ పెద్దారవీడు మండలం తరపున గూడూరి ఎరిక్షన్ బాబు కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పెద్దారవీడు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మెట్టు శ్రీనివాస రెడ్డి , ఆంధ్రప్రదేశ్ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ నక్కా శ్రీను, క్లస్టర్ ఇంచార్జి జెండా రవి,కాటమరాజు దేవస్థానం ఉపాధ్యక్షులు గంగుల ఎల్లయ్య యాదవ్, మాజీ సర్పంచ్ ఇండ్ల రామకృష్ణారెడ్డి, సొసైటీ చైర్మన్ వెన్నా బోడి రెడ్డి, సీనియర్ నాయకులు చింతకుంట్ల సుబ్బరామిరెడ్డి , యూనిట్ ఇంచార్జి తోకల ఎల్లయ్య యాదవ్, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు లింగాల అబ్రహం, మాజీ సర్పంచ్ యాన వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీటీసీ వెన్న వెంకట్ రెడ్డి , తెలుగుదేశం పార్టీ నాయకులు కోనంగి పాలంకయ్య, మాజీ మండల ఉపాధ్యక్షులు పాముల పోలరాజు, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు ఆనకాల శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు నాలి శ్రీను, వెన్నా వెంగల్ రెడ్డి, తిరుమలరెడ్డి వెంకటరెడ్డి , బొచ్చు వెంకటేశ్వర్ రెడ్డి , మండల బీసీ సెల్ అధ్యక్షులు రాగల ఈశ్వర్ కుమార్, ఐటీడీపీ సభ్యులు మూడమంచు చిన్నబి, చేతుల నాగరాజు, కుర్రా శ్రీనివాసులు, దానం, యానా కాశి రాములు, అట్లూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188